
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

2-8, మే, '86

రు. 2-50



సెక్స్ ఎడ్యుకేషన్ అవసరమా


కొత్తది
Super Soft
Conditioner
Anti-Dandruff Shampoo
All In One
కేశసంరక్షణి కండిషనర్
కురులను చెదిరిపోనీయదు
చుండ్రునివారిణి షాంపూ
"సూపర్ సాఫ్ట్! అమ్మయ్య. ఇప్పటికైనా ఒక చుండ్రు నిర్మూలనే గాకుండ నా కురులను మృదువుగా, మెరిసేలా, జారిపోయేలా, మనసుకు హత్తుకునేలా తీర్చిదిద్దే ఒక సలక్షణ షాంపూ అంటూ లభిస్తున్నది."
అన్ని గుణాలు ఒకేదానిలో
An Eskayef Product

పిల్లి మెడలో గంట కట్టటం ఎలా?

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

"పిల్లి మెడలో గంట కట్టటం ఎలా" అనే ఒకే ఒక పంక్తి చర్చనీయాంశం ఉన్న ఆహ్వానం మూడు వందల ఎలుకలకి పంపబడింది.

ఒక నేలమాళిగలో వాటి సమావేశం జరిగింది. అక్కడే ఎందుకు జరగాలి అన్నాను నేను. ఎందుకు జరగకూడదు అన్నదో ఎలుక. హిట్లర్ కూడా తన మొదటి సమావేశాన్ని మ్యూనిచ్‌లోని ఒక నేలమాళిగలోనే జరిపాడు. హిట్లర్‌ని ఉదహరించడం ఎందుకో నాకు అంత మంచి శకునంలా అనిపించకపోయినా ఊరుకున్నాను. అక్కడ చిన్నా, పెద్దా, ధోవతులు ధరించినవి, నాణ్యమైన పాలిస్టర్ సఫారి సూట్లు వేసుకున్నవి, బలిసినవి, బలహీనంగా ఉన్నవి ఎన్నో రకాల ఎలుకలు ఉన్నాయి. పైపు కాల్చే ఎలుక కూడా ఉంది అందులో. ఆ ముఖం బాగా తెలిసినదే, అలాగే ఆ స్వరం కూడా చిరపరిచితమే. కానీ ఆ ఎలుక ఎందువల్లనో చాలా ఆందోళనగా ఉన్నట్లు ఆ ముఖమే చెపుతున్నది.

మొట్టమొదట ఆ పిల్లిని వదిలించుకుని అంతా బాగు చేసుకోవాలి అన్నది పైప్‌తో ఉన్న ఎలుక తన సహచరుడైన ధోవతి కట్టుకున్న మరో మూషికంతో. నేను కొన్ని రోజులుగా పస్తులు ఉంటూ ఉంటే ఆ పిల్లి, దాని మిత్రబృందం విదేశాల నించి దిగుమతి అయిన మంచి ఆహారాన్ని తింటున్నారని వాపోయింది ఆ ధోవతి కట్టిన ఎలుక.

అనుకోకుండా ఆ పిల్లి ఒకటవ నెంబరు స్థానంలోకి వచ్చిందని, అసలతనికి ఏమీ తెలియదని, కానీ ఎలుకలు మాత్రం ఒక నేలమాళిగ నుంచి మరో దానికి తరమబడుతున్నాయని, ఎలుకలు తమ పని తాము చేసుకునే విధంగా ఒక సంధి కుదురుస్తానని ఆ పిల్లి వాగ్దానం చేసిందని కానీ అతను చేసిన, ప్రయత్నించిన ప్రతి పనీ విఫలం అయిందని, మళ్ళీ ఎలుకలని బెదిరించటం జరుగుతున్నదని, వాస్తవానికి కొన్ని ఎలుకలు చంపబడటమో, పట్టుబడటమో జరిగిందని, ఇకపై అలా జరగటానికి వీలు లేదని అన్నది పైప్‌తో ఉన్న ఎలుక.

తాడో పేడో తేల్చుకోవాలనే ఉద్దేశంతోనే ఆ సమావేశం ప్రారంభం అయింది. ఆ పిల్లి ఇప్పుడు తాను ఉన్న స్థానానికి రాక ముందు చేస్తున్న పనిలోకే తిరిగి వెళ్ళాలని-ఎడ్లబండి నడిపేదన్నారు ఎవరో – అలా కాని పక్షంలో అతనికి వ్యతిరేకంగా వోటు చేసి ఆ స్థానం నించి దింపేయాలని చేతులు ఎత్తడం ద్వారా ఆ సమావేశంలో అంగీకారం కుదిరింది. ఆ పిల్లికి కూడా తెలుసు తాను ఆ స్థానంలో ఎక్కువ కాలం ఉండలేనని. కానీ అతనికి విదేశాలలో బలవంతులైన మిత్రులు ఉన్నారు – ఉత్తరాన ఒక ఎలుగుబంటి. పశ్చిమాన ఒక గద్ద. పదవి నించి దింపేస్తామని బెదిరిస్తే అతను తన మిత్రుల సహాయంతో కల్లోలాన్ని సృష్టించి అందరికీ కష్టాలని కలిగిస్తాడు.

అర్థంలేని మాట అన్నది మరో ఎలుక. ఇతనికి దక్షిణాదిన మంచి పలుకుబడి ఉన్నది, అక్కడ ఉన్న ఒక పెద్ద మద్య వ్యాపారితో దగ్గరి సంబంధాలున్నాయంటారు. అతను గొంతెత్తి చెప్పటం ప్రారంభించాడు. ఫెర్డినాండ్ మార్కోస్ కూడా ఇలాగే అన్నాడు. కానీ చివరికి ఆయన నిష్క్రమించక తప్పలేదు. భార్య ఇమెల్డాతో సహా తనతో పాటు ఆయన కొత్తగా ముద్రింపబడిన తాజా కరెన్సీ నోట్లు ఉన్న ఓ డజను పెట్టెలని తీసుకెళ్ళగలిగాడు కాని ఆయనకి పతనం తప్పలేదు. మార్కోస్, బేబీడాక్‌లే అలా పోయినపుడు మన పిల్లి ఒక లెక్కా? అన్నదా ఎలుక.

కొంత సేపు అంతా నిశ్శబ్దం. ఇంతలో ఆ పిల్లికి రక్షణ ఏర్పాట్లు చాలా ఉన్నాయని, మిత్రులనే అతను చూడడు కదా ఇక మన సంగతి ఏమిటి? అన్నారు ఎవరో. ఎన్నో అడ్డంకులని దాటుకుని పోవాల్సి ఉంటుంది, ప్రతి మలుపులో సోదా జరుగుతుంది. మనని చూడటానికి అతను అంగీకరించక పోతే ఏమి చెయ్యాలి?

మనం ఆ పిల్లికి ఒక శ్రీముఖం ఇవ్వాలి. అది ఎలాంటిదంటే కొరజాన్ అక్వినో మార్కోస్‌కి ఇచ్చినటువంటిది. మార్కోస్ ఏమన్నాడో తెలుసా? తనని హెలికాప్టర్‌లో తీసుకు వెళ్తే తప్పకుండా వెళ్తానన్నాడు. తన సైనికులపై ఆయనకి అంత నమ్మకం లేదు అన్నది పైపు కాల్చే ఎలుక. తాను ఆ శ్రీముఖాన్ని నాయకుడి దగ్గరకి తీసుకెళ్ళడానికి, పరిస్థితి ఆయనకి వివరించటానికి సిద్ధంగా ఉన్నట్లు కూడా చెప్పింది.

దానికి అంగీకరించడం జరిగింది. శ్రీముఖం ముసాయిదాని పైపు కాలుస్తున్న ఎలుక రూపొందించింది. దాని సారాంశం ఏమిటంటే నాయకుడు పరిస్థితిని అస్తవ్యస్తం చేసాడు కాబట్టి పరిణతి చెందిన, అనుభవం కల, కంప్యూటర్‌ల కన్నా రాజకీయాలు బాగా తెలిసిన మరొకరికి చోటు కల్పిస్తూ తాను తప్పుకోవాల్సి ఉంటుందని.

పైప్‌తో ఉన్న ఎలుకే ఒంటరిగా వెళ్తుందా లేక తనతో పాటు ఒక ప్రతినిధి వర్గాన్ని తీసుకు వెళ్తుందా? తాను ఒంటరిగానే వెళ్ళ గలనని కానీ అయిదుగురున్న ఒక ప్రతినిధి వర్గంగా వెళ్ళటం మంచిదన్నారు కాబట్టి ధోవతి కట్టుకున్న ఎలుక, దక్షిణాది ఎలుక ఉన్నటువంటి అయిదుగురు సభ్యులు గల ప్రతినిధి వర్గంగా వెళ్ళవలసిందిగా కోరటమైనదని, మిగతా రెండు ఎలుకలూ కేవలం తోడుగా ఉండేందుకు మాత్రమే నని పైపు కాల్చే ఎలుక అన్నది. వారితో పాటు పత్రికా ప్రతినిధిగా నేను కూడా వెళ్ళాలని ఎవరో సూచించారు. నాకు అలాంటి వాటిలో అంత అనుభవం లేదని చెప్పినా మిగతా వాళ్ళ మీద ఒక కన్ను వేసి ఉండవలసిందిగా వాళ్ళు నన్ను కోరారు.

ఆ పిల్లికి వంట్లో బాగా లేదని అతని కార్యదర్శి చెప్పి వేచి ఉండమన్నాడు. ఎంత సేపు అని అడిగాము. కొన్ని నిముషాలు లేదా గంటలు, ఎవరికీ తెలియదు. హెలికాప్టర్ కూడా వెళ్ళటానికి సాహసించని లోతట్టు ప్రాంతాలలో నాయకుడు మూడు రోజుల పాటు పర్యటించి వచ్చాడు.

మేము ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన అవసరం లేకపోయింది. ముఖ మంతా నవ్వు పులుముకుని ఉన్నది ఆ పిల్లి. వంటగదిలో వేట బాగా దొరికినప్పుడు పిల్లులు అలాగే నవ్వుతాయి. ఆదివాసుల ప్రాంతాలలో పర్యటన ఎలా జరిగింది? ఇబ్బంది ఏమి కలగ లేదనే అనుకుంటాను అంటూ కుశల మడిగింది పైపుతో ఉన్న ఎలుక. ఆ స్వరం జబ్బు పడిన ఒక పిల్లవాడిని డాక్టర్ అడుగుతున్నట్లు ఉన్నది

ఇబ్బంది ఏమి కలగలేదు . కానీ మాకు అక్కడి స్థానిక భాష తెలియనందు వల్ల వాళ్ళేమి చెపుతున్నదీ మాకు అర్థం కాలేదు. వారి సమస్యలు పరిష్కరించేందుకు ఒక సంఘాన్ని నియమిస్తున్నామని చెప్పాను. ఆ సంఘం ప్రధాన కార్యాలయం జెనీవాలో నెలకొల్ప బడుతుంది. అక్కడైతేనే పని బాగా జరుగుతుంది. రీగన్, గోర్బచేవ్‌లు గత సంవత్సరమే ఆ విషయాన్ని కనిపెట్టారు. స్విస్ బాంకులు కూడా అందుబాటులో ఉంటాయి. మన దేశంలోని గిరిజనుల సమస్యలకి సంబంధించిన సమాచారం అంతా వాళ్ళ దగ్గర ఉన్నది తెలుసా!

నివేదిక సమర్పించటానికి కేబినెట్ హోదా కల మంత్రి లేకపోతే ఆ సంఘం నిరుపయోగం అనీ, ఉన్నతాధికార సంఘం ఒక దాని భుజస్కంధాలపై ఆ అధికారం ఉండాలనీ అన్నది పైప్‌తో ఉన్న ఎలుక.

అవును, నిజమే అన్నది పిల్లి. ఆ విషయం మేము ఆలోచించాము . అందులో కేబినెట్ మంత్రి ఒకరు, ఇద్దరు సహాయ మంత్రులు, డెప్యూటీ మంత్రులిద్దరు ఉంటారు. అంతేకాకుండా ఒక సమాచార డైరెక్టర్ జనరల్‌ని కూడా వెయ్యవచ్చు అంటూ నా వైపోసారి దృష్టి సారించింది పిల్లి. అది చాలా బాగున్నదన్నది పైప్‌తో ఉన్న ఎలుక. ఆయనా ఆ నలుగురు సహచరులు తలుపు బిగించేసారు. ఆ తర్వాత వాళ్ళు మళ్ళీ కనిపించలేదు.

ఆ తరువాతి వారం మళ్ళీ ఒకే ఒక పంక్తి గల అదే చర్చనీయాంశంతో మరో సమావేశం ఏర్పాటు చెయ్యబడింది. అయితే ఈ సారి 295 మంది సభ్యులకే ఆహ్వానాలు వెళ్తున్నాయి. నాకు మాత్రం ఎలుపు రాలేదు! □

నవభారత్ 1986

ఈ దశాబ్దపు సాటిలేని మేటి రచయిత

యండమూరి వీరేంద్రనాథ్



వర్తమాన రాజకీయాలపై వచ్చిన తొలి తెలుగునవల!

* కనురెప్పపాటులో కల్లోలం సృష్టించిన రాక్షసుడు!
* ధర్మం నడిచిన దారుల్లో నెత్తుటి మరకలు చూపెట్టిన రాక్షసుడు!
* నీతి గుండెల్లో నిద్రించిన 'బుల్లెట్' రాక్షసుడు!
* కళ్ళ నీటిలో నిశీధి అంచుమాపే రాక్షసుడు!
* రాటు తేలిన గుండెలో అన్యాయాలకు అడ్డు కట్ట రాక్షసుడు!
* రాజకీయ స్లోగన్స్‌తో సోలిపోయిన సొసైటీని నిద్ర లేపిన రాక్షసుడు!
* అవగాహనకీ, ఉద్రేకానికీ మధ్య తీర్పు చెప్పిన రాక్షసుడు!
* డీప్ షాక్‌లో 'డిగ్నిటీ డిప్లొమా' రాక్షసుడు!
* మరణంలో జన్మించిన నవ్య వేదపు నాదం రాక్షసుడు!
* ఆఖరి శ్వాసలో ప్రపంచానికి మానిఫెస్టో చెప్పిన రాక్షసుడు!

రాక్షసుడు -2

రూ 20/-

* దంతముల పెరుగుదల - వివిధ దశలు
* పిప్పిపన్ను జాగ్రత్తలు...
* కిళ్ళీలు నమిలేవారి నోటిలో గమ్మత్తులు
* నోటిపూత నివారణోపాయాలు...
* దంతవ్యాధులు - - దేహారోగ్యం.,.
* ఆహారపు అలవాట్లు..దంత వ్యాధులు,..
* నోటి శుభ్రత - తీసుకోవాల్సినజాగ్రత్తలు
* పళ్ళు తోముకొనే విధానాలు...

ఈ విధమైన పంటి సమస్యలకు డా. కె.ఎల్.వి. ప్రసాద్ ఇస్తున్న సలహాలు

దంత సంరక్షణ రు. 15/-



అడుగడుగునా బుసకొట్టే పడగనీడ...
ఘడియ ఘడియకో భయంకర సంఘటన...
పొంచి దూకే ప్రమాదం నుంచి కడు నేర్పుతో డేర్-డెవిల్.
ప్రవృత్తితో ఎదుర్కొన్న ఓ సాహస యువతి...
నేటి మహిళా లోకానికి ఇస్తున్న ఆత్మవిశ్వాసపు శంఖారావం!
మన్నెం శారద - పిలుపు నీకోసమే! రూ. 16/-
ఉత్తమ సస్పెన్స్ నవలల పోటీలో బహుమతి పొందిన నవల!





అమెరికాలో ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఓ యువ తెలుగు జంట. వారి జీవితాశ పిల్లల పంట. పిల్లల కోసం ఆరాటపడే వారి మనస్తత్వ పరిశీలనతో పాటు ఆధునిక వైద్య విజ్ఞానం విరాజిల్లుతున్న అమెరికన్ హాస్పిటల్స్‌లో తీసుకొనే నిర్ణయాలను యార్లగడ్డ కిమీర - పరిశీలించి పరిశోధించి మనకు అందించిన ఆధునిక వైద్య వైజ్ఞానిక నవల!
అమెరికాలో ఓ మల్లిక! రూ. 20/-

BHASKAR

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు : (1938-1972)

2 - 8 మే, '1986
శ్రీ అక్షయ నామ సం. చైత్ర. బ. నవమి
సంపుటము 78 : సంచిక 34

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు. 2-50
పోస్ట్‌లో 6నెలల చందా	రు. 71.50
పోస్ట్‌లో 12నెలల చందా	రు. 143.00

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధినగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
"అపూర్వ సహోదరులు" లో
నందమూరి బాలకృష్ణ, విజయశాంతి

కథలు :

పెద్ద కథ:

సీరియల్ నవలలు:

వ్యాసాల్లు, శీర్షికలు :



జయసుధ సమాధానాలు

నటి "విజయశాంతి" (28-3 ఏప్రిల్) ముఖచిత్రం మమ్మల్ని ఆకట్టుకుంది. కొత్త శీర్షిక "జయసుధ - సమాధానాలు" మధు పానీయములు కంటే గమ్మత్తుని యిస్తున్నాయి.

కె. శాంతారావు,
బాలేరు (కొత్తూరు)

గంగోత్రి

(28-3-86) మార్చి, ఏప్రియల్ విజయశాంతి ముఖచిత్రంలోని "యోగ భూమి గంగోత్రి" అనే అంశంలో మీరు ప్రచురించిన బొమ్మలు చూసి నిజంగా గంగోత్రిని చూస్తున్నట్లుగా మమ్ము ఆకట్టుకొన్నది."

డాక్టర్ జి. యస్. మూర్తి, కైకలూరు

బ్రూస్ లీ చరిత్ర

నటి "రజని" ముఖ చిత్రంతో వెలువడిన పత్రికలో "యర్రగుంట్ల వరలక్ష్మిదేవి" గారి "బ్రూస్‌లీ చరిత్ర" చాల బావుంది. బ్రూస్‌లీ జీవితం గురించి తెలియని ఎందరికో అతని గురించి ఈ విధంగా తెలియజేస్తున్న రచయిత్రి గార్కి మా ధన్యవాదాలు

– జి. కృష్ణకుమార్, వెదురుపాక

* * *

బ్రూస్‌లీ చరిత్ర మమ్మల్ని ఆకట్టుకొంది. ఫోటోలతో సహా ప్రచురిస్తున్నందుకు కృతజ్ఞతలు.

– ఎస్. సాయి ప్రసాద్, ఎస్. వి.జి. కుమార్,
విజయనగరం

కృతజ్ఞతలు

బ్రూస్‌లీ చరిత్ర ద్వారా /బ్రూస్‌లీ గురించి సంగ్రహముగా తెలియ జేస్తున్న యర్రగుంట్ల వరలక్ష్మిదేవి గారికి మా కృతజ్ఞతలు.

– పి. శ్రీరామచంద్రమూర్తి, గుంటూరు

కింగ్ ఆఫ్ కుంగ్‌ఫూ

కింగ్‌ఆఫ్ కుంగ్‌ఫూ, బ్రూస్‌లీ చరిత్రను వ్రాస్తున్న యర్రగుంట్ల వరలక్ష్మిదేవిగార్కి మా ధన్యవాదాలు. ఇంత చక్కటి సీరియల్ ప్రచురిస్తున్నందుకు మా హృదయపూర్వక ధన్యవాదాలు.

–రూపా అశోక్, ప్రభాకర్, ఇల్లందు

సీరియల్స్

28-3-86 విజయశాంతి ముఖచిత్రంతో వెలువడిన (మా) ఆంధ్రసచిత్ర వారపత్రిక చాలా ఆకర్షనీయంగా ఉంది. వ్యక్తిత్వం, పడమట సంధ్యారాగం కథలు చాల బాగున్నాయి.

కొత్త సీరియల్ జీవితం చేజారిందా?మొదటిలోనే మమ్ములనెంతో ఆకట్టుకుంది.

నాగండ్ల వెంకటేశ్వరరావు,
" రమేష్,
అమ్మాపాలెం

కథలు

రజని ముఖచిత్రంతో వెలువడిన సంచికలో "నన్ను క్షమించండి, మనసు కిచ్చిన మాట" కథలు బాగున్నాయి.

– సి. హెచ్. క్రాంతి, శృంగవరపు కోట

న్యూఢిల్లీ లేఖ

మార్చి 14వ తేది వెలువడిన ఆంధ్రసచిత్ర వారపత్రికలోని డా. జయ్ దుబాషిగారి న్యూఢిల్లీలేఖ మాకు ఎంతో నచ్చింది. న్యూఢిల్లీ లేఖ చదివేందుకే మేము మీ పత్రికను కొంటున్నామంటే నిజంగా నమ్మండి.

– ఎమ్. లక్ష్మినారాయణ, ఎ. కొడూరు

సీరియల్

బలి కోరిన ప్రేమ

ఎం.డి.సౌజన్య

(గతసంచిక తరువాయి)

రెండవ రోజు అన్నపూర్ణ వాళ్ళమ్మతో – తన నాటక పరిషత్ సర్టిఫికెట్లతో, ఇంటర్ పాస్ సర్టిఫికేట్లతో – వివిధ ఆటల పోటీల్లో వచ్చిన బహుమతుల మెరిట్ సర్టిఫికేట్లతో, టర్నర్ సత్రం ప్రాంగణంలో వున్న జనతా ఎంటర్ ప్రయిజెస్ షాపుకు చేరుకుంది.

అక్కడ జనం– ఆడా, మగా అంత మంది వుంటారని ఆమె ఊహించ లేదు!!

వాళ్ళందరినీ క్యూలో నిలబెట్టటానికి పోలీసులు, సబ్ ఇన్స్పెక్టర్లుండటమే ఆమెకు మరింత ఆశ్చర్యం కలిగించింది!!

"మైగాడ్....!! దేశంలో నిరుద్యోగ సమస్య ఎంత విలయ తాండవం ఆడుతుందో తెలియటానికి.... యిక్కడున్న యువతీ యువకుల సంఖ్యాబలమే ప్రబల నిదర్శనం!" అనుకుంది.

మైకుల్లో పేర్లు వరుసగా పిలుస్తున్నారు.

"అమ్మాయీ నీ పేరుతో నువ్వసలు అప్లికేషన్ పెట్టలేదనుకుంటా....!?" అంది రాజేశ్వరి కూతురుతో.

తల్లి అడిగిన ప్రశ్న ప్రక్క వాళ్ళెవరైనా విన్నారేమోనని చుట్టూ పట్ల చూసింది అన్నపూర్ణ కంగారుగా!

ఎవరి గొడవలో వాళ్ళున్నారు!!

"మైకులో తరువాత పిలువ వలసింది నా పేరే?" అన్నట్టు ఎవరిమటుకు వాళ్ళు– యుద్ధరంగంలోకి వెళ్ళటానికి సిద్ధమవుతున్న యోధుల్లా సిద్ధమవుతున్నారు.

కొందరు జనరల్ నాలెడ్జి గైడ్లు చదువుకుంటున్నారు.

"హర్యానా ముఖ్యమంత్రి ఎవరో?" అడుగుతోంది ఒక అమ్మాయి మరో అమ్మాయిని.

"హర్యానా ముఖ్య మంత్రులు గంటకు ఒకరు మారుతుంటారు! మన ఇంటర్వ్యూ అయ్యే టయానికి ఎవరుంటారో!?" చెప్పింది రెండవ అమ్మాయి.

"మరి ఒకవేళ అడిగితే ఎవరి పేరు చెప్పాలి!?" మొదటి అమ్మాయి అమాయకంగా మళ్ళీ అడిగింది.

"భింద్రన్‌వాలే!.... అను!"– చెప్పింది.

"అతను కాదనుకుంటా!? అతను చనిపోయాడుగా!?"

జరిగిన కథ-4: ప్రఖ్యాత నటి అన్నపూర్ణను ఒక కోటీశ్వరురాలు తన కన్నకొడుకు ప్రాణాలు కాపాడమని వేడుకుంది. ఆ కోటీశ్వరురాలు కోరుతున్న పని నటనకు సంబంధించినది కాబట్టి అన్నపూర్ణ ఆమె అభ్యర్థనను ఒప్పుకోలేకపోతోంది. కోటీశ్వరురాలు రమాదేవి తన కొడుకు కాంతిభూషణ్ ప్రాణాలు కాపాడమని అభ్యర్థిస్తూ తిరిగి ఉత్తరం రాసింది. భగ్న ప్రేమికుడు కాంతిభూషణ్ ప్రియురాలు అవంతిగా నటించడానికి అన్నపూర్ణ ఒప్పుకుంది. రమాదేవితో కూడా కారు ఎక్కినప్పుడు గతం గుర్తొచ్చింది. ఎగ్జిబిషన్‌లో అన్నపూర్ణకు జనతా ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రయిటర్ రవికాంత్ పరిచయమయ్యాడు. అతనామెకు తన కంపెనీలో ఉద్యోగం ఇస్తానని వాగ్దానం చేస్తాడు.

"అయితే నీ పేరు చెప్పు....!! అయినా చీఫ్ మినిష్టర్లకు క్వాలిఫికేష నేమిటి? అరవై అయిదు కోట్ల మంది భారతీయుల్లో ఏ తలకుమాసిన వాడైనా.... వేలి ముద్ర వేయడానికి చెయ్యుంటే చాలు!" అంది.

ఆ మాటలతో గొల్లుమని నవ్వారు, చుట్టూ వున్న వాళ్ళు కొందరు.

అన్నపూర్ణకూ నవ్వాగింది కాదు.

ఇంతలో "మీరేనామ్మా అన్నపూర్ణగారు! అయ్యగారు మిమ్మల్ని అటునుంచి రమ్మన్నారు....! రండి వెళదాం!" అంది వొక పాతికేళ్ళ అమ్మాయి.

అన్నపూర్ణకు తను ఆ అమ్మాయి కెలా తెలుసో అర్థం కాలేదు.

అయినా తల్లిని అక్కడే వుండమని తను ఆ అమ్మాయితో లోపలి కెళ్ళింది.

"హలో కమాన్ అన్నపూర్ణగారూ! ఇదిగో యీ కాగితం మీద సంతకం పెట్టి యివ్వండి!" అన్నాడు ఒక ప్రింటెడ్ కాగితం అందిస్తూ.

"ఈ కాగితం ఏమిటి?" అంది అన్నపూర్ణ, ఆ కాగితంలో మేటర్ చదవబోతూ.

"అది - రెండేళ్ళ యగ్రిమెంట్! రెండేళ్ళ జీతం ముందే యడ్వాన్స్‌గా ఇస్తున్నాను! మీరు యీ రెండేళ్ళు ఇక్కడ ఉద్యోగం మానివేయ కూడదు! మరో చోట ప్రయత్నించ కూడదు! ఒకవేళ మీరేకారణం చేతనైనా మానివేయ దలిస్తే పెనాల్టీగా మీరు తీసుకున్న దానికి రెట్టింపు కట్టి వేసి ఉద్యోగం మాని వేస్తానని ఒక బాండ్! ఇలా బాండ్ వ్రాయించుకోవటం ఎందుకంటే.... ఈ రెండేళ్ళయినా వాళ్ళు పూర్తి ప్రతిభతో మా జనతా ఎంటర్ ప్రయిజెస్‌కి తమ సేవలు అందిస్తారని, మేము మళ్ళీ కొత్త వాళ్ళ కోసం వెతుక్కో వలసిన పని వుండకూడదని.... ఒక విధమైన కట్టు దిట్టమైన పద్ధతి ఇది!!" అన్నాడు రవికాంత్.

అన్నపూర్ణ వెంటనే ఆ కాగితం మీదున్న స్టాంపుమీద సంతకం పెట్టి ఇచ్చింది.

ఇరవైనాలుగువేల రూపాయలకు వెంటనే అతను చెక్ వ్రాసిచ్చాడు.

అన్నపూర్ణ ఆ చెక్‌ను చేతిలోకి ఆనందంతో తీసుకుని తన కళ్ళను తనే నమ్మలేక అలాగే చెక్‌లోని అంకెల్నే చూస్తూ వుండి పోయింది.

"ఈ చెక్ బ్యాంకులో ఆనర్ చేస్తారో లేదో?" అనుకుంది అన్నపూర్ణ.

"మీకు కేష్ వెంటనే కావాలంటే బ్యాంకు నుంచి మా మనిషి తెచ్చి పెడతాడు! కూల్‌డ్రింక్ తీసుకోండి!!.... అమ్మ రాజేశ్వరిగారు రాలేదా?" అన్నాడు. అన్నపూర్ణ చెక్ క్యాష్ చేసి తీసుకుని రమ్మనమని ఒక మనిషిని పంపాడు.

"అన్నపూర్ణ వెళ్ళి రాజేశ్వరిని తీసుకొచ్చింది.

అన్నపూర్ణగారు ఈ పూట ఉద్యోగంలో జేరినట్టే! యడ్వాన్స్ కూడా ముట్టింది.... ఇక మీరు పార్టీ యివ్వటమే ఆలస్యం!" అన్నాడు నవ్వుతూ.

రాజేశ్వరి ఆనందానికి అవధులు లేవు.

ఆమె ఆ సంతోషాన్ని పట్టలేక "మనుషుల్లో ఇంకా కొందరు మహాత్ములున్నారని.... ఇప్పుడే నమ్మకం కలుగుతోంది బాబూ!" అంది చేతులు జోడిస్తూ.

అన్నపూర్ణ రెండవ రోజే డ్యూటీలో చేరింది. జనతా ఎంటర్ ప్రయిజెస్‌లో కొనటానికి ఎగబడుతున్న జనాన్ని చూస్తే అన్నపూర్ణకు ఆశ్చర్యం వేసింది!!

ఆడా మగా– చిన్నా పెద్దా అన్న తేడాయే లేదు! ప్రతివాళ్ళూ వెంట ముగ్గురిని తేవటం– ఒక్కొక్కరి చేత సగం డబ్బు కట్టించి వాళ్ళను సభ్యులుగా చేర్చటం– సగం డబ్బు వాళ్ళు కట్టి, తక్కిన ముగ్గురి చేతా– వాళ్ళు ఒక్కొక్కళ్ళు ముగ్గురిని సభ్యులుగా చేర్చే ఏర్పాటు చేయటం– తమకు కావల్సిన– టేబుల్ ఫాన్, సీలింగ్ ఫేన్, సోఫా కంబెడ్, డైనింగ్ టేబుల్, గ్రైండర్– కూలర్, ఇలా ఎవరికి కావల్సినవి వాళ్ళు తీసి కెళుతున్నారు.

మధ్య తరగతి వాళ్ళు– ముఖ్యంగా– ఇంకా అంతకంటే క్రింది స్థాయి వాళ్ళు– తమ స్థాయికంటే మించిన ఖరీదైన వస్తువులు– డబ్బు అప్పుచేసి– నగలు తాకట్టు పెట్టి– పెద్ద మొత్తాలను వడ్డీకి తేవటానికైనా వెనకాడక పోవటం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది.

వచ్చిన వాళ్ళకు నచ్చ జెప్పి వీలైనంత ఖరీదైన వస్తువులే వాళ్ళు కొనేట్టు చూడటం అన్నపూర్ణ చేసే పని.

ఒక వారం పది రోజులకు జనతా ఎంటర్ ప్రయిజెస్ సెంటర్లు మరి నాలుగు తెరవ బడ్డాయి.

ఒక్కొ షాపు అవసరా లేమిటో- వాళ్ళకు ఏఏ అయిటమ్స్ ఎక్కువ డిమాండ్‌లో వున్నాయో తెలుసుకుని అవి సప్లయి చేయటం అన్నపూర్ణ పని!

ప్రతిరోజూ అన్నపూర్ణను ఇంటి దక్కర తన కారులో పికప్ చేసుకోవటమే కాకుండా ఆమెను మధ్యాహ్నం లంచ్‌కు హోటల్‌కు తీసి కెళ్ళేవాడు రవికాంత్

"మీరు నా కోసం వెయిట్ చేయటం దేనికి . హాయిగా మీరు భోజనం చేసెయొచ్చుగదా?" అనేది అన్నపూర్ణ ఆలస్యమైన రోజు

"నో. .. నో! నువ్వు లేకుండా భోజనం చేస్తే ఏదో వెలితిగా వుంటుంది అన్నపూర్ణా! వుయార్ మేడ్‌ఫర్ ఈచ్ అదర్. అనిపిస్తుంటుంది ఒక్కోసారి!" అనేవాడు. అన్నపూర్ణ కళ్ళలోకి ఆరాధనాభావం ప్రస్ఫుటించేట్టుగా చూస్తూ

అతని కళ్ళల్లోని ఆకర్షణ క్రమేపీ అన్నపూర్ణను కట్టిపడ వేసింది!

ఆమెకు తెలియకుండానే ఆమె అతని ఆకర్షణకు లోనయ్యింది

ఒకరోజు రవికాంత్ "డియర్ అన్నపూర్ణా! నేను నిన్ను నా బిజినెస్‌లో భాగస్వామిని చేసేద్దామను కుంటున్నాను!" అన్నాడు

"నన్ను మీ బిజినెస్‌లో భాగస్వామిగానా? వండర్‌ఫుల్ ఆయిడియా !! ఎందు కిలాంటి నిర్ణయం తీసుకో దలచారు!"

"కొన్ని వ్యాపార లావాదేవీలు ముఖ్యంగా కొన్ని ఇన్‌కంటాక్స్ గొడవలు తప్పించుకోడానికి! మన ఆడిటర్ గారి సలహామీదే ఇలా చేద్దామను కుంటున్నాను!' అన్నాడు

అన్నపూర్ణ వెంటనే సమాధానం చెప్పలేక పోయింది

మధ్యాహ్నం ఆ రోజు లంచ్‌కు వెళ్ళి, అక్కడి నుంచి ఆడిటర్ దగ్గరి కెళ్ళారు ఇద్దరూ

"మీ రిద్దరూ పార్ట్‌నర్స్‌గా వుంటే కొన్ని లక్షల ట్యాక్స్ కట్టకుండా యవాయిడ్ చేయవచ్చు! లేకపోతే అనవసరంగా సూపర్ ట్యాక్స్ కొన్ని లక్షలు కట్టవలసి వస్తుంది! ఇది తప్ప మరో మార్గం లేదు!' చెప్పాడు ఆడిటర్

"అంత సీనియర్ ఆడిటర్ అబద్ధం చెప్పడు- టాక్సే లక్షల్లో వుంటే అసలు ఆదాయం కొన్ని కోట్లలో వుండాలే!" అనుకుంది అన్నపూర్ణ -

"అంత పెద్ద వ్యాపారంలో తనను పార్టనర్‌గా చేర్చుకోడానికి సిద్ధపడు తున్నాడంటే !?" ఆలో చిస్తోంది అన్నపూర్ణ



బలికోరిన ప్రేమ

"సరే ఆలో చించుకొని ఏ నిర్ణయం రేపు చెప్పండి! మీరు ఇష్టపడితే కొన్ని కాగితాలు రపటికి సిద్ధంగా వుంచుతాను....! మీరు కేవలం సంతకాలు పెట్టడమే తరువాయి! మిమ్మల్ని ఏ పెట్టుబడి లేకుండా.... అంత పెద్ద వ్యాపార సంస్థలో భాగస్వామిని చేసే నిర్ణయం తీసుకున్నందుకు.... మీమంచి మనసును.... విశాల దృష్టిని అభినందిస్తున్నాను! వ్యాపార భాగస్వాములు కావటానికి ముందు.... జీవిత భాగస్వాములు కావటం సముచితంగా వుంటుంది!" అన్నాడు. ఆడిటర్- రవికాంత్, అన్నపూర్ణలకు సలహాతో అభినందన తెలుపుతున్నట్లు.

ఆ మాటలకు అన్నపూర్ణ మనసు ఆనందంతో వుప్పొంగి పోయింది.

ఆమె బుగ్గలు కెంపుల్లా ఎర్రబడ్డాయి.

సిగ్గుతో ఆమె అక్కడ నుంచి పరిగెత్తినట్లు వెళ్ళిపోయింది.

ఆ పూట సరాసరి యింటి కెళ్ళి తల్లితో ఆ విషయం చెప్పింది.

ముందట ఆమె మాటలను నమ్మలేక పోయింది రాజేశ్వరి!

"రవికాంత్ మొదటి నుంచి మనని ప్రత్యేకంగా అభిమానిస్తున్నాడమ్మా! నిన్ను వివాహమాడమని సూటిగా చెప్పలేక.... ఇలా వ్యాపార భాగస్వామిని చేసుకుంటానంటూ తన మనసులోని మాట మనకు తెలియ జెప్పాడు!" అంది ఆమె సంతోషం పట్టలేక.

రవికాంత్ స్వయంగా ఆ రోజు తమ ఇంటికి అన్నపూర్ణ కోసం వచ్చినప్పుడు రాజేశ్వరి తనే కదిపి "మీ రిద్దరూ వ్యాపార భాగస్వాములే కాక జీవిత భాగస్వాములూ అయి, చిలకా గోరింకల్లా పది కాలాల పాటు చల్లగా వుండండి బాబూ!" అంది, దీవిస్తున్నట్టు.

రవికాంత్ ఆ మాటలకు సంతోషించి వెంటనే వెళ్ళి అన్నపూర్ణ చెయ్యి పట్టి తీసి కెళ్ళి, "మీరు మమ్మల్ని వీడని జంటగా ఉండేట్టు ఆశీర్వదించండి!" అన్నాడు ఆమె పాదాలకు నమస్కరిస్తూ.

రాజేశ్వరి కళ్ళు ఆనందంతో ఆనందబాష్పాలు రాల్చాయి.

ఆమె మనసారా ఆ యిద్దరినీ ఆశీర్వదించింది.

"డియర్! మనిద్దరం ఒకటయినట్లే....!! ఇక ముందు మన పెళ్ళి ప్రయత్నాలు చేయాలి!" అన్నాడు రవికాంత్.

అన్నపూర్ణ సిగ్గుతో తలదించుకుంది.

ఇక ఆ కార్యక్రమానికి రవికాంతే పూనుకున్నాడు.

"పెద్ద ఆర్భాటం లేకుండా.... ముఖ్యమైన పది మంది స్నేహితుల ముందు దండ మార్పిడి చేసుకుంటే సరిపోతుంది!" అన్నాడు.

అతను మామూలుగా డబ్బు నీళ్ళలా ఖర్చు చేసే తత్వమున్న మనిషి!

అలాంటివాడు.... స్వయాన పెళ్ళికి అంత కుప్తంగా.... పొదుపుగా, డబ్బు ఖర్చు చేయటానికి.... పెద్ద ఆర్భాటం లేకుండా చేసుకోడానికి ఎందుకు సిద్ధపడుతున్నాడో ఆమెకు అర్థం కాలేదు.

"పెళ్ళికి అనవసరమైన ఆర్భాటం.... డబ్బు ఖర్చుకు నేను వ్యతిరేకిని! ఆ డబ్బే ఒక పెద్ద మొత్తంగా ఏ అనాథాశ్రమానికి దానంగా ఇచ్చినా పుణ్యం పురుషార్థం వుంటుంది!" అన్నాడు.

అన్నపూర్ణకు ఆ మాటలతో ఎంతో ఊరట కలిగింది.

మరునాడే ఆడిటర్ వచ్చి చాలా కాగితాల మీద సంతకాలు పెట్టించుకు వెళుతూ, "మీరు దంపతులు కాబోతున్నందుకు.... ముందుగా నా హార్దిక శుభాకాంక్షలు అందిస్తున్నాను!" అన్నాడు.

కాగితాలపై ఆడిటర్ సంతకాలు పెట్టించుకు వెళ్ళిన రాత్రి మామూలు కంటే జనతా ఎంటర్ ప్రయిజెస్ షాపు ముందుగానే మూయించాడు రవికాంత్. రెండవ రోజు ఆదివారం.

అన్నపూర్ణను వివిధ సెంటర్సులోని షాపులుత్వరగా మూయించమని ఫోన్ చేశాడు!

అన్నపూర్ణ ఆ పని పూర్తిచేసి రాగానే, "డియర్ అన్నపూర్ణా! ఇవ్వాళ నిన్నో కోరిక కోరబోతున్నాను....!! కాదన కూడదు!" అన్నాడు.

అన్నపూర్ణ నవ్వుతూ, "వ్యాపార భాగస్వామ్య మన్నా- జీవిత భాగస్వామ్య మన్నా కాదన లేదు! ఇక మీ కోరిక కాదనే వీలే లేకుండా.... మూడు ముళ్ళతో బంధింప బోతున్నారు....!! ఆ కోరిక ఏదో సెలవియ్యండి!" అంది, అతని ప్రక్కనే డ్రైవింగ్ సీటులో కూర్చుని.

"హనీమూన్‌కు ఎక్కడికి వెళదాం?"- అడిగాడతను.

"ఇంత బిజినెస్సును ఎవరికి అప్పగించి వెళదాం! పైగా ఇద్దరం హనీమూన్ అంటూ వెళితే.... ఇక్కడ ఎలా?" అంది అన్నపూర్ణ.

"అయితే హనీమూన్‌కు నోచుకోమా మనం!" అన్నాడు, రవికాంత్ బుంగమూతి పెడుతూ.

"అయినా ఈ విశాఖపట్నమంత మంచి ప్రాంతం మరొకటి వుంటుందా హనీమూన్ కోసం!" అంది అన్నపూర్ణ.

"అయితే.... విశాఖపట్నం వదల నంటావ్! నేనిక ఏ పేరిస్‌కో జాలీ ట్రిప్ ప్లాన్ చేస్తున్నాను!" అన్నాడతను బాధగా.

"పేరిస్ కోసం అక్కడిదాకా ఎందుకు.... అంతగా కావాలనుకంటే.... ఏ మద్రాసుకో ప్లేన్‌లో వెళ్ళి ఒక రాత్రి ఏ. సి. వున్న ఏ టాప్ హోటల్లోనో గడిపి వచ్చినా సరిపోతుంది!" అంది.

"అందుకే మధ్యాహ్నం రెండు ఎయిర్ టికెట్లు మద్రాసుకు బుక్ చేయించాను! మనం వెళ్ళి మన హనీమూన్ ట్రిప్‌లో ఏఏ హోటళ్ళు మనకు అనుకూలంగా వుంటాయో చూసి వద్దాం!" అన్నాడు.

"ప్లేన్ ఇంకో అరగంటలో వుంది! తొమ్మిది అయ్యేప్పటికి మనం మద్రాసు హోటల్ చోళలో డిన్నర్ తింటుంటాం!" అన్నాడు.

అన్నపూర్ణకు ఆశ్చర్యం వేసింది అతని ప్లాన్‌కి.

"అమ్మతో మాట మాత్రం చెప్పలేదు!....!" అంది అన్నపూర్ణ.

"నేను మెసేజ్ ముందే మనిషి ద్వారా మీ అమ్మగారికి పంపాను! ఆమె నీకు కావలసిన బట్టలు సూట్‌కేస్ ఇంటి నుంచి పంపారు!" అన్నాడు.

"అయితే అన్నీ చాలా ప్రిప్లాన్డ్‌గా చేస్తున్నారన్న మాట. ఈ విషయం ముందు.... మాట మాత్రం చెప్పలేదేం?" అంది ఆశ్చర్యంగా.

"సర్‌ప్రయిజ్ చేయటమంటే నాకు సరదా! తెలుసు గదా.... నా సైకాలజీ!" అన్నాడు రవికాంత్.

నిముషాల్లో ఎయిర్‌పోర్ట్ చేరుకోవటం- అప్పటికే సిద్ధంగావున్న ప్లేన్‌లో - తమ పేర్లు మిస్టర్ అండ్ మిసెస్ రవికాంత్- అంటూ యనౌన్స్ చేస్తుండటం అన్నపూర్ణకు ఆశ్చర్యం కలిగించింది.

సీట్‌లో కూర్చుని నడుముకి బెల్టులు బిగించుకుంటూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్న అన్నపూర్ణ, రవికాంత్‌లను చూసిన ఎయిర్ హోస్టెస్, "మీరేనా మిస్టర్ అండ్ మిసెస్ రవికాంత్!" అంది నవ్వుతూ.

* * * *

"ఎలా ఉంది డియర్ ఈ రూము?" అడిగాడు రవికాంత్ అన్నపూర్ణను.



"ఇదో పెద్ద ఘిల్లులా వుంటే... రూమేమిటి? బయట పెద్ద హాలు – లోపల రెండు గదులు అటు వరండా!!.... ఎంత అద్దె?" అడిగింది అన్నపూర్ణ.

"పదిహేను వందలు....!! హనీమూన్‌కు ఆ మాత్రం లేకపోతే ఏం బాగుంటుంది!?" అన్నాడు.

"మైగాడ్!!... రోజుకు పదిహేను వందలా!? ఆశ్చర్యంగా వుందే!"

"బైదిబై ... నీకో సర్‌ప్రయిజింగ్ న్యూస్ చెప్పనా?" అన్నాడు, బుగ్గ మీద సుతారంగా చిటికె వేస్తూ

"చెప్పండి! మీవన్నీ ఎప్పుడూ సర్‌ప్రయిజింగ్‌వేగా!?" అంది అన్నపూర్ణ నవ్వుతూ.

"ఈ రూమ్‌లో రేపే రిజిష్టర్ మేరేజ్ చేసుకుని.. ఇవ్వాళ నైట్ నుంచే హనీమూన్ ఎంజాయ్ చేస్తే ఎలా వుంటుంది!?" అన్నాడు అది చాలా సాధారణ విషయంలా చెబుతూ

"రేపు ఇక్కడ రూములో రిజిష్టర్ మేరేజా?!? మా అమ్మ కాని, వంశ స్నేహితులు గాని ఎవరూ లేకుండాను!? అంది అన్నపూర్ణ ఆశ్చర్యంగా.

"మీ అమ్మగారు రేపటికి ప్లేన్‌లో మన ఫ్రండ్స్‌తో ఇక్కడికి రాబోతున్నారు!" అన్నాడు మళ్ళీ.

"ఏమిటీ... మా అమ్మ ఇక్కడికి వస్తున్నదా?" అంది అన్నపూర్ణ నమ్మలేనట్టు.

"చూస్తావుగా డియర్! రవికాంత్ పనులన్నీ యిలాగే సర్‌ప్రయిజింగ్‌గా వుంటాయి!" అన్నాడు అన్నపూర్ణ చెయ్యి పట్టి పైకి లాక్కొని ముద్దు పెట్టుకోబోతూ

"ఓ. ఆగండి!! ఆగండి... !! నేనింకా మిస్ అన్నపూర్ణనే... మిసెస్ రవికాంత్‌ని కాదు!" అంది అతన్ని బాహుబంధాల నుంచి తప్పించుకుంటూ

"అయితే ... ఇంకా సెన్సార్‌షిప్ వుందన్నమాట!" అన్నాడు నవ్వుతూ రవికాంత్.

'కొన్ని గంటల వరకు తప్పదు!!"

"ఇండియన్స్ ఆర్ వెరీ ఆర్తొడాక్స్ అన్నదిందుకే! ఇదే ఏ అమెరికాలో నో అయితే... మేరేజ్‌కి ముందే... చాలా జరిగిపోతాయి ఎంగేజ్‌మెంట్ పేరుతో .!! అప్పుడే అబ్బాయి అమ్మాయి ఒకరు మరొకరిని బాగా అర్థం చేసుకుని వాళ్ళు భార్యాభర్తలుగా వుండగలరో లేరో నిర్ణయించుకునేది!" అన్నాడు అన్నపూర్ణ చేతిని చుంబిస్తూ.

"ఎంత ఫారిన్ కల్చర్ ప్రభావం వున్నా... మన ఆచారాలు – అలవాట్లు – సాంప్రదాయాలు మనం! విడువలేం గదా!? మన పూర్వీకులు మన సాంప్రదాయాన్ని ఎంతో దూరదృష్టితో నే ఏర్పాటు చేశారనుకుంటూ!?" అంది.

"అయితే టిపికల్ ఇండియన్ గరల్ అనిపించావు! ఓకే! మరి మనం ఓకే బెడ్ మీద పడుకోవటం కూడా....!?"

"అది అసలు తప్పు!! నేను ఆ లోపల గదిలో పడుకుంటాను. మీరు ఈ గదిలో పడుకుంటారు.... ఆ మధ్య తలుపు మనిద్దరి మధ్యా కొన్ని గంటలు ఇంకా అడ్డం వుండకా తప్పదు!" అంది అన్నపూర్ణ అతని వేపు సానుభూతిగా చూస్తూ

రవికాంత్ అన్నపూర్ణ మాటలకు బిగ్గరగా నవ్వి.

"అన్నపూర్ణా ! నువ్వు నటిగా.. డ్రామాల్లో నటించావంటే ఎవరూ నమ్మరు?" అన్నాడు.

"ఒకళ్ళు నమ్మినా నమ్మకపోయినా మీరు నమ్మారు గదా!? అదే పది వేలు!" అంది నవ్వుతూ.

"సరే! నేను రేపు ఉదయానికి కావలసిన ఏర్పాట్లు కొన్ని చేయాల్సి వుంది! నేను రావటానికి కాస్త అలస్యమైతే కంగారు పడే పనేం వద్దు! గుడ్ నైట్!" అంటూ బయటికి వెళ్ళాడు.

అన్నపూర్ణ అతనికి "బైబై!" అని చెబుతూ చెయ్యి వూపింది.

ఆ రాత్రి అన్నపూర్ణకు ఆనందంతో నిద్ర పట్టలేదు

"ఇది కలా – నిజమా!? విధి ఎంత తమాషాగా తన జీవితాన్ని మలుపు తిప్పుతోంది! రెండు నెలల క్రితం తాను పూటే గడవని నిరుద్యోగి? ఇవ్వాళ తను కొన్ని కోట్ల ఆదాయమున్న కోటీశ్వరుడి వ్యాపారంలో నే గాక జీవితంలో కూడా భాగస్వామి కాబోతోంది!! అయితే రవికాంత్ ఎప్పుడూ ఏదో సర్‌ప్రయిజ్ చేస్తుంటాడు!! అదే అతనితో తంటా!! పెళ్ళికి ముందు హనీమూన్ సంగతెత్తి హనీమూన్ గడపటానికి రూమ్ చూడాలని ఇక్కడి కొచ్చాక ఇక్కడే రిజిష్టర్డ్ మేరేజ్ అంటున్నాడు." హియీజ్ రియల్లీ ఏ మాన్ ఆఫ్ సర్‌ప్రయిజెస్' అనుకుంది అన్నపూర్ణ

ఏదో వుబుసుపోకకు రెండు మూడు వీక్లీలు తిరగేసింది కాని వాటిలో ఆమె మనసు లగ్నం కాలేదు

ఎప్పుడో చాలా పొద్దుపోయి, పెద్ద పెద్ద దండలు. పెళ్ళి బట్టలతో వచ్చాడు, రవికాంత్

'ఇవన్నీ అర్ధరాత్రి ఎలా కొన్నారు?" అంది అన్నపూర్ణ ఆశ్చర్యంగా

"నిన్నే ట్రంకాల్ చేసి ఇవన్నీ సిద్ధం చేయమని చెప్పేశాను! ఇది గూడా సర్‌ప్రయిజేగా?" అన్నాడు నవ్వుతూ.

(ఇంకా ఉంది)

రహస్యం

ఓ ప్రభూ!
వసుధైక కుటుంబ విభూ!!
సూర్యుణ్ణే చుంబించాలన్న మత్తులో
నా కనుచూపుల కానని ఎత్తులో
మహోన్నత హిమవన్నగశిఖరాల్ని
మంచు ముద్దబంతులతో మురిపిస్తున్నావు!
నీలాల నింగినే నేలకు వంచి
పైపైకి లేచే అలలతో కలిసి పాడించి
గుండె పులకరింతలతో కనువిందుచేసి
కడకు కడలిగుండెల్లో బడబాగ్నిని నింపినావు!!

చిమ్మ చీకటి చేవను చిత్రంగా
కోయిలకు మేనిపూతగా పూసి
కూతలో మాత్రం చిత్రాతి చిత్రమైన
మధురిమలు కురిపిస్తున్నావు!
మెరుపుతో నే పగడాల సొగసుతో
నాగరాజు పడగను నయనానందకరంగా సృష్టించి
కాలకూట విషాన్ని కక్కిస్తున్నావు!!

బంగారు ముద్దల్ని భాండంలో నూరి
సుగంధ ద్రవ్యాల పరిమళాలతో మేళవించి
పోత పోసిన పూమేను అందాల్లో
రాతి గుండెల్ని తగిలించినావు!
అనాకారి గుండెల్ని కలకండలుగా నిలిపినావు!!
ఈ రహస్యాన్ని అర్థం చేసుకొనే శక్తిని
నా గుండెకు అందకుండా చేసినావు!
తలక్రిందులైతపిస్తున్నాను!
అయినా గర్వంగా తలెత్తుకొని తిరుగుతున్నాను!!

– పులికంటి కృష్ణారెడ్డి

వ్యక్తిగతం



సుప్రీంకోర్టు తీర్పు ద్వారా జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ముస్లిమ్ వృద్ధ మహిళ, శ్రీమతి షాబానో ఇటీవల తమ కోడలిని ఇంటినించి వెళ్ళగొట్టి మరోసారి సంచలనం సృష్టిస్తున్నట్లు మార్చి 29న ఆంగ్ల దినపత్రిక హిందుస్తాన్ టైమ్స్‌లో పడిన ఒక ఇంటర్వ్యూ వల్ల తెలుస్తున్నది షాబానో చిన్నకోడలు శ్రీమతి షైలా తమ అత్తగారు ఎటువంటిదో ఆ ఇంటర్వ్యూలో వివరించారు

షాబానో ముగ్గురు కుమారులలో చిన్నవాడైన జలీల్ అహమద్‌ఖాన్ (40) వివాహం షైలాతో 1981లో జరిగింది ఇప్పుడు వారికి నాలుగేళ్ళ కుమారుడు, ఏడు నెలల కుమార్తె ఉన్నారు. ఇండోర్‌లోని తమ ఇంటినుంచి వెళ్ళగొట్టబడిన షైలా అక్కడికి 10 కి మీ. దూరంలో ఉన్న పుట్టింటికి వెళ్ళింది షైలా తండ్రి ఎక్సైజు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు, తాత హోల్కార్ మాజీ మహారాజు కొలువులో మోటారు వాహనాల సూపరింటిండెంట్‌గా పనిచేశారు

షాబానో మిగతా కుమారులు ఇద్దరూ ఆమెని తమ ఇళ్ళకి రానీయకపోవటానికి ఆమె స్వభావమే కారణమని షైలా అన్నారు తమ వివాహం అయిన ఒక సంవత్సరంపాటు ప్రశాంతంగా గడిచిందని, ఆ తర్వాత షాబానో ప్రతి చిన్న విషయానికి తనని తప్పు పట్టి తగాదా పెట్టుకుని కొడుకు చేత కొట్టించేవరకూ శాంతించేది కాదని ఆమె అన్నారు గత మూడేళ్ళనించీ దాదాపుగా ప్రతి రోజూ తాను హింసని అనుభవిస్తూనే ఉన్నానని ఆమె చెప్పింది తన భర్త మంచివాడే కానీ తల్లి మిద ఉన్న ప్రేమవల్ల ఆమెని ఊరడించడానికి తనని కొట్టేవాడని షైలా అన్నారు. షాబానోకి వస్త్రధారణపై మక్కువ ఎక్కువని, పదహారేళ్ళ పడుచుతో కూడా ఆమె ఆ విషయంలో పోటీపడుతుందనీ అన్నారు షైలా తమ అత్తగారికి సినిమా అన్నా, రేడియో అన్నా తగని పిచ్చి అనీ, వచ్చిన ప్రతి సినిమాకీ తప్పకుండా వెళ్ళేదనీ చెప్పారామె శ్రీమతి ఇందిరాగాంధీ తర్వాత అంతటి పేరు ప్రఖ్యాతులు గల మహిళ తానేనని షాబానో అంటారట అక్కడ మాటలు ఇక్కడా, ఇక్కడ మాటలు అక్కడా చెప్పి తంపులుపెట్టి తమాషా చూడటం షాబానో స్వభావం కాబట్టి ఆమెని అల్లుళ్ళూ, మిగతా ఇద్దరు కోడళ్ళూ తమ దగ్గరకి రానివ్వరని షైలా వెల్లడించారు

షాబానో రేడియో అంటే చెవికోసుకొంటారట. ఆమె తన కొడుకూ కోడలూ సంతోషంగా ఉండడం సహించలేదని ఆ కారణంగానే ఏదో విధంగా తనతో తగాదా పెట్టుకుని కొడుకుచేత కొట్టించేదని చివరికి తనని ఇంటినించి తరిమివేసిందని షైలా ఆ ఇంటర్వ్యూలో వివరించారు . □

వారఫలం

2-5-1986 శుక్రవారం మొదలు 8-5-1986 గురువారం వరకు

★ **మేషం** : అసలు వ్యవహారం తప్ప అన్నీ నెరవేరే అవకాశమున్నది. ఆర్థికంగా ఏమంత బాగుపడ్డామని అనుకోంటారు. అప్పులున్నాయిగా! వసూలు చేసికొంటే యిబ్బందులు తీరుతాయి స్త్రీలకు . ఉద్యోగాభివృద్ధికై చేసే యత్నాలు సాగుతాయి. ఫలదాయకాలవుతాయి ఆరోగ్యాభివృద్ధి

★ **వృషభం** : నూతన విషయాలందు జోక్యం కలిగించుకొనక తప్పదు వ్యవహారరీత్యా మీకు అనుకూల కాలం వ్యాపారం విస్తరించుటకు మీరు గావించే యత్నాలు సాగిరావటంలేదని తెలిసీ మొండిగా ప్రాకులాడి నందున ప్రయోజనం? స్త్రీలకు · కళా రంగ ప్రసిద్ధి మరి నాట్యం, నాటకం, చలన చిత్రరంగంలాంటి విషయాలందు గల ఆసక్తి లాభదాయకమే

★ **మిధునం** : ఇంట శుభం జరిగే అవకాశమున్నది. వ్యవహారరీత్యా మేలున్నది స్థితిగతులందు కొంత వృద్ధి చేకూరుతుంది. మీమేలు కోరినవారు యింటికి రానున్నారు, గమనించాలి కొందరు దూర ప్రయాణం కట్టుటకు అవకాశం లేకపోలేదు

★ **కర్కాటకం** : శుభ కార్యాలో చనలకు స్వస్తి చెప్పండి. ఇప్పట్లో కలసి రాగల మార్గంలేదు. జాయింటు వ్యాపారమయితే కొన్ని చిక్కులను ఎదుర్కొనవలసిన అగత్యమున్నది ఎంతో కాలంగా ఎదురుచూచి విసిగి వేసారిన ఒకానొక ధన సంబంధం వ్యవహారం వారాంతాన పరిష్కరింపబడనున్నది స్త్రీలకు . ధనాదాయం, ఆనందం

★ **సింహం** : ఒకానొక చిక్కు నుండి మీరు విడివడగలరు. ధన సంబంధమైన చిక్కు వెన్నాడక తప్పదు అప్పులవారి వత్తిడి అధికం అందుకు తోడు అనారోగ్య సూచనలు,మరి రాశికి 'అష్టమంలో శని'స్థితుడు కావటం ఏమంతమంచిది. స్త్రీలకు . సుఖ శాంతులకు లోపం ఉద్యోగరీత్యా చిక్కులు.

★ **కన్య** : సరిసమానులతో, చుట్టు ప్రక్కలవారితో తగాదాలు రావచ్చు. విజ్ఞాన శాస్త్రాభ్యాసం చేసే వారికి 'సైంటిస్టులకు' భారీ వ్యాపారం చేసే వారికి, చలన చిత్ర నిర్మాతలకు, పంపిణీదారులకు, నాయకీ నాయక వేషధారులకు అనుకూలవారమని, దినములు యోగాఢ్యములనీ గ్రహించాలి స్త్రీలకు వృత్తి యందు పెంపు. ధన లబ్ధి. ఉద్యోగస్థులకు ఆశించిన 'ప్రమోషన్' లభ్యం కాగలదనే ఆశకు తావున్న వారం గ్రహించండి.

★ **తుల** : అనుకొనేదొకటి, అయ్యేదొకటి. రాజకీయంగా ఎలాంటి మేలు జరుగదని గ్రహించాలి చిక్కినట్లే చిక్కి కొన్ని అవకాశాలు, ఆర్థిక లాభదాయకాలు కాగలవు గాని, ప్రయోజనకారులు గావు స్త్రీలకు : సభా గౌరవం, పత్రికా గౌరవం, ధనాదాయం గల వారం

★ **వృశ్చికం** : నూతన వ్యక్తుల పరిచయం, అనర్థదాయకం కొందరకు అధికారుల మూలంగా గొడవ రావచ్చు బంధువులలో మనస్తాపం రానున్నది. అంతా రాశియందు స్థితుడైన 'శని గ్రహ' మహిమయే. స్త్రీలకు వయసు వచ్చిన వారికి వివాహం జరుగనున్నది వారమంతా యోగ దాయకమే.

★ **ధనుస్సు** : శుభ సమయం అన్ని దినాలు పండగ దినాలే. యత్న కార్యసిద్ధి. అయినా ఏదో మనోవేదనకు, అధిక వ్యయానికి అవకాశాలుంటాయి అంతా 'వ్యయ రాశి స్థిత శనిగ్రహ' మహిమయే స్త్రీలకు వృత్తియందు వికాసం, స్వల్పాదాయం, బంధు వర్గ సందడి

★ **మకరం**: ఎలాంటి క్లిష్ట పరిస్థితినైనా దాటుకొంటారు అనుకొన్న రీతిగా డబ్బు అందటం గమనిస్తారు శుభ సంబంధంగా వ్యయం చెప్పదగిన సమయం. విద్యా సంబంధంగా ఉత్తేజకరమైన వారం. ఉత్తమ ఫలాన్ని చూరగొంటారు. స్త్రీలకు సర్వత్రా దిగ్విజయ వారమే

★ **కుంభం** : అలవాటుగా చేసే పనులకు అంతరాయం రావచ్చు ఆశకుపోయి వ్యాపారం చేయటం వలన యిబ్బంది. అనుకొన్న విధానాన డబ్బు చేరకపోవటం గమనిస్తారు. అప్పులు వసూలవుతాయి, మేల్కొనండి. స్త్రీలకు కళారంగాన, చిత్ర నిర్మాణ వ్యవస్థలో, కథా గాన రంగాన ప్రగతి యున్నది, గ్రహించాలి.

★ **మీనం** : అనవసరంగా లేనిపోని వ్యవహారాలలో తల దూర్చవలసి వస్తుంది. ఏం లాభం? కాని పనులకు వెళ్ళటం ఎదురు దెబ్బలు తగులుతాయి, ప్రయోజనం? ఊరకుండటం, ఓర్మితో ఉండటం మేలుగా! చేతనయితే ఉపకృతి చేయండి స్త్రీలకు అవరోధాలు తొలగుతాయి. వృత్తియందు వికాసమున్నది సాహితీ రంగాన ప్రకాశమున్నది, గ్రహించండి.

—విద్వాన్ కోట సత్య రంగయ్యశాస్త్రి



నెస్టమ్ బేబి సిరియల్
ప్రారంభించేందుకు ఆదర్శప్రాయమైనది
పెరుగుదలకు ఆదర్శప్రాయమైనది
నెస్టమ్, పాలు-పూర్తి పోషక విలువలున్న ఆహారం.
నెస్టమ్®
రైస్
ఇనుము-విటమిన్లతో కూడినది
పాలలో కలపండి.
Nestlé
Nestum
baby cereal
Rice
mix with milk
ఉచితం
మీ బాబు, తన ఆహారంలో, కొత్త రుచులను కోరుతాడు అందుకని–మీ ఉచిత నెస్టమ్ వంటల పుస్తకం కోసం రాయండి.
నెస్టమ్

జాతకం

వాటువల్లి వెంకట సత్యరామారావు

అప్పుడే భోజనం చేసి హాల్లోకి వచ్చింది మృణాళిని టిపాయ్ మీదున్న పాన్ బాక్సు లోంచి కొంచెం వక్కపొడి తీసి నోట్లో వేసుకొంది ప్రక్కనే ఉన్న కుర్చిలో చేరబడి టిపాయ్ మీదున్న నవల చేతుల్లోకి తీసికొంది

నవల అట్టపైఉన్న బొమ్మ చాలా ఆకర్షణీయంగా ఉంది. ఒక అందమైన యువకుని బాహుబంధాల్లో మరింత అందమైన యువతి ఎంత చక్కగా చిత్రీకరించాడో ఆ చిత్రకారుడు పుస్తకం తెరచి మొదటి పేజిలో ఉన్న చిత్రకారుని పేరు చూసింది

అందమ్ – తనకు బాగా పరిచయ మున్న పేరే అది అది అతని కుంచె పేరు కావచ్చు. బొమ్మల అందానికి తగ్గట్టుగానే ఉంటుంది అతని మారుపేరు కూడా దాదాపు అన్ని పత్రికల్లోనూ అతని కార్టూన్లు ప్రచురితమవుతూనే ఉంటాయి

'పోస్ట్" అన్న కేకకు ఆలోచనల్లోంచి తేరుకుందామె. వెంటనే లేచి పోస్ట్‌మేన్ అందించిన కవరు తీసికొని ఫ్రం అడ్రస్ ఉందేమోనని చూసింది ఏమీ లేదు. కవరు తండ్రికి అడ్రస్ చేసి ఉండటంతో భోజనం చేసి నిద్రపోతున్న తండ్రిని లేపి కవరందించింది

'ఎక్కణ్ణుంచమ్మా?" ఆతృతగా అడిగారు పరంధామయ్య గారు

'తెలీదు నాన్నా ఫ్రం అడ్రసు లేదు " జవాబిచ్చింది మృణాళిని

కవరు చింపి చదువసాగాడాయన



ఎక్కడ్నుంఛండి ఉత్తరం?" అడుగుతూ వచ్చింది మృణాళిని తల్లి కమలమ్మ గారు నన్ను కాస్త చదువ నిస్తావా అంటూ విసుక్కున్నారు పరంధామయ్య గారు చదవటం పూర్తి చేసి హుఁఅంటూ చిన్నగా నిట్టూర్చారు ఆయన "ఏమిటండివిశేషం?" అడిగింది కమలమ్మ గారు

"ఏముంది మామూలే! మొన్న అమ్మాయిని చూసి వెళ్ళిన బెజవాద సంబంధం వారు వ్రాశారు జాతకాలు సరిపోలేదు మరో సంబంధం వెతుక్కోండంటూ!'

"ఏమిటో నండి! అమ్మాయి వివాహం చేయగలమో లేదో" అని బెంగ పట్టుకుంది నాకు" బాధగా అంది కమలమ్మ గారు

"మనం మటుకు ఏం చేస్తామే? ఏదో మనం సంపాదించిన దానితో ఇంత కట్నంగా ఇస్తానికి కూడా తయారయ్యాం కదా! పెట్టుపోతల్లో కూడా లోపం ఏమి చెయ్య దల్చుకోలేదు. అయితే మాత్రమేం? వచ్చిన ప్రతీ సంబంధం జాతకాలు కలవక పోవటం వల్ల చెడిపోతుంటే మనం మాత్రం ఏం చెయ్యగలం చెప్పు?" అంటూ ఓదార్చారు పరంధామయ్య గారు

ప్రక్క గదిలో కూర్చుని ఉన్న మృణాళినికి వీళ్ళ మాటలు వినబడుతూనే ఉన్నాయి. మొన్న చూసి వెళ్ళిన బెజవాడ సంబంధం వాళ్ళు అమ్మాయి నచ్చింది. జాతకా లివ్వండి. ముహూర్తం పెట్టిస్తామంటూ జాతకాలు పట్టు కెళ్ళారు తరువాత ఇప్పుడిలా జాతకాలు కలువ లేదంటూ ఉత్తరం వ్రాశారు

ఏమిటి ఈ జాతకాల పిచ్చి పెళ్ళి కొడుకు అంతరిక్ష కేంద్రంలో జూనియర్ సైంటిస్ట్. మిగిలిన గ్రహాల్లోనూ భూమిలోలాగే రాళ్ళూ రప్పలూ ఉన్నాయని తెల్సిన వాడు ఆ గ్రహాలు మనుషుల్ని అదుపులో ఉంచుకొంటాయనే వాదనను ఎలా అంగికరించాడో? తన వాళ్ళకు అంతగా లేది పిచ్చి

తనకు సంబంధాలు చూస్తున్న కొత్తలో మాత్రం తన జాతకాన్ని ఒక పేరుమోసిన పండితునికి చూపించార్లు ఆయన ఏవేవో లెక్కలు వేసి చెప్పాడు. తనకు కుజదోషం ఉందని ఆ విషయం వింటూనే క్రమాన్పడిపోయారు తన తల్లిదండ్రులు. కారణం– జాతకశాస్త్రం ప్రకారం కుజదోషం ఉన్న పిల్లకు పెళ్ళి చేస్తే ఒక సంవత్సరం లోపుగానే వరునికి ప్రాణగండం సంభవిస్తుందట. లేదంటే అదే దోషం ఉన్న పెళ్ళి కొడుకు కావాలి. అలాంటిది

చూస్తూ చూస్తూ ఏ తల్లిదండ్రులు కోడలుగా ఆహ్వానిస్తారు? పెళ్ళి కాలేదనుకొని బాధ పడటం తనదే తప్పు. బాధగా ఆలోచిస్తూ కళ్ళు మూసుకొందామె.

★ ★ ★ ★

"ఏమేవ్, ఏర్పాట్లన్నీ అయ్యాయా? అమ్మాయిని తయారు చెయ్యటం అయ్యిందా? వాళ్ళు వచ్చే వేళయ్యింది!" గదిలోకి ప్రవేశిస్తూ అన్నారు పరంధామయ్య గారు.

"అమ్మాయి పెళ్ళి చూపులకు సిద్ధం కానంటోందండీ! ఎంత చెప్పినా వినటం లేదు" కోపంగా చెప్పింది కమలమ్మ గారు. దాంతో "ఏమిటమ్మా గొడవ" అంటూ మృణాళినిని అడిగారు పరంధామయ్య గారు.

"మళ్ళీ ఎందుకొచ్చిన తంతు నాన్నా ఇదంతా? ఎలాగూ వాళ్ళు చూసి వెళ్ళటం, తర్వాత జాతకాలు కలువ లేదంటూ ఉత్తరాలు వ్రాయడం మామూలేగా. పైగా ఇదంతా ఒక ఖర్చు కూడాను!" విరక్తిగా అంది మృణాళిని.

"అలాగంటే ఎలాగమ్మా. మన ప్రయత్నం మనం చెయ్యాలిగా. అన్నట్లు నీకి విషయం చెప్పటం మర్చే పోయాను. పెళ్ళి వారడిగితే నీ పుట్టిన రోజు డిశంబరు 12 అని లేక 10 అని చెప్పమ్మా!"

తండ్రి మాటలు విని ఒక్క క్షణం ఆశ్చర్య పోయింది. అంతలో "అదేం నాన్నా?" అంటూ అడిగింది.

"మరేమి అనుకోకమ్మా. నిన్ను చూట్టానికి వచ్చిన ప్రతివాళ్ళూ, నువ్వూ, మేమిచ్చే కట్నం అన్నీ నచ్చినా జాతకాల విషయంలో తిరిగి పోతున్నారు. జాతకం విషయంలో నీ కెలాగూ అట్టే నమ్మకం లేదని నాకు తెల్సు. అందుకే నీ జాతకాన్ని కొద్దిగా మార్చి రాయించాను. ఊఁ.... కానీ.... కానీ.... త్వరగా తెములు" అంటూ కంగారుగా వెళ్ళిపోయా డాయన.

తండ్రి మాటలు విని ఆలోచనల్లో పడిందామె. వాళ్ళని ఇలా మభ్యపరచి తన నిచ్చి వివాహం చేస్తే మోసం చేసినట్లు కాదా? ఒకవేళ తన జాతకం నిజమైతే? తరువాత ఏదన్నా జరిగితే తన మాట ఎలా ఉన్నా తనను చేసికొన్న పాపానికి అతనికి శిక్షపడుతూంటే తను భరించ గలదా?

ఆమె ఆలోచనలిలా సాగిపోతూండగానే ముందు గదిలో కలకలం విన్పించింది. వాళ్ళొచ్చి నట్లున్నారు. కిటికీ లోంచి చూసింది తనుఅతనికి కనపడకుండా తెర అడ్డంగా చేసికొని. అందగాడే అనుకొంది మనసులో. అయితే జాతకం విషయంలో మాత్రం తండ్రి చేసిన పని తన మనసుకు నచ్చటం లేదు. అలా చేసే వివాహం తన కక్కర లేదు. అసలా పెళ్ళి చూపులే మానివేద్దా మనుకొంది. కానీ వచ్చే వాళ్ళ ముందు బాగుండదని అభ్యంతరం తెల్ప లేదు.


"అమ్మాయిని తీసుకురండి!" మధ్యవర్తి మాటలు గట్టిగా విన్పించాయి.

అంతలో తల్లి వచ్చి "పదమ్మా!" అంటూ చేయి పుచ్చుకొంది. ముఖాన నవ్వు పులుముకొని ముందు గదిలోకి అడుగు పెట్టిందామె. మధ్యవర్తి పెండ్లి కొడుకును, అతని తల్లి దండ్రులనూ పరిచయం చేయటంతో వారికి నమస్కరించి ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుంది. మామూలుగా ఉండే ప్రశ్నలతో ముగిసింది పెళ్ళి చూపుల తతంగం. ఏ సంగతీ తర్వాత ఉత్తరం వ్రాస్తామని వెళ్ళిపోయారు వాళ్ళు.

★ ★ ★ ★

తర్వాత కొన్ని రోజులకి వచ్చింది వాళ్ళ





దగ్గర్నుంచి ఉత్తరం అమ్మాయి వచ్చిందనీ, అభ్యుదయ భావాలు కలవాడవ్వటంతో కట్న కానుకల ప్రసక్తి లేదనీ ఇష్టమైతే వచ్చి ముహూర్తాలు పెట్టు కెళ్ళమనీ సారాంశం. అది చూసి పరంధామయ్య, కమలమ్మగార్ల ముఖాలు ఆనందంతో వెలిగి పోయాయి ఒక బ్యాంకు ఆఫీసరు, యోగ్యుడు, కానీ కట్నం కోరకుండా తమకు అల్లుడు కాబో తున్నాడు

"చూశావుటమ్మాయ్ ఈ ఉత్తరం!" ఆనందంగా కూతుర్ని కేకవేసి ఉత్తరం చేతిలో ఉంచాడు పరంధామయ్య గారు. ఉత్తరం అసాంతం చదివింది మృణాళిని. "నాకీ పెళ్ళి యిష్టం లేదు నాన్నా!" అంది తండ్రితో.

పక్కలో బాంబు పడ్డట్టు ఉలిక్కి పడ్డారు ఆమె తల్లిదండ్రులు. "అదేం అమ్మా! అతను నీకు నచ్చ లేదా?" ఆతృతగా అడిగారు పరంధామయ్య గారు. "అది కాదు నాన్నా జాతకం విషయంలో వాళ్ళకు అబద్ధం చెప్పి, మోసగించి, అతన్ని వివాహం చేసికోవటం నా కిష్టం లేదు"

ఆ మాటలు వింటూనే బిగ్గరగా నవ్వారు పరంధామయ్యగారు. "ఇందులో తప్పేమి లేదమ్మా. కాలం అడ్వాన్సు అయ్యింది. ఇంకా ఈ జాతకాలు అవి ఇవీ అంటూ కూర్చుంటే పనులు జరగవమ్మా. అయిందేదో అయిపోయింది. నూరు అబద్ధాలు ఆడి అయినా ఒక పెళ్ళి చేయమన్నారు ఈ ఒక అబద్ధం ఆడినందువల్ల వచ్చే నష్టం ఏమి లేదు అబ్బాయి క్కూడా జాతకం విషయంలో అంత నమ్మకం లేదని విన్నాను. చదువుకొన్న దానివి. మూర్ఖంగా ఆలోచించి వచ్చిన అదృష్టాన్ని కాలదన్నుకోకు" కోపంగా అనేసి ఆమె చెప్పేది వినిపించుకో కుండానే వెళ్ళిపోయా డాయన.

ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? నిజం వాళ్ళకు చెప్పి ఈ పెళ్ళి మాన్పించటమా? లేక తండ్రి చెప్పినట్టు తలుపు తట్టిన అదృష్టాన్ని త్రిప్పి పంపకుండా అతన్ని పెళ్ళి చేసికోవటమా? ఆమె ఇలా

"జాతకం"

ఆలోచన్లతో సతమత మవుతూండగానే ఆమె ప్రమేయం ఏమీ లేకుండానే పెళ్ళి ప్రయత్నాలు జరగడం పెళ్ళి అయి అత్తవారింటికి రావటం కూడా జరిగి పోయాయి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల్ని బాధపెట్టటం ఇష్టంలేక, అన్నిటికి మౌనంగానే సహకరించింది మృణాళిని.

మొదటి రాత్రే తెలుసుకొంది అతను చాలా మంచివాడని! ఏది ఏమైనా తాను చేసింది తప్పేనని మనసు పీకుతోంది. రెండవ రోజున ఆమె లేవటం కొంచెం ఆలస్య మయింది. లేవగానే వంటింట్లోకి వెళ్ళి చూస్తే అత్తగారు అప్పుడే కాఫీ చెయ్యటం ముగించింది. మృణాళినిని చూసి, "అబ్బాయి ముందు గదిలో ఉన్నాడు. ఈ కాఫీ ఇచ్చి రామ్మా!" అంటూ కప్పు చేతి కందించింది.

అది పుచ్చుకొని ముందు గదిలో అడుగుపెట్టిన ఆమెకు అక్కడి దృశ్యం ఆశ్చర్యాన్ని కల్గించింది ఆమె భర్త అటువైపు తిరిగి ఉన్నాడు అతని ముందు . ఒక స్టాండు దానికి అమర్చిన కాగితంపై ఒక అందమైన చిత్రం. ఇంకా తడారని ఆ చిత్రం లైటు కాంతిలో వింతగా మెరుస్తోంది అప్పుడే చిత్రం గియ్యటం ముగిసినట్టుంది. చిత్రం కింద ఒక మూలగా చిన్న చిన్న అక్షరాలతో సంతకం చేస్తున్నాడతను.

ఒక్క క్షణం ఆమె గుండె కొట్టుకోవటం ఆగిపోయింది. ప్రముఖ చిత్రకారుడు "అందమ్" తన భర్త. కాదు.... కాదు.... తన భర్తే ప్రముఖ చిత్రకారుడు. ఆ క్షణమే అతనిపై ఉన్న ప్రేమ రెట్టింపు అయ్యింది. తను చేసిన మోసం కూడా గుర్తొచ్చి ఏడుపు తన్ను కొచ్చింది. కళ్ళ నీళ్ళతో నే అతనికి కాఫీ అందించింది.

"ఏమయ్యింది మృణా?" ఆవేదనగా అడిగా డతను. ఏడుస్తూ అతని గుండెలపై ఒరిగి జరిగిందంతా చెప్పేసింది అంతా విని నవ్వేశాడతను

"ఒహో! ఇంత మాత్రానికేనా ఏదో జరిగి పోయినట్టు బాధపడు తున్నావు ఒకవేళ జాతకాలు కలువ లేదంటూ మన పెళ్ళి ఆగిపోతే ఇంత అందమైన అమ్మాయి నాకు దొ రికేదా?" అంటూ ఆమె బుగ్గలపై ముద్దు పెట్టుకున్నాడు "దీని గురించి నువ్వేం బెంగ పెట్టుకో నక్కర్లేదు అవన్నీ మర్చిపో ఇదిగో నే గిసిన కార్టూన్లు చూడు" అంటూ ఆమెకు ఇదివరలో తాను గిసిన కార్టూన్లు చూపించి నవ్వించా డతను

* * * *

కాలం ఇట్టే గడిచి పోయింది వాళ్ళ కిప్పుడు ఒక పిల్లవాడు. ఈ మూడేళ్ళలో మృణాళిని భర్తకు ప్రమోషన్ వచ్చింది అంతే కాకుండా అతను గిసిన చిత్రాలకు అంతర్జాతీయ ఖ్యాతి వచ్చింది చక్కనైన జీవితం ముచ్చటైన సంసారమే కాక సంఘంలో గౌరవం కూడా.

ఆ రోజు వాళ్ళ పెళ్ళయి మూడు సంవత్సరాలైన రోజు "మన పెళ్ళి రోజుకి ఏం కావాలో కోరుకో!" నాటక ఫక్కీలో అన్నాడు మృణాళిని భర్త

"ఏమీ అక్కర్లేదండీ! నాకు ఇంట్లో చాలా బోరుగా ఉంటోంది ఏదైనా సంఘ సేవలో పాల్గొనాలని ఉంది"

"అబ్బే! నీవేం సంఘసేవ చేస్తావు ఇంట్లో కూర్చుని సుఖపడ లేకనా?" అడిగాడు అతను.

అలా కాదండీ! మనం ఒక మేరేజ్ లింక్స్ స్థాపిద్దాం. నా పెళ్ళి జాతకాల దగ్గర, కట్నాల దగ్గరకు వచ్చేటప్పటికి వెనక్కి పోయేది. అలా కాకుండా జాతకాలు, కులాలు పట్టింపుల్లేకుండా కట్నంలేని పెళ్ళిళ్ళని మనం ముందుండి జరిపించి వారిని ప్రోత్సహిద్దా మండీ. ప్లీజ్!"

"ఒ.కె. ఒ.కె అలాగే కానీ నా చిత్రాల అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంలో సగం దానికై ఖర్చు చేద్దాం. ఇక టైమ్ వేస్ట్ చెయ్యకు" అంటూ ఆమెను దగ్గరకు తీసికొన్నాడు వాళ్ళిద్దరి మధ్యా మాటలు కరువయ్యాయి. ఆ తర్వాత రోజే, "మోడరన్ మారేజ్ లింక్స్" ఏర్పరచారు. అనతి కాలంలో నే దానికి మంచి ప్రోత్సాహం లభించింది □



ఎంత శ్రమపడితే అంత సంపాదన !

శ్రీ ద్వారక్‌నాథ్, శ్రీమతి ఫణికుమారి

"1978 లో ఉద్యోగంలో చేరాను రెప్రెజెంటేటివ్‌గా సారాభాయ్ కెమికల్స్‌లో. రెండేళ్ళు పనిచేసి విసిగిపోయి, 1980లో విప్రో లిమిటెడ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాను. రొటీన్ వర్క్. పదిమందినీ కలవడం ప్రొడక్ట్స్ గురించి వివరించడం -పరోపకారం చేయడంతో బోర్ కొట్టేసింది. ఈ శ్రమ, సొంతంగా ఏదన్నా వ్యాపారం పెట్టుకుని పడితే బాగా సంపాదించవచ్చునని ఫ్రెండ్స్‌తో కలసి 1985లో మార్కెటింగ్ ఏజన్సీస్ పెట్టాను. చేసే వ్యాపారం నా వృత్తికి చాలా దగ్గర సంబంధం ఉన్నది కావడంతో తేలికగానే ఉంది. ఎంత శ్రమపడితే అంత బాగా సంపాదించవచ్చు!" అన్నారు ఈ మధ్య యాక్సిడెంటల్‌గా కాలు విరగ్గొట్టుకున్న నండూరి ద్వారక్‌నాథ్.

ఈయన శ్రీమతి ఫణికుమారి హైదరాబాద్ డిఫెన్స్‌లో క్లర్క్‌గా పనిచేస్తున్నారు.

"మా వారు ఉద్యోగం మానేసి వ్యాపారం చేస్తానన్నప్పుడు ఆనందించాను. వ్యాపారం ప్రారంభించి తిండీతిప్పలు లేకుండా, సరదా, షికార్లు లేకపోవడంతో బాధపడుతున్నాను. ఎంత డబ్బు సంపాదించాలనుకున్నా ఆరోగ్యం ముఖ్యం కదండీ? ఈ వ్యాపారాలకన్నా ఉద్యోగమే హాయిగా ఉంటుంది. టైమ్‌కి వెళ్ళి, టైమ్‌కి తిరిగిరావచ్చు." అన్నారు శ్రీమతి ఫణికుమారి. ఆవిడ మాటల్లో నిజం లేకపోలేదు.

ద్వారక్‌నాథ్ కాలేజీలో చదువుతున్నప్పుడు వైమానిక శిక్షణ పొందారు. అప్పట్లో పైలట్‌గా వెడదామన్న ఆలోచన ఉండేదిట. 'స్విమ్మింగ్, ఫొటోగ్రఫీ, ట్రావలింగ్ అంటే నాకు మహా ఇష్టం. మనిషికి కాస్తంత కళాపోషణ కూడా ఉండాలి కదండీ...!అన్న ద్వారక్‌నాథ్ మాటకు ఆయన శ్రీమతి అడ్డు తగులుతూ... "ఏమిటి మీరు ఉద్యోగాలు మారినట్లు ... నేను అలాంటి కళా పోషణలకు ఒప్పుకోను." అంటూ 'తస్మాత్ జాగ్రత్త' అన్నట్లు భర్త వంక చూశారు.

"చూశారా మా ఆవిడ మోస్ట్ అండర్‌స్టాండబుల్ వైఫ్" అంటూ కాంప్లిమెంట్స్ ఇచ్చేశారు ద్వారక్‌నాథ్.

"ముఖ్యంగా ఉద్యోగాలు చేసే భార్యాభర్తలు ఏదీ దాచుకోకుండా మనసు విప్పి మాట్లాడుకుంటే ఎలాంటి మనస్పర్థలూ రావండీ! ఆ విషయంలో మా వారిని అభినందిస్తాను. పెళ్ళయ్యిం దగ్గర్నుంచీ ఆయన నా దగ్గర ఏదీ దాచకుండా చెప్పేస్తూ ఉంటారు. అది మంచి గుణం కదండీ" అన్నారు శ్రీమతి ఫణికుమారి.


ఈ ఆదర్శ దంపతులకి ఒక్కతే పాప. పేరు శ్వేత. ఎల్. కె. జి. చదువుతోంది. 'మా అమ్మాయికి అన్నీ తండ్రి పోలికలే ... ఆడపిల్లకు తండ్రి పోలికలొస్తే అదృష్టమంటారు. మా అమ్మాయి "అయితే డాక్టరు, లేదా యాక్టరు" అన్నారు నవ్వుతూ శ్రీమతి ఫణికుమారి.

"హైదరాబాద్‌లో డ్రైవింగ్ చాలా కష్టం. ఎవ్వరూ ట్రాఫిక్ రూల్సు పాటించరు. మోటర్ సైకిల్ మీద బయలుదేరితే ఇంటికి వచ్చే దాకా మనసు పీకుతూ ఉంటుంది. చూడండి మూడు నెలల నుంచీ కాలు ఫ్రాక్చరై బాధపడుతున్నారు" అన్నారు బాధగా శ్రీమతి ద్వారక్!

"అందుకే కారు : కొందామనుకుంటున్నాను" అన్నారు ద్వారక్.

"ఐ విష్ యూ క్విక్‌రి కవరీ; తొందరగా కారు కొనండి!'పెట్రోలు ధర తగ్గిపోతుంది ...' అన్నాను!"

— కృష్ణాజీ




సెక్స్ ఎడ్యుకేషన్ అవసరమా?

నాగార్జున విశ్వవిద్యాలయంలో "సెక్స్ ఎడ్యుకేషన్ అవసరమా?" అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో ఎంపిక చేసిన ఎనిమిది వ్యాసాలని, అవి రాసిన విద్యార్థుల ఫొటోలని ఇక్కడ వేస్తున్నాము. ఆ విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగానికి చెందిన శ్రీ గొల్లా డేవిడ్ రాజు ఈ వ్యాసాలని ప్రచురణకి అనువుగా ఉండేలా తగ్గించి వ్యవహారిక భాషలో రాసి పంపారు. ఈ అంశంపై పాఠకులు తమ అభిప్రాయాలని వివరిస్తూ వీలైనంత క్లుప్తంగా రాసి పంపితే ప్రచురణార్హమైన వాటిని వారి ఫొటోలతో సహా వారం వారం వేస్తాము. రచనలు 500 అక్షరాలకి మించకుండా కాగితానికి ఒక వైపే సిరాతో లేదా బాల్ పెన్‌తో రాయాలి. ప్రచురణకి అంగీకరించని వాటిని తిప్పిపంపగోరేవారు తమ రచన, ఫోటోతో పాటు తగినన్ని తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామా కల కవరును పంపాలి. వాటిపై ఉత్తర ప్రత్యుత్తరాలకి అవకాశంలేదు. రచనలు, ఫొటోలు సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధినగరం, విజయవాడ - 520003 అన్న చిరునామాకి పంపాలి.

-సం.

కళాశాల స్థాయిలో ఉండాలి



రసాయన శాస్త్రంలో ఒక మూలకానికి మరో మూలకానికి సంబంధం ఉన్నట్టే ఈ ప్రకృతిలో స్త్రీకి పురుషుడికి సంబంధం ఉంది. అది రసాయన శాస్త్రంలో సిగ్మ, పై బంధాలుగా ఉంటే మనుష్యుల్లో దాంపత్య బంధంగా ఉంది. ఈ దాంపత్య బంధంలో సుఖం నోచుకోని జీవితాలు ఈనాడు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. దీనికి కారణం సెక్స్ విజ్ఞానం మనకు చిన్నతనం నుంచి నేర్పక పోవడమే అంటే అతిశయోక్తి కాదు. ఇపుడు కొద్దోగొప్పో ఏమైనా సెక్స్ గురించి తెలిస్తే అది పత్రికల ద్వారానో పుస్తకాల ద్వారానో లేదా అంతరంగిక స్నేహితుల ద్వారానో తప్ప ఇంట్లో పెద్దవారి నుంచి మాత్రం కాదు. కాబట్టి బాల్యంలోంచి యవ్వనంలోకి అడుగు పెడుతున్న సమయంలో కళాశాలల్లో, సోషల్ ఎడ్యుకేషన్-వైజ్ఞానిక విద్య చెప్పినట్టే సెక్స్ ఎడ్యుకేషన్ కూడ చెప్పితే యువతీ యువకులు తప్పుదారి పట్టకుండ సక్రమమార్గాలలో నడుచుకుంటారు. కనుక ప్రభుత్వం సెక్స్‌కి సంబంధించిన విషయాలన్నింటినీ శాస్త్రీయ పరంగా వివరించే విద్యను బోధిస్తే యువతీయువకులకు భయాందోళన సిగ్గూబిడియం వంటివి పోవడమే కాకుండా సెక్స్‌కు సంబంధించిన బాధలు తీరుతాయి.

-ఎ. భానుప్రసాద్, ఎం.ఎస్.సి.(ఫైనల్)


సెక్స్ పాపం కాదు!



జంతువుల్లోనూ, మొక్కల్లోనూ వయస్సు పెరిగే కొలది వాటి శరీర భాగాల్లో చాల మార్పు వస్తుంది. అంతేకాదు, పరిపక్వ దశకు ఒచ్చే సమయంలో లైంగిక సంబంధమైన అవయవాలలో పెరుగుదల కూడ కన్పిస్తుంది. ఆడ జంతువుల్లో క్షీర గ్రంధులు పెరిగినట్టే పక్షుల్లో మొక్కల్లో కూడ కొన్ని భాగాలు పెరగడం మనం గమనిస్తాం. ఐతే, జంతువుల్లో లైంగిక పరమైన కట్టుబాటు వుండదు. అందువల్ల అవి విచ్చలవిడిగా ప్రవర్తిస్తాయి అవి స్వేచ్ఛగా జీవిస్తూ సెక్స్‌ని అనుభవిస్తాయి. కాని మానవుడు కొన్ని కట్టుబాట్లు ఏర్పరచుకుని వాటిననుసరిస్తూ జీవిస్తున్నాడు. ఐతే, బాల్య దశ నుండి యవ్వన దశకు అడుగు పెడుతున్న తరుణంలో శరీరంలో కొన్ని అవయవాలు పెరగడం, కొన్ని గ్రంధులు స్రవించడం వంటి మార్పులపై సరైన అవగాహన పరిణతి చెందుతున్న వయసులో వున్న వారికి లేకపోవడం వలన వారిలో కంగారు, భయం, ఆందోళన, న్యూనతాభావం పెరుగుతుంది. కాని అప్పటికే సెక్స్ గురించి కొంచెం ఐనా తెలిసి వున్నట్లయితే ఆ విధమైన సమస్యలకు అస్సలు తావనేదే వుండేదికాదు. కాని సెక్స్ గురించి చెప్పేది ఎవరు? మన పవిత్ర భారతదేశంలో సెక్స్ అంటేనే మహాపాపం. అందువల్ల సెక్స్ గురించి మన తల్లిదండ్రులకు కూడా సరిగా తెలియదు. మనకు అంతకంటే తెలియదు. కాని భయాందోళనలకు మాత్రం కొదువలేదు. కాబట్టి లేనిపోని భయాలు పోవాలంటే సెక్స్ ఎడ్యుకేషన్ చాలా అవసరం. దీన్ని కళాశాలలో నిర్బంధ విద్యగా ప్రవేశపెడితే ఏ సమస్యలు వుండవు. సెక్స్‌పరమైన కట్టుబాట్లు లేని పాశ్చాత్య దేశాలు అన్ని విధాల అభివృద్ధిచెందాయి. కాబట్టి మనదేశంలో కూడా సెక్స్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టడం తప్పులేదు. అందువల్ల దీనిని ఇంటర్మీడియెట్ స్థాయినించే ఒక భాగంగా వుంచితే ఆ వయస్సునించే విద్యార్థుల్లో సెక్స్ గురించి సరైన అవగాహన కలుగుతుంది. అది ఆరోగ్యానికి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుంది.

-కుమారి నిర్మలాకుమారి,
ఎం. ఎస్. సి. (ఫైనల్)


భ్రమలు తొలగిపోతాయి



మనం దేనివలనైతే పుట్టామో దాని గురించి తెలుసుకోడాన్నే సెక్స్ విద్య అంటాం. అంటే మగ వారిలోని స్పెర్మటోజోవా ఆడు వారిలోని అండంతో సంగమం చెంది తొమ్మిది నెలల తర్వాత హోమోసపిన్స్‌గా ఈ ప్రపంచంలో ఒక మానవునిగా ఉద్భవిస్తాడన్న సత్యాన్ని తెలుసుకోవడం. ఇంత ప్రకృతి సిద్ధమైన ఈ చర్యను పట్టుకుని 'పాపం'అని పేరు పెట్టి అస్సలు సెక్స్ స్వరూపాన్నే మార్చేసింది ఈ వ్యవస్థ. అందుకనే డా. ఎ. టి. కోవూర్‌గారు "నేను అందరిలానే అమ్మానాన్నల కలయిక వల్ల పుట్టాను. నా పుట్టుకలో లింగ,జాతి, మత ప్రమేయాలే కాదు, అసలు నా ప్రమేయమే లేదు!" అని విప్పి చెప్పినా మనవాళ్ళు కళ్ళు విప్పరు. ఇలాంటి మూర్ఖత్వంతో జీవిస్తున్న మనం అభివృద్ధి చెందటం చాలా కష్టం. సెక్స్ పట్ల ఏ. చట్టాలూ, కట్టుబాటు లేని పాశ్చాత్య దేశాలు ఆర్థికంగా ఎంతో ముందున్నాయి. కాబట్టి సెక్స్ అంటే ఏమిటో, దాని నిజ స్వరూప మేమిటో యువతీ యువకులకు సెక్స్ పాఠాల ద్వారా బోధిస్తే వారికి తెలుస్తుంది. దాంతో లేనిపోని భ్రమలు తొలగిపోవడం, జీవితం సుఖమయం కావడం జరుగుతుంది.

–ఎ. రాంబాబు, బి. ఎస్‌సి (అగ్రి),
ఎం. బి. ఎ (ఫైనల్)

శాస్త్రీయ అవగాహన అవసరం!



ఈనాడు పెళ్లి చేసుకోడానికి సిద్ధంగావున్న వాళ్లకు కూడా అస్సలు సెక్స్ అంటే ఏమిటో సరిగ్గా తెలియదు. అలాంటి స్థితిలో వున్న వాళ్ళు పెళ్లి తర్వాత కూడా రతి సక్రమ మార్గాలలో జరపడం తెలియక ఆందోళన పడిపోయి తమకు తామే అసమర్థులమనుకొని లేనిపోని భయాలకు గురై వున్న శక్తిని కూడా కోల్పోతున్నారు. సెక్స్ పట్ల మనదేశంలో పేరుకుపోయిన పనికి మాలిన. అవగాహన చక్కని జీవితాన్ని సైతం నాశనం చేస్తుంది. కాబట్టి రతికి సంబంధించిన విషయాలను గురించి మంచి శాస్త్రీయ అవగాహన కలిగించి, అనేక అనుమానాలతో అమాయకత్వంతో

సతమతమై పోతున్న భారతీయులను లైంగిక విద్యద్వారారక్షించవలసిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే యువకుల గురించి యువతులూ, యువతుల గురించి యువకులూ నిరంతరం ఆలోచిస్తూ పగటికలలు కంటూ మానసిక వ్యభిచారం చేస్తూ చదువులు మర్చిపోయి, కర్తవ్యాన్ని మర్చిపోయి, భవిష్యత్తును మర్చిపోయి, అతి విలువైన కాలాన్ని సర్వనాశనం చేసుకుని మూడేళ్ళ కోర్సు ఆరేళ్ళూ, ఆరేళ్ళ కోర్సు పదేళ్ళూ చదివి దేనికీ పనికి రాకుండా రోడ్లంట తిరుగుతూ, చివరికి ఆత్మహత్య చేసుకున్న వాళ్ళు ఎందరో వున్నారు. కాబట్టి సెక్స్ విద్యను ఈ వైజ్ఞానిక యుగంలో ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-రవి, ఎం.ఎ. (ప్రీవియస్)


విలువైన కాలాన్ని వృధా చేసుకోకండి!



నిజంగా సెక్స్ విజ్ఞానం పట్ల ఇరవై అయిదేళ్ల క్రితం ఎలాంటి చిన్న చూపు, నీచమైన అభిప్రాయం ఉందో అది ఇప్పటికీ అలాగే కొనసాగుతుంది. దీనిని బట్టి సెక్స్ పరమైన విజ్ఞానం ఏం పెరగలేదనే చెప్పవొచ్చు. కాబట్టి లైంగిక విద్య పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రవేశపెట్టడం చాల అవసరం. గ్రామీణ ప్రాంతాల్లోనూ వెనుకబడిన ప్రాంతాల్లోనూ సాంప్రదాయక కుటుంబాల్లోనూ సెక్స్ విజ్ఞానం పట్ల తల్లిదండ్రులు ప్రదర్శించే వైఖరి నిజంగా భరించలేక పోతున్నాము అంటే అతిశయోక్తి కాదు. ఎందుకనో ప్రతీ ఒక్కరూ దాని పట్ల అంటరానితనం పాటిస్తున్నారు. ఇది నిజంగా చాల ఘోరం. ముఖ్యంగా యువతుల విషయం చూస్తే వాళ్ళు రజస్వల అయ్యే వరకూ సెక్స్‌పరంగా ఏమాత్రం విజ్ఞానం కలిగి ఉండరు. అందువల్ల వాళ్ళు సంభోగం, గర్భధారణ, ప్రసవం వంటివి ఎదుర్కొన్నపుడు భయాందోళనలకు గురి అవుతున్నారు.దీనికి కారణం వాళ్ళలో సెక్స్ పట్ల ఏ విధమైన. శాస్త్రీయ అవగాహన లేకపోవడమే. అంతేకాదు, ఈనాడు విద్యార్థులందరూ సెక్స్‌పరమైన ఆలోచనలతో తమ విలువైన కాలాన్ని వృధా చేసుకుంటున్నారు. భావి జీవితంలో కూడ తాము అనుకున్నవి సాధించలేక పోతున్నారు. అందుచేత ఈ ఓపెన్ సీక్రెట్ లైంగిక విద్య ద్వారా కళాశాలల్లో ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దానివల్ల యువతీయువకులకూ సెక్స్ పట్ల సరైన అవగాహన కలిగి లేనిపోని అపోహలను తొలగించుకుంటారు. అంతేకాదు. దానివల్ల మానభంగాలు చేసేవారి సంఖ్య కూడ తగ్గిపోతుంది. లైంగికపరమైన విషయాలను శాస్త్రీయ దృక్పథంలోంచి ఆలోచించడం సాధ్యమవుతుంది.

-టి. శేషగిరి, ఎం. ఎస్‌సి., (ప్రీవియస్)


సమాజ శ్రేయస్సు కోసం



ఈనాడు దాంపత్య జీవితం సుఖమయం కాకుండా పోవడానికి కారణం ఆ నాడు మనకు సెక్స్ విద్యను నేర్పక పోవడమే. ఐనా మనం కళ్ళు విప్పం. ఎక్కడిదాకో దేనికి, ఇంట్లో కూతురు రజస్వల అయితే అపుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు తల్లే చెప్పదు. ఒకవేళ ధైర్యం చేసి కూతురు అడిగినా కసిరి కొడుతుంది తిడుతుంది. అలాంటపుడు ఆ ఆడకూతురు యేం చేస్తుంది? ఎలా ప్రవర్తిస్తుంది? దీనికి సమాధానం ఎవరూ చెప్పరూ ఏ మతగ్రంథం కూడ చెప్పదు. అందుకని 'ఎ' సర్టిఫికెట్ సిన్మాలను చూచి శృంగారపరంగా రెచ్చగొట్టే పుస్తకాలు చదివినాశనమై పోతున్న యువతరాన్ని మంచి మార్గంలో పెట్టాలంటే ముందు కాలేజీలలో సెక్స్‌విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి సెక్స్ పట్ల సరైనఅవగాహన కలిగించడం ఎంతైనా అవసరం. అలా జరిగిననాడు ప్రభుత్వంతో పని లేకుండా ఎవరికి వారే కుటుంబనియంత్రణ విధానాన్ని స్వతహాగానేఅనుసరిస్తారు.అంతేకాదు, సెక్స్ విద్యా విధానం వల్లమానభంగాల్ని కూడ సులభంగాఅరికట్టవచ్చు. కాబట్టి సమాజం యింకా చెడిపోక ముందే ప్రభుత్వం సెక్స్ విద్యా విధానాన్ని ఒక సబ్జక్టుగా పెట్టి అక్రమాలకూ, అఘాయిత్యాలకు పాల్పడకుండా కాపాడటం దేశ భవిష్యత్తుకేమంచిది.

—విల్సన్ ఆలూరి ఎం. ఎ.


ఆదర్శ జీవితానికి అవసరం!



అమెరికా, రష్యా వంటి దేశాల్లో ఎనిమిదేండ్ల బాల బాలికలకుండే సెక్స్ విజ్ఞానము మన దేశంలో నలుగురైదుగుర్ని కని, వాళ్ళకు పెళ్ళిచేసిన తల్లి దండ్రులకు కూడ లేదు. దీన్ని బట్టి మన దేశం ఈ విషయంలో ఎంత వెనకబడి ఉందో ఈజీగా చెప్పొచ్చు. సెక్స్ విజ్ఞానంలో ఏదో గ్రామీణ ప్రాంతం వెనుక బడి ఉందంటే కొంతైనా అర్థం ఉంది. కాని ఎంతో విజ్ఞానాన్ని నేర్చుకుని మేం 'అత్యాధునికులం' అనుకుంటున్న ఉన్నత తరగతి కుటుంబాల్లోనూ, మధ్య తరగతి కుటుంబాల్లోనూ బాగా చదువుకుని పెద్ద పెద్ద వుద్యోగాలు చేసుకుంటున్న సంసారాల్లోనూ లైంగిక విద్యను గురించి ఆవగింజంత అవగాహన కూడ లేదు. దీనిని బట్టి సెక్స్ విజ్ఞానం నిర్బంధ విద్యగా కళాశాలల్లో బోధించక పోవడం నిజంగా భారతీయుల దురదృష్టమనే చెప్పొచ్చు ప్రస్తుతం ఈ సెక్సు మీద ఏవిధమైన శాస్త్రీయ అవగాహన లేక అనేక మంది యువతీయువకులు లేనిపోని అపోహలతో తమ అమూల్యమైన సమయాన్ని వృధా చేసుకుని దేశానికి సాహసోపేతంగా ఆదర్శంగా పెరగలేక పోతున్నారు. కాబట్టి, యవ్వనంలోకి ప్రవేశిస్తున్న యువతీయువకులకు 'జననేంద్రియాలకు' సంబంధించిన విషయాలన్నింటినీ శాస్త్రీయ పరంగా వివరిస్తూ సక్రమమయిన అవగాహనను కలిగించడం ఎంతైనా అవసరం. అందువల్ల ప్రభుత్వం వారు ఇకనైనా కళ్ళు తెరచి కళాశాలల్లో లైంగిక విద్య త్వరగా ప్రవేశపెడతారని ఆశిద్దాం.


బొత్స ఆదర్శగాంధీ, ఎం. ఎ.(ప్రీవియస్)

నిర్బంధంగా ప్రవేశపెట్టాలి



సెక్స్‌కు సంబంధించినంత వరకూ ఏ విధమైన నిర్బంధాలూ నిషేధాలూ లేని అమెరికా ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందింది. మరి దిట్టమైన కట్టుబాట్లు నిర్బంధాలూ, నిషేధాలూ వున్న మన దేశం ఆర్థికంగాఏం అభి వృద్ధి చెందిందో ఏం సాధించిందో ఒకసారి ఆలోచించండి? ఈనాడు లేనిపోని కట్టుబాట్లతో తీరి తీరని కోరికలతో యువతరం పూర్తిగా నాశనమైపోతోంది. ఐనా మన దేశం యింకా కళ్ళు తెరవడంలేదు. కులాల కుళ్ళుతో మతాల మత్తులో నిత్యం నిదురపోతోంది. ఈ దరిద్రపు నిద్రలోంచి ప్రతి ఒక్కర్ని పైకి లేపాలంటే సర్వ విజ్ఞానాన్ని నేర్పాలి. మనిషికి తింటానికి తిండి కట్టుకోడానికి బట్ట ఉంటానికి ఇల్లు ఎంత అవసరమో సెక్స్ కూడ అంతే అవసరం. అంత అవసరమైన సెక్స్ విజ్ఞానాన్ని ఎంతో రహస్యంగా ఉంచడం నిజంగా యువతరాన్ని మోసం చేయడమే. అందువల్ల కళాశాలలో ఇంటర్ స్థాయినించే సెక్స్ విద్య ప్రవేశపెట్టటం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో శ్రేయస్కరం. లేకపోతే వయస్సు వొచ్చిన ప్రతి ఒక్కరూ సంభోగంలో ఏదో ఉందనే భ్రమతో శరీర స్వాభావికోద్రేకాలు రెచ్చగొట్టే సిన్మాలకు వెళ్ళడం, దాన్తో కోరికలతో రెచ్చిపోయి వేశ్యల దగ్గరికెళ్ళడం -సుఖవ్యాధులు తగిలించుకోవడం - బంగారం వంటి భవిష్యత్తును నాశనం చేసుకోవడం జరుగుతుంది. కాబట్టి ప్రభుత్వం ఈ పరిస్థితులను అర్థం చేసుకుని సెక్స్ విద్య నిర్బంధవిద్యగా కళాశాలల్లో ప్రవేశపెట్టి యువతరాన్ని కాపాడాలి.

—కె. భూషణం, ఎం. కామ్. (ఫైనల్) □



సీరియల్

జీవితం చేజారిందా?

కాకాని కమల

(గత సంచిక తరువాయి)

వరలక్ష్మికి కొడుకు పంచప్రాణాలు

కాని భర్తని ఒదిలి కొడుకు దగ్గర ఎంత కాలం అని వుండగలదు? అదిగాక ఆవిడకి కూడా కొడుకు మళ్ళీ పెళ్ళి చేసుకోవాలన్నదే కోరిక.

నట్టింట లక్ష్మిలా తిరిగే కోడలు చిన్న వయసులోనే చనిపోయింది

కొడుకు జీవితం బీటవారింది.

కాని ఒక కన్ను పోయింది కదా అని రెండవ కన్ను కూడా పొడుచుకుంటామా?

పోయిన కోడలుతో పాటు కొడుకు జీవితం బలి కావటం ఆవిడకి సుతరామూ ఇష్టంలేదు. ... ముందు ముందు కన్ను నొచ్చినా కాలు నొచ్చినా తోడూ నీడగా మెసలే భార్యలేని లోటు ఎంతటిదో ఆమెకి తెలియందికాదు.

పూలరంగడులా వుండే కొడుకు విరాగిలా మారటం ఏ తల్లి సహించగలదు?

అందుకే కొడుకుని మళ్ళీ పెళ్ళి చేసికోమని చెవినిల్లు గట్టుకుని పోరసాగింది. నచ్చ చెప్పింది. కాని ప్రభాకర్ వినలేదు.

చివరికి ఆవిడ విసిగి వేసారి అదదిక్కూ లేని సంసారం ఎలా వుంటుందో తెలియజెప్పటం కోసమే కావాలని మనసు కట్టుకుని/ఒక్కగానొక్క కొడుకుని, తల్లి లేని మనమల్ని పట్టించుకొనటం మానివేసింది. పల్లెటూరులోనే ఎక్కువ రోజులు వుండిపోసాగింది

కాని ప్రభాకర్ మనసు వేరు. అభిప్రాయాలు వేరు.

సంధ్యని కోరి చేసుకున్నాడు. సంధ్య కూడా అంతే. పంచప్రాణాలు భర్తలో విలీనం చేసి వెళ్ళిపోయింది ఆమె జ్ఞాపకాలు, స్మృతులు ఆమెతో గడిపిన జీవితం ప్రతి చిన్న సన్నివేశం అనుక్షణం అతని మనసులో మెదులూనే వున్నాయి

జరిగిన కథ-5: ఆ రోజు సీతను చూసుకోవడానికి పెళ్ళివారు వస్తున్నారని విశ్వేశ్వరయ్యా ఆఫీసుకి మధ్యాహ్నం శెలవు పెట్టి వచ్చి సుభద్రమ్మతో చెపుతాడు. వరుడు ప్రభాకర్ మొదటి భార్యకి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీత అందరికి నచ్చింది ప్రభాకర్ తను తన పిల్లల కోసమే ఈ పెళ్ళి చేసుకుంటున్నానని, భర్తగా సీతకు న్యాయం చేకూర్చలేనేమోనని సీతతో చెపుతాడు సీత ఏమైనా సరే ఈ పెళ్ళి చేసుకోనని ఇంట్లో చెప్పాలని నిర్ణయించుకుంటుంది. రాధిక మరణంతో అందరి మనసులు పాడైపొయ్యాయి సీతకి మనసంతా కెలికినట్లయింది పరిస్థితులకు తల ఒగ్గి ప్రభాకర్‌తో పెళ్ళికి అంగికరిస్తుంది సీత.

విడని నీడలా ఆమె రూపం అతన్ని వెన్నాడుతూనే వుంది తమ ఇద్దరి ప్రేమకి ప్రతిరూపాలు కళ్ళ ముందే వున్నారు

ఈ పరిస్థితిలో మళ్ళీ పెళ్ళి ఏమిటి?

భౌతికంగా సంధ్య దూరం అయినా మానసికంగా ఆమె తనలోనే వుంది

కాగా వియోగం మరింత ప్రేమని పెంచింది

పాత్ర నిండుగా నీరు వుండగా ఇంకా అదనంగా అందులో నీరు పోస్తే - అవి క్రిందికి ఒలికిపోతాయి గాని అందులో ఇమడలేవు

మనసులో ప్రేమకూడా అంతే

ఈ పరిస్థితిలో మళ్ళీ పెళ్ళి చేసుకున్నా ఆమెని ప్రేమించలేడు

చూస్తూ చూస్తూ పెళ్ళి పేరుతో ఒక ఆడపిల్లకి అన్యాయం చెయ్యటం అతనికి నచ్చలేదు. సంస్కారం అడ్డు వస్తుంది

అలా అని ఆమెని ప్రేమించలేడు.

అమృతం "రుచి" తెల్సిన నాలుక గంజి రుచిని వెగటించుకుంటుంది

పైగా రెండో పెళ్ళి గురించి అతనికెన్నో అపోహలున్నాయి.

తనకి భార్య వస్తుందేమోగాని పిల్లలకి తల్లి వస్తుందన్న నమ్మకం అతనికిలేదు

కాని అతనికి కావల్సింది భార్య కాదు

పిల్లలకి తల్లి•

మరి

అది సాధ్యమా?

కాని పిల్లల పెంపకం సమస్య తెగలేదు

మగవాడి చేతిలో పిల్లలు - ఆడదాని చేతిలో ఆస్తి బ్రతకదు అంటారు

తిరిగి పెళ్ళి చేసుకోమని - ఇంటికి ఇల్లాలు ఎంతైనా అవసరం అని ఎందరో సలహా ఇచ్చారు

ఆఖరికి ప్రాణమిత్రుడు డా ఆనంద్ కూడా అదే పాట పాడాడు

"ఒరేయ్ ప్రభూ! నీ శ్రేయస్సు కోరి ఆత్మీయుడుగ చెపుతున్నాను ఈ ఒక్కసారికి నా సలహా పాటించి మళ్ళీ పెళ్ళి చేసుకో . .

సవతి తల్లి అంటే "రాక్షసి" అన్న ఒక దురభిప్రాయం మనలో అనాదిగా నాటుకుని పోయింది.

కాని సవతి పిల్లల్ని కూడా ప్రేమగా చూసే ఆడవాళ్ళు లోకంలో ఎంతో మంది వున్నారు.

కావాలంటే నీ అభిప్రాయాల్ని వివరంగా చెప్పు పెళ్ళికి ముందే నీ మనసు విప్పి ఏకాంతంగా మాట్లాడు ఇష్టం అయితేనే చేసుకుంటుంది ' అన్నాడు

ప్రభాకర్ దైన్యంగా చూశాడు

"ఆనంద్! అంతేనంటావా? అంతకుమించి వేరే మార్గం లేదా?"

"మార్గాలు లేకేం? వున్నాయి. కాని ఇది సరి అయిన మార్గం అని నా అభిప్రాయం. కేవలం మిత్రుడిగా కాక ఒక డాక్టరుగా నీ పిల్లల మానసిక స్థితిని బట్టి ఆలోచించి ఈ సలహా చెప్తున్నాను. నా మాట విను ఎంత డబ్బు. ఎందరు బంధువులు, పనివాళ్ళు వున్నా ఇంటిని చక్కదిద్దుకొనే ఇల్లాలు ఎంతైనా అవసరం. గృహిణి లేని ఇల్లు దేముడులేని కోవెల లాంటిది అంటారు పెద్దలు. నీకు తెలియదా చెప్పు ఆ మాట?"

"తెలియకకాదు ఆనంద్. కాని . సవితి ..."

చిన్నగా మందహాసం చేశాడు ఆనంద్.

"చూడు. అలాంటి అనుమానాలన్ని నువ్వు ముందు నీ మనసులోంచి తుడిచెయ్ ...

. .పువ్వులు ఎంతో సుకుమారంగా సున్నితంగా వుంటాయి. మకరందాన్ని నింపుకుని అందంగా వుంటాయి. కొన్ని పువ్వులు విషపూరితాలు అయి కూడా వుంటాయి. అలా అని మనం పువ్వులన్నింటిని ద్వేషించగలమా?"

" ... !?"

"స్త్రీ అంటే అమృతమూర్తి త్యాగానికి, లాలిత్యానికి ప్రతీక. నీకు కావల్సినంత డబ్బుంది. కాని ఆ డబ్బుతో పిల్లల్ని క్రమశిక్షణగ పెంచగలను అనుకోవటం అవివేకం డబ్బుకి మనసు వుండదు. ఎంత పెట్టినా మా అమ్మవి అవుతావా? అన్నట్లు ఎంత అపురూపంగా పెంచినా స్త్రీ చేరబిలిచి లాలించినట్లు మనం పిల్లల్ని పెంచలేమురా! జీతానికి కుదిరిన "ఆయా" ఆయానేగాని అమ్మ కాలేదు కదా? నా మాట విను. మళ్ళి పెళ్ళి చేసుకో. నీ పరిస్థితి అంతా నాకు తెల్సు గనక నీకు తగిన అమ్మాయిని నేను చూసి తీసుకువస్తాను. నా మాట విను.

ప్లీజ్ బిలీవ్ మి ..."

మిత్రుడి చేతిని ఆప్యాయంగా పట్టుకుని బ్రతిమిలాడాడు ఆనంద్.

ప్రభాకర్ మనసు మెత్తగా కరిగినట్లు అయ్యింది.

"ఒరేయ్ ఆనంద్. అంతేనంటావా? వేరే మార్గం ఏదీ లేదా?"

ఆనంద్ అడ్డంగా తల కదిలించాడు.

"లేదు."

"నీ కంటి ముందు నీ పిల్లలు ప్రతి క్షణం వుండాలి అనుకొంటే ఇంతకంటే వేరే మార్గం లేదు. మళ్ళి పెళ్ళిచేసుకుంటే నీకు ఇంటి గురించి, పిల్లల గురించి బెంగ వుండదు. నిశ్చింతగా నీ పనులు నువ్వు చేసుకోవచ్చు. కాని ఒక మాట ..."

" ... !?"

"కేవలం పై హంగులు చూసి మోసపోక కష్టం - సుఖం తెల్సి ఓర్పుతో మెసులుకొనే ఓ పేద ఇంటి అమ్మాయిని చూసి పెళ్ళిచేసుకో. నీ సమస్యలు అన్ని పరిష్కారమవుతాయి. ఓ పేద ఇంటి అమ్మాయికి ఆశ్రయం యిచ్చానన్న తృప్తి



జీవితం చేజారిందా

నీకు ఉంటుంది." అన్నాడు అభిమానంగా మిత్రుడి భుజం తట్టుతూ డా. ఆనంద్.

"..."

సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభాకర్‌ని చూసి సన్నగా నవ్వాడు ఆనంద్.

"ప్రభూ! ఏమిటి ఇంకా నీ సందేహం?"

కొద్దిగా తల పంకించాడు ప్రభాకర్.

"అది కాదురా. సంధ్యని ప్రేమించినట్టు నేను ఇంకెవ్వరిని ప్రేమించలేను. ఆ రాబోయే ..."

జాలిగా చూశాడు ఆనంద్.

"ప్రభూ! ముందు అలాంటి అనుమానాలన్నింటికి స్వస్తి చెప్పు. పెళ్ళికి ముందే ఆ అమ్మాయితో పర్సనల్‌గ మాట్లాడు. అప్పుడు మోసం చేశానన్న బాధ నీకుండదు. ఈ రోజుల్లో వయసు మించిపోయి పెళ్ళిళ్ళు కాక వృద్ధ కన్యలుగానే మిగిలిపోతున్న పేద ఇంటి అమ్మాయిలు ఎందరో వున్నారు. వరకట్నాలు ఆకాశాన్ని అంటుకున్నాయి. చదువు - ఉద్యోగం వున్న ఆడవాళ్ళకే పెళ్ళి పెద్ద సమస్య అయ్యింది.. ఇంక ఆ రెండు కూడా లేని పేద ఇంటి పిల్లకి నీలాంటి వాడిని చేసుకుందుకు అభ్యంతరం ఏమిటి? నా మాట విను. నువ్వు పెళ్ళికి ఒప్పుకో. ఇంక మిగతా విషయాలు నేను చూసుకుంటాను. చక్కటి అమ్మాయిని ... సుగుణాల రాసిని తెచ్చి నీకు పెండ్లి చేస్తాను...

... రేపు నీ సంసారంలో కలతలు వస్తే, నీ పిల్లల్ని ఆ అమ్మాయి సవితి పోరు పెడితే నువ్వు ఆ అమ్మాయిని దండించవచ్చు.

"ఇలాంటి పిల్లని నాకు ఎందుకు అంటగట్టావ్?" అని సరాసరి నన్ను అడుగు. తెల్సిందా?" అన్నాడు భరోసా ఇస్తూ.


ఆ విధంగా చివరకి ఆనంద్‌కి కాస్త దూరపు చుట్టం, చిరపరిచితుడు అయిన శివరావు ద్వారా సంబంధం నిశ్చయం అయింది.

ప్రాణమిత్రుడు ఆనంద్ ప్రోద్బలం, అనుభవశాలి అయిన శివరావు సలహా సంప్రదింపులు, వరలక్ష్మమ్మ సమర్థింపు, అన్నింటిని మించి తల్లి ఆలనాపాలనకి మొఖం వాచిన పిల్లల భవిష్యత్తు ... అన్ని కల్సి ప్రభాకర్‌ని తల వంచేలాగ చేశాయి.

కాని -

ఏ ముహూర్తాన అతడు ఈ పెళ్ళికి ఒప్పుకున్నాడో గాని ఆ క్షణం నుంచి అతడి మనసు అగాథంలోకి కృంగిపోసాగింది. మరణించిన తన ప్రేయసికి (భార్యకి) అన్యాయం చేసి ప్రేమని సమాధి చేస్తున్నట్టు ఆవేదన కలగసాగింది.

ఈ లోకంలో మగవాళ్ళు రెండు రకాలు.



భార్య మీద (స్త్రీ) ప్రేమాతిశయంతో తన వ్యక్తిత్వాన్ని కూడా చంపుకుని ఆమె కొంగుకి ముడిపడిపోయే వాళ్ళు ఒక రకం -

భార్యని (స్త్రీ) అసలు ఒక ప్రాణమున్న మనిషిగా చూడకుండా చెప్పు కింద సిగరెట్ పీకలా నలిపి వెయ్యాలి అనుకునేవారు రెండో రకం!

* * * * *

కాలం కల్సి వచ్చి మనిషికి సంతోషంగా వున్నప్పుడు రోజులు క్షణాల్లా దొర్లిపోయినట్టు అనిపిస్తుంది.

కష్టాల్లో వున్నప్పుడు ప్రతి క్షణం యుగంలా తోస్తుంది.

"చిటికె వేసినట్టు రెండు నెల్లు ఇట్టే గడిచిపోయ్యాయి." అనుకుంది సుభద్రమ్మ.

ఆ రోజు శుక్రవారం.

ఉదయం లేచిన దగ్గర్నుంచి విశ్వేశ్వరయ్య ఇల్లు పెళ్ళి సందడితో కలకలలాడుతోంది.

ఇంటికి తెల్లగా సున్నాలు వేయించారు.

ఇంటి ముందు తాటాకులతో చిన్న పందిరి వేసి చుట్టు మామిడి తోరణాలు కట్టారు.

కింద చక్కగా అలికి రంగవల్లులు తీర్చారు. పందిరి కింద ఒక ప్రక్క వరసగా కుర్చీలు, బెంచీలు వేశారు.

మరొక ప్రక్క సత్రంజి మీద భజంత్రీలవాళ్ళు కూర్చుని ఉప్మాలు తింటున్నారు.

తెల్లవారితే సీత పెళ్ళి.

విశ్వేశ్వరయ్య చెల్లెళ్ళు బావమరదులు, కూతురు అల్లుడు అంతా వచ్చారు.

వరకట్నం - పెళ్ళి ఖర్చు అంటూ ఏమి లేకపోయినా విశ్వేశ్వరయ్య మూడు వేలు అప్పు తీసుకు వచ్చాడు.

ఆ రోజు శుక్రవారం. తిథి కూడా బాగుండటం చేత సీతని పెళ్ళికూతుర్ని చేస్తున్నారు.

సుభద్రమ్మ పూలు - పళ్ళు తెప్పించి ఆ వీధివాళ్ళందర్ని పేరంటానికి పిలిచింది.

ముత్తయిదువులందరూ వచ్చి సీతకి చక్కగా తలంటి పోశారు.

సీత ఒత్తయిన నిడుపాటి ఒంకీలు తిరిగిన జుత్తు తలంటు స్నానం చేయించటంతో మరింత అందంగా పట్టుకుచ్చులా మెరుస్తూంది.

సుభద్రమ్మ దగ్గరుండి కూతురు జుట్టు చిక్కులు తీసి చక్కగా దువ్వి జడ అల్లింది. తలనిండా గుత్తగా అల్లిన పూలదండ పెట్టింది.

సీత అత్తగారు పెట్టిన కంచీవరం పట్టు చీర కట్టుకుని మెడలో రాళ్ళ నెక్‌లెస్ పెట్టుకుంది.

ఎర్రటి పూల గాజులు చేతులనిండా వేసుకుంది.

పసుపు పారాణి అలంకరించిన పాదాలకి చక్కగా వెండిమువ్వల పట్టీలు మెరుస్తున్నాయి.

ఈ పాతికేళ్ళ జీవితంలో అంత ఆడంబరంగా ఖరీదుగా అలంకరించుకోవటం సీతకి అదే ప్రథమం.

సుభద్రమ్మ కూతురి నుదుట కళ్యాణ తిలకం దిద్ది బుగ్గన చుక్క పెట్టింది.

ఆ అలంకరణలో సీత నిజంగానే అలనాటి అందాల అలకాపురి సీతలాగానే వుంది.

సుభద్రమ్మ ఆనందం పట్టలేక కూతుర్ని గట్టిగా కౌగలించుకుంది.

"నా తల్లే! ఎంత అందంగా వున్నావే. ఇన్నాళ్ళకి నీ నోము పండింది. వజ్రం అయినా సాన పెడితేనే మెరుస్తుంది. ఆడపిల్లకి నగలే అందం. నా జన్మలో నీకు ఇలాంటి చీర కొనగలనా? చిన్నం ఎత్తు బంగారు నగ చేయించగలిగానా? దరిద్రురాల్ని ... ఆడపిల్లల్ని కన్నానే గాని ముక్కు కుట్టించి పుల్ల వేయించలేకపొయ్యాను. పోనీలే తల్లి. నా కడుపున పుట్టినందుకు ఈ మాత్రం అయినా అదృష్టం లభించింది. నేను ఎలాగూ సుఖపెట్టలేక పొయ్యాను. రేపట్నుంచి అత్తారింట్లో అయినా సుఖపడు. అంతే చాలు ...." కూతుర్ని వెర్రి ప్రేమతో కౌగలించుకుని కన్నీళ్ళు పెట్టుకుంది.



తల్లి పాలు బిడ్డకు అన్నిటికీ మించిన పోషకాహారమేకాక ఎంతో మానసిక సంతృప్తిని కూడా కలుగచేస్తాయి



తల్లి పాలు తాగటం వలన మాతా శిశువుల ఆత్మానుబంధం ఎంతో దృఢతరమవుతుంది. తల్లి ప్రేమను బిడ్డకు పంచి పెట్టేందుకు యిదే ప్రకృతి సిద్ధమైన పద్ధతి శిశువు సంతోషంగా సంతృప్తిగా పెరిగేందుకు దోహద పడుతుంది.

కేవలం తల్లి పాలు మాత్రమే బిడ్డకు కావలసిన పోషకాహారాన్ని, సమపాళ్ళలో అందించ గలుగుతాయి.

మీ బిడ్డను, మీ చనుపాలతోనే పెంచండి. అదే ప్రకృతి నిర్దేశించినది, మీ శిశువుకు కావలసినది.

కాని ఏదైనా అనుకోని ఇబ్బంది వచ్చినపుడు, అంటే ఏదైనా జబ్బు చేసినప్పుడో, పాలు సరిపడనప్పుడో విజయ స్ప్రేను వాడండి – చక్కగా పరీక్షించబడిన నమ్మకమైన శిశు ఆహారం. మీ బిడ్డ ఆరోగ్యం కాపాడడానికి డబ్బా మీద వ్రాసిన సూచనలను క్షుణ్ణంగా చదివి, అమలు పెట్టండి.

శిశు సంరక్షణ కొరకై, విజయ స్ప్రే తయారీ దారులైన
ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య వారిచే విడుదల చేయబడినది.

జీవితం చేజారిందా

".. .. .." సీత చిరునవ్వుతో తల్లి అమాయకత్వానికి జాలి పడటం మినహా ఒక చిన్న శబ్దం కూడా ఆమె కంఠంలోంచి రాలేదు

సుభద్రమ్మ కన్నీరు తుడుచుకొని –

"ఒసేయ్ లక్ష్మి! గిరిజా! ఇప్పట్నుంచి అక్క ఏ చిన్న పని చెయ్యటానికి వీలులేదు. వీళ్ళ అత్తగారు ఏ క్షణంలో అయినా కారులో రావచ్చు. చూస్తే బాగుండదు. అయినా ఇన్నాళ్ళు అది చేసిన చాకరి చాలు. దానికి మంచినీళ్ళు కావల్సి వచ్చినా మీరే ఇయ్యాలి తెల్సిందా?" అంటూ మిగతా ఇద్దర్ని అదిలించింది సుభద్రమ్మ

అసలు లక్ష్మికి, గిరిజకి ఆ విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

సీత పెళ్ళి కుదిరిన దగ్గర్నుంచి ఆమెని ఎక్కువగా పని చెయ్యనియ్యకుండా అపురూపం చేస్తున్నారు.

ఇన్నాళ్ళూ తమతో పెరిగింది ఇరుగు పొరుగుల ఇంటికి కాలక్షేపానికి వెళ్ళటం కూడా సీతకి తెలియదు

ఎప్పుడూ యంత్రంలా ఇంటి పని చెయ్యటం, తీరిక చిక్కితే పుస్తకం చదువుకోవటం. ఇదే ఆమె హాబి.

అట్లాంటి ప్రియమైన అక్క ఇంకొక్క పది రోజుల్లో వెళ్ళిపోతుంది. ఎప్పుడో చుట్టపు చూపుగా.... అది పిలిస్తే వస్తుంది అనుకుంటే వాళ్ళకి గుండెల్లో ఒక విధమైన గుబులు, అశాంతి రేగుతోంది

'పోనీలే! అక్కది మంచి మనసు. అందుకే అదృష్టం కల్సి వచ్చి మంచి సంబంధం కుదిరింది ఇక ఏ లోటు వుండదు" మనసారా అక్క అదృష్టాన్ని అభినందించారు.

సీత కట్టుకున్న పట్టు చీరని, నెక్లెస్‌ని పదేపదే ముట్టుకుని నాణ్యత పరిశీలించారు. స్త్రీ సహజమైన చాపల్యంతో నెక్లెస్‌ని అంతా తలా ఒకసారి మెళ్ళో పెట్టుకుని అద్దంలో చూసుకుని తృప్తి పడ్డారు.

'ముందు అక్క ఇలాంటివి ఇంకా ఎన్ని పట్టు చీరలు – నగలు ధరిస్తుందో నని" అభినందించారు.

కాని –

సీత మనసుకి ఏ అభినందనలు అందటం లేదు.

బాహ్యంగా ఆమె ఆడంబరమే కనిపిస్తుంది.

కాని ఆమె హృదయంలో కదిలే నిర్వేదం ఎవరికి కనిపిస్తుంది?

"సీతగారూ! నేను మిమ్మల్ని మనసా – వాచా భార్యగా ఆదరించలేక పోవచ్చు. నిజానికి నాకు మళ్ళీ పెళ్ళి ఇష్టం లేదు. కాని నా పిల్లల కోసం....."

పెళ్ళిచూపుల నాడు గదిలో ప్రభాకర్ వేదనగా చెప్పిన ఆ మాటలే సీత గుండెల్లో ముల్లుల్లా అనుక్షణం కదులుతున్నాయ్.

అంతరాత్మ ప్రతిఘటిస్తూంది.

అయినా సీత అంగీకరించింది.

(అయ్యో! మరి ఆంధ్రదేశంలో ఆడపిల్ల!)

అతని నిజాయితీ అభినందించ తగ్గదే!

కాని –

తన వైపు నుంచి కొంచెం కూడా ఎందుకు ఆలోచించలేదు?

"పిల్లలకి తల్లి కావాలి. కాని భార్య అక్కర్లేదట! ....!"

"మరి .... అతడికి భార్య కాకుండా పిల్లలకి తల్లి కావటం ఎలా సాధ్యం?"


ఆప్యాయత తప్పించి అన్ని అమరుస్తాడట!


"ఉప్పు" లేకుండా విందు భోజనానికి పిలిచినట్టుంది అతని ప్రవర్తన.

ఛెళ్ళున చెంపపై కొట్టి కన్నీళ్ళు తుడిస్తే మాత్రం చెంప మండకుండా వుంటుందా?

"సంధ్యని తప్పించి వేరెవ్వరిని ప్రేమించలేడట! అతడి వల్ల భర్తగ సరిఅయిన న్యాయం జరగదుట. ఇష్టం లేకపోతే పెళ్ళి ఆపు చేయిస్తాడట!"

ఎంత నిజాయితీ! పాలు తాగిన పాము......





అవును మరి!

తాంబూలాలు పుచ్చుకునే దాకా వచ్చిన పెళ్ళి ఆగిపోతే అతనికేం నష్టం?

నిజమే!

ఆత్మాభిమానం వున్న ఏ ఆడపిల్ల అయినా అటువంటి పెళ్ళి ఆగిపోవాలనే కోరుకుంటుంది.

నీళ్ళు లేని బావి దాహం తీరుస్తుందా?

సీతని అనుక్షణం ఇవ్వే ఆలోచన్లు. అయినా అన్ని తెల్సి తల వంచింది. గుడ్డి కంటె మెల్ల నయం.

ఇంటిల్లిపాది ఆనందాన్ని నాశనం చెయ్యలేక గరళం మింగిన శంకరుడిలా మౌనం వహించింది.

మింగటానికి మెతుకు లేదు మీసాలకి సంపెంగ నూనె అన్నట్టు–

"పాతికేళ్ళు వస్తున్నాయి. ఇంకా పెళ్ళి కాలేదు." అంటూ ఇరుగుపొరుగు అమ్మలక్కల హేళనలు భరిస్తున్న పరిస్థితిలో ప్రేమ కోసంతపించడం ..... వాట్ పూలిష్?

"ఎవ్విరి వన్ థింక్స్ ఆఫ్ ఛేంజింగ్ ద వరల్డ్. బట్ నో వన్ థింక్స్ ఆఫ్ ఛేంజింగ్ హిమ్‌సెల్ఫ్" అంటాడు "లియోటాల్‌స్టాయ్."

కాని సీత అలా అనుకోలేదు! అందుకే ఆ పెళ్ళికి ఒప్పుకుంది"

* * * * *

నిర్ణయించిన ముహూర్తానికి సీత – ప్రభాకర్‌ల వివాహం నిరాడంబరంగా తిరుపతి కొండ మీద జరిగిపోయింది.

పదహారు రోజుల పండగ వెళ్ళగానే సీత అతి సామాన్యంగా అత్తవారింటికి వచ్చేసింది.

ఇంద్ర భవనం లాంటి అత్తింట కాలు పెడుతుంటే సీత గుండె చిత్రంగా స్పందించింది.

అస్తమానం పెళ్ళలు పెళ్ళలుగ చెదురాలే మట్టి మిద్దెలో కట్టెలతో వంట చెయ్యటమే తెల్సు సీతకి.

కాని ఇలా అందగాడు, ఐశ్వర్యవంతుడూ అయిన భర్తతో సినిమాసెట్టింగ్స్ లాంటి బంగళా.... ఎన్నడైనా వూహించుకుందా?

కొత్తగా కోడలు కాపురానికి వచ్చిందని వరలక్ష్మమ్మ స్వగ్రామం ఒదిలి కొడుకు దగ్గరే వుండిపోయింది. దగ్గరుండి సీతకి ఆ ఇంటి వ్యవహారాలన్ని ఆకళింపు చేసి పసివాళ్ళ బాధ్యత అప్పగించింది.

"ఇదిగో సీతా! ఈ పసిబిడ్డల రక్షణ ఈ క్షణం నుంచి నీది. ఈ పెళ్ళితో నీకు కొంచెం అన్యాయం జరిగిన మాట వాస్తవమే. అందులో కొంచెం నా బాధ్యత కూడా లేకపోలేదు. ముందు ముందు నీకు ఎప్పుడైనా కోపం వస్తే నన్ను తిట్టుకో. లేకపోతే నా కొడుకుని తిట్టుకో. అంతేగాని ఈ తల్లిలేని పిల్లల్ని మాత్రం కసురుకోకమ్మా సీతా! ఇప్పటికే వీళ్ళు బాగా బెంగటిల్లి పొయ్యారు " అంది కన్నీళ్ళతో వరలక్ష్మమ్మ.

కోడలు రెండు చేతులు పట్టుకుని పిల్లలిద్దర్ని ఒళ్ళో కూర్చోపెట్టింది.

అత్తగారు అలా మాట్లాడుతుంటే సీతకి మనసంతా చల్లగా అయ్యింది.

"అయ్యయ్యో! ఎంత మాటండి?" అంది ఖంగారు పడుతూ.

వరలక్ష్మమ్మ కొంగుతో కళ్ళు తుడుచుకొంది

ఆవిడ వదనం శ్రావణ మేఘంలా బరువుగా వుంది.

బాధతో బొంగురు పోయిన గొంతుతో అంది.

"నా బాధ నీకు తెలియదే తల్లి? భార్య పోయాక వీడి మొఖంలో నవ్వు నేను చూడలేదు. ఆ సంధ్య ఏం మంత్రం వేసిందో గాని చచ్చిపోయిన ఆమెతో డిదే జీవితం అంటున్నాడు. అది పోయాక వాడు విరాగి అయిపొయ్యాడు. ఇంక ఈ పిల్లలకి కూడా ఏదన్నా అయితే వాడు నీకు దక్కడు ... .

లేకలేక పుట్టిన ఒక్కగానొక్క కొడుకు కళ్ళల్లో ఒత్తులు వేసుకుని పెంచాను వాణ్ని. తీరా చేసి వాడు పిల్లా పాపలతో పచ్చగా బ్రతకాల్సిన తరుణంలో ఘోరం జరిగిపోయింది. వాణ్ని మళ్ళీ పెళ్ళికి ఒప్పించటానికి నా తల ప్రాణం తోకకి వచ్చింది.. .

రేపు ఏ చిన్న తేడా వచ్చినా వీడు నిన్ను అనడు తల్లి. సరాసరి నా దగ్గరకి వచ్చి యుద్ధం మొదలెడతాడు. వద్దంటే పెళ్ళి చేశానని నా గొంతు నొక్కుతాడు

.... అందుకే ఇంతగా చెప్తున్నాను. నీకు – నాకూ మాట రాకుండా చూసుకో.

సవతితల్లి నన్న చెడ్డ పేరు రాకుండా పిల్లల్ని కడుపులో పెట్టుకో! అటు పుట్టింటికి ఇటు అత్తింటికి వన్నె తీసుకురా.

..... నువ్వు చక్కగా మెసులుకుంటే నీ చెల్లెళ్ళకి కూడా ఎక్కడయినా మంచి సంబంధాలు వుంటే చూసి చెపుతాను. పాపం... మీ అమ్మ మరీ మరీ చెప్పింది... "

చెప్పటం ఆపి ఆవిడ వూపిరి తీసుకుంది. సీత నిశ్శబ్దంగా వుండిపోయింది.

ఆవిడ అమాయకత్వానికి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు

కాని ఒక్క మాటలో తేల్చాలంటే ఆవిడకి కొడుకు ప్రభాకర్ అంటే పంచప్రాణాలు అన్న సంగతి స్పష్టం అయ్యింది

కన్ను నొచ్చినా కాలు నొచ్చినా భార్య ఆసరా వుండాలని, ఇంట్లో దీపం వెలిగించే ఇల్లాలు ఎంతైనా అవసరం అని కొడుకుని మళ్ళీ పెళ్ళికి ఒప్పించింది.

అతనికి "భార్య" విలువ తెలియటం కోసమే ఆవిడ మనసు కట్టుకుని దూరంగా వుందని అర్థం చేసుకుంది సీత.

వరలక్ష్మమ్మకి కొడుకు ప్రభాకర్ సంతోషంగా వుంటే ఆనందం.

ప్రభాకర్‌కి తన పిల్లలు సంతోషంగా వుంటే ఆనందం.

తను ఈ ఇంట్లో సుఖపడితే తన తల్లి తండ్రులకి ఆనందం!

ఈ సృష్టిలో మనిషిని శాసించేది ఈ ప్రేమ తత్వమే

హృదయానికి ఈ ప్రేమించే తత్వమే లేకపోతే బ్రతుకులో ఇంత తీపి ఎక్కడిది?

(ఇంకా ఉంది)



జి వి. ఆర్. కాకినాడ

★ ఈ మధ్య బొంబాయి వెళ్ళినప్పుడు జీవనజ్యోతి హిందీ సినిమా చూశాను ఆ కథకి మీకు నంది అవార్డు కూడా లభించింది. హిందీ సినిమా టైటిల్స్‌లో మీ పేరు లేదు. గమనించారా?

● మరిచిపోయి వుంటారు! నేను చూడలేదు ఆ సినిమా

డి. ఎస్. శంఖవరం

★ నేను ఒక అమ్మాయిని ప్రేమించాను దేవదాసు పార్వతిలలా వుండేవాళ్లం కాలం మమ్మల్ని విడదీసింది

● కథ తెలిసిందే కదా! చివరి ఘట్టం దాకా జీవించక తప్పదు!

డి. వి. ఆర్. విజయవాడ

★ బాగుండని పాటలు చెప్పండి – మళ్ళీ రాయించి మళ్ళీ రికార్డు చేస్తామని ప్రకటనలు చేస్తున్నారేమిటి నిర్మాతలు?

● ఇంతకంటే ఎవరిచేత రాయించం? అని ముందే పాఠకులనడిగేస్తే చౌక అని తెలియక! ఇకపై స్మితలాంటి డ్రస్సు కావాలనుకుంటున్నారు? విలన్‌కి కామెడియన్‌కి ఏం వృత్తపదం పెట్టం? హీరో చెల్లెలుపై ఓ రేప్ వుంది అది గాంగ్ రేప్ చేస్తే మీ రభిమానిస్తారా? సింబాలిక్‌గా చూపిస్తే అభిమానిస్తారా? లాంటి ఎన్నో సమస్యలు నిర్మాతలు ప్రేక్షకాభిప్రాయ సేకరణవల్ల తెలుసుకోడానికి పద్ధతి నాంది అయి వుంటుంది. జనం ఎదురు చూసేది అందించడమే కదా వినోదం అంటే

సి. హెచ్. ఎన్. ఆర్. సత్తెనపల్లి

★ కొద్ది కాలంలో కంప్యూటర్ ద్వారా కథలు నవలలు రచింపబడతాయిని విన్నాను. అప్పుడు మీలాంటి రచయితల పని?

● అంబో!! (అనువదిస్తే గోవిందా!)

సి. ఎస్. ఎమ్. ?

★ అమ్మా! ధనవంతులకన్న పేదవారికి చదువు ఎక్కువ రావటం లేదెందుకు?

● డబ్బుంటే గ్రేడులు కొనుక్కోనేనావచ్చు లేకపోతే కష్టపడి చదవాలి. అది చేయకేమో ...

★ మనం అనుకున్నది జరగాలంటే 'ఏం చెయ్యాలి?

● అనుకున్నదాన్ని సాధించే దిశగా కృషి చెయ్యాలి.

★ మీకు ఎవరి మీద దయ కలుగుతుంది? ఎవరి మీద అసహ్యం కలుగుతుంది?

● నన్ను తిట్టుకొనే వారిని చూసి జాలి కలుగుతుంది గాని దయకలుగదు. తిట్లు నన్నేమి చేయవు కనుక. ఇక అసహ్యం అంటారా నాకు ఫడని చాలా రకాలవారు వున్నారు. మనిషి ముందొక మాట, వెనక ఒక మాట ఆడేవాళ్ళు, అన్నది అనలేదని బుకాయించే వాళ్ళు చాలా ...

ఆర్. ఎస్. డి. విశాఖపట్నం

★ ఈ రోజుల్లో ఎవర్ని నమ్మాలన్నా భయంగా వుంది.

● నిజమే. కాని చాప కింద నీరులాంటి తీయని మోసగాళ్ల కంటే - పబ్లిక్‌గా శత్రువైన వారిని నమ్మడంలో సేఫ్టీ వుంది!

ఎన్. ఎం. నందికొట్కూరు

★ ప్రపంచంలో మానవునికి మరణము అనివార్యం అని తెలిసి జీవితంమీద ఎంతో ఆశతో బ్రతుకుతాడు ..

● అసహ్యించుకుంటూ యీ జీవితం సాగించడం చాలా కష్టమయ్యా అందుకే ఆశ పెంచుకొంటూ బ్రతుకుతాడు ... చావు పుట్టుకల మధ్యకాలం ఖాళీగా వుంచడం దుర్లభం

డి. పి. పి. కాకినాడ

★ నేనొక వ్యక్తిని విపరీతంగా అభిమానించాను తరువాత ఆరాధించాను. ప్రస్తుతం ప్రేమిస్తున్నాను. నేనంటే అతనికిష్టమని తెలుసు. కాని పెళ్ళికి యిష్టమో కాదో తెలియదు. ఏం చెయ్యాలి?

● కావ్యాల్లో యిలాంటి అవస్థ వస్తే చేటికలు వుండేవారు రాయబారాలు చేయడానికి. దూతికలు వుండేవారు -సందేశాలు మోయడానికి. కాలం మారింది -కాగితంపై రాస్తే పీక్కి చుట్టుకోవచ్చు -ప్రేమలేఖలతో బ్లాక్‌మెయిల్ చేయడం సినిమాలు చూసి చూసి - సులువైపోయింది. అంచేత ఓ మంచి రోజు చూసి సూటిగా అడిగేస్తే - యిట్టే తేలిపోతుంది నీ సమస్య. ఇలాంటి స్వంత విషయాలు స్వంతంగా చేసుకుంటే - సుఖం.

విజయ, పద్మ, రాజమండ్రి

★ మీ కాలానికి వంతెన చాలా బాగుంటూంది.

● థ్యాంక్యూ.

రాజు, నారాయణపేట.

★ అరుద్ర లక్ష్మిగారు మీరు సినిమాలో నటిస్తే చూడాలని వుంది. కోరిక తీరుతుందా?

● తుంది – ధైర్యంచేసి ఏ దాసరిగారో వేషం యివ్వడానికి తెగిస్తే! కొత్తవారిని నిర్భయంగా పరిచయం చేయకల్గిన చేవకల వ్యక్తి అయిన. (ఇది చదవకుండా వుంటారా?)

డి. వి. ఆర్. కొత్తపల్లి


★ స్త్రీలంటే నాకు గౌరవం. అభిమానం స్త్రీలు ఎదురైతే తలవంచుకుని పక్కకు తొలగి వెళ్ళిపోతాను. కొందరు నన్ను మెచ్చుకుంటున్నారు. కొందరు యింకోలా అనుకుంటున్నారు. ఎలా?


● మరి ఏ యుగం వాడివయ్యా – యింతలోకం తెలియకుండా వున్నావు? చూడదగ్గప్పుడు చూచుట. లేకున్న తలవంచుకుని పోవుట అలవాటు చేసుకో. చూసినప్పుడు ఎదుటివారి ముఖమే చెప్తుంది వారి అభిప్రాయం. అలా నేల చూపులు మరీ అపార్థాలకి దారితీస్తాయి!

ఎ. యి. ఆర్. బికబళాపూరు

★ పులిని భయపెట్టే మగాడు పెళ్లానికి భయపడతాడెందుకు?

● పులిని చంపొచ్చు – ధైర్యంచేసి. పెళ్లాన్ని భరించాలి. □





ఈసారి మీ కుటుంబానికి సన్‌ఫ్లవర్ రక్షణ కవచంతో భద్రత నివ్వండి.



సన్‌ఫ్లవర్ ఎకానమీ ప్యాక్. విడి వనస్పతి కంటే కొద్ది పైసల ఎక్కువ ధరకే శుద్ధమైనది.

WPL/25 35

మీ కుటుంబానికి అత్యంత సురక్షితమైనదీ, భద్రమైనదీ ఇవ్వండి: సన్‌ఫ్లవర్ బ్రాండ్ వనస్పతి. సన్‌ఫ్లవర్ రక్షణ కవచంతో ప్యాక్ చేయబడి, సీలు చేయబడినది, విటమిన్ ఎ,డి చేరిన పరిశుద్ధమైన పుష్టికరమైన వనస్పతిని మీ కందించే నిమిత్తం ఇలా చేయబడింది.

IS:10633
VANASPATI



సన్‌ఫ్లవర్ బ్రాండ్ వనస్పతి

మంచి నెయ్యి మాత్రమే దీన్ని మించగలది.

1కిలో, ½కిలో ప్యాక్‌లలో లభ్యం.

WIPRO LTD – *Closer to the consumer*

పెద్దకథ

బానిస బ్రతుకులు

బలివాడ కాంతారావు

(గత సంచిక తరువాయి)

ఒక్కొక్కరోజూ గడుస్తుంటే పావనిలో పంతం పెరుగుతూ వస్తోంది. అడుక్కున్న వాడిలా వచ్చిన వాడికి మళ్ళీ అడుకున్నవాడిలా మార్చితే గానీ మళ్ళీ దాసోహం అనడని స్పష్టమైంది. చేతిలో డబ్బు లేకపోతేనే ఇతగాడి ఆటకట్టు.

ఆ ముండ యెవర్తో అది అప్పుడు చేరనివ్వదు. ఇతగాడి ఉద్యోగం వూడితే? ఎలా వూడుతుంది? రూల్సు ప్రకారం కుటుంబాన్ని అఖ్ఖర చెయ్యని వాడిమీద యేక్షను తీసుకోవచ్చుట! దానికి ఆమె ఒక అర్జీ దాఖలు చేయాలి. అంతవరకూ పోకండా అతగాడు యెన్నాళ్ళు సిక్ లీవ్ అని పెట్టగలడు? అప్పుడే నెల కావస్తోంది కదా! ఇంకా సిక్‌లో వుంటే, అతను సిక్‌లో లేడు. అతనికి యే జబ్బూ గిబ్బూ లేదు. తాగి బజారు ముండలతో తిరుగుతున్నాడని ఆ యజమానితో చెప్పితే పిలిపించి యింకో డాక్టరుచేత పరీక్ష చేయిస్తే బండారం బయట పడుతుందనుకుంది.

ఆ రోజే ఆఫీసుకు వెళ్తే గోపాలం డ్యూటీలోనే వున్నాడు. బయటకు పనిమీద యేవో వస్తువులు కొనుగోలుకు పంపించారట. పెర్సనెల్ మేనేజరుని కుల్సుకుని యెంత కసితో చెప్పాలో అంతా చెప్పి.

"ఈ ఆటలన్నీ కట్టాలంటే నా ఒక్క కోరికని మన్నించండి"

"ఏంటి ఆ కోరిక?"

"అతని చేతికి జీతంతో సహా ఒక్క పైసా వెళ్ళకండా చూడండి."

"అది చాలా పెద్ద కోరిక. నెలంతా పని చేసి జీతం అతనిచేత పెట్టకపోతే చట్టరీత్యా నేను దోషినవుతాను. మాచేత నైంది ఒక్కటే. మీ దగ్గరనించి కుటుంబాన్ని చూడటం లేదని రాత మూలకంగా వస్తే మేం అతన్ని పిలిచి చెప్పగలం. సరియైన సంజాయిషీ లేకపోతే అతనిమీద క్రమశిక్షణ చర్య తీసుకోగలం."

"ఇవన్నీ చేసేసరికి నెలలు గడిచిపోతాయి. డబ్బు పాడు చేసుకుంటాడు. మనిషి చిక్కిపోతాడు."

"మీ రింత చెప్తున్నారు. మా కెవరికీ నమ్మశక్యం కాకండా వుంది. ఈమధ్య గోపాలం యెంత యేక్టివ్‌గా వున్నాడో చూసాక మాకే ఆశ్చర్యంగా వుంది. అందుకే పర్చేజ్ సెక్షనులో పెట్టాం."

"డబ్బుతో పని జాగ్రత్త...."

"అతను కక్కుర్తి మనిషి కాడండీ."

"ఇంట్లో పెళ్ళాం పిల్లలుండగా బజారు ముండతో తిరగటం కక్కుర్తి కాదూ? ఇంట్లో కాఫీ, టీ లుండగా వీధిలో తాగి కాలవలంట దొర్లటం నిజాయితీకి కొలబద్దా? మీరంతా అతగాడి పక్షం చేరి మాటాడుతున్నారు గానీ..... అతని కట్టుకున్న భార్య గోడు మీకు వినిపిస్తుందా?" కాస్త తెములుకుని—

"మీతో చెప్పి లాభం లేదు. పెద్దని ఒకసారి చూడనివ్వండి." అనగానే పర్సనెల్ మేనేజరు యింటర్‌కామ్‌లో పెద్దతో చెప్పగా పావనిని తీసుక రమ్మన్నాడు. ముందుగా అతను పెద్దతో వివరంగా యీ కేసు విషయం చెప్పాక, ఆమెను లోనికి రానిచ్చారు. యెదురుగా కూర్చో పెట్టి అతను నెమ్మదిగా—

"మీ కేసు అంతా తెలుసుకున్నాను. మీ బాధ నాకు అర్థం అయ్యింది. మీకు యెలానైనా సహాయం చెయ్యాలని వుంది. అయితే భార్యా భర్తలకున్న సంబంధాలులానే యజమానికి వుద్యోగికి మధ్య కొన్ని సంబంధాలుంటాయి. మీరు భార్యా భర్తలుగా కొన్ని నియమాలు పాటించినట్లే మేం కూడా పాటిస్తాం. మీ ప్రధానమైన కోర్కె అతనికి డబ్బు అందకుండా చూడటం కదా?"

"అవునండి. డబ్బు చేత లేకపోతే గానీ భార్యాబిడ్డలు గుర్తుకు రారు.."

"ఈ వచ్చే జీతాల రోజున మీరు వచ్చేవరకు గోపాలంకు జీతం యివ్వను. మీరు వచ్చాక యిద్దరూ ముఖాముఖీ మా పెర్సనల్ మేనేజరు యెదరగా మాటాడి యిద్దరికీ సమ్మతమైన ఒక నిర్ణయం తీసుకుందురు గాని..... ఆ వేళ వచ్చే ముందు ఒకసారి మా పెర్సనల్ మేనేజరుగారికి ఫోను చేసి మరీ రండి."

పెర్సనల్ మేనేజరు ప్రవర్తనకు యితని ప్రవర్తనకు తేడాను చవి చూసిన పావని యింటికి వచ్చాక తండ్రితో జరిగింది చెప్తూ, "నా వయసును దాటి నేను యంగ్‌గా కనిపిస్తుంటే, ఆ పెర్సనల్ మేనేజరు వయసుకు మించి ఓల్డ్‌గా కనిపిస్తున్నాడు. అలా మ్రింగేసినట్లు నా వేపు చూస్తున్నాడు.

ఒక్క మాటకు ఔననలేదు. వాడే ఆఫీసును వుద్ధరించేస్తున్నట్లు. వీడి పోజులు మండ అని పెద్ద దగ్గిరికెళ్తే.... వయసుకు చిన్న వాడైనా యెదుటి వాళ్ళను అర్థం చేసుకోవడంలో పెద్దవాడే..... ఈ జీతాల రోజున యేదో తేల్చేస్తానన్నాడు."

"సంతోషం" అన్నాడు తండ్రి.

* * * * *

"రెండు వారాల క్రితం తెగ తాగేసి తూలుతూ వెళ్ళాడని" పావనితో బార్ వాడు చెప్పాడు కదా! ఆ రోజున ఆ రాత్రి మీద తెగ తాగిన గోపాలం నడుస్తూనే చావుల మదుం దాటి స్మశానానికి పోయే దారి తప్పి ఉత్తరానికి కదిలి యెత్తైన రైలు మార్గం పక్కన వున్న పుచ్చుల దొడ్డిలో కూలబడి పోయాడు.

ఆ రాత్రంతా ఓవర్‌టైం వుంది రానని యింట్లో చెప్పాడు కాబట్టి అధిక జీతం వస్తుందని పావని సంతోషంతో సరే నంది. అబద్ధం అది యిలా తాగడానికి కారణం ముందు రాత్రి జరిగిన సంఘటన. అది భార్యా భర్తల మధ్యనే జరిగింది. వయసొచ్చిన దగ్గరనించి మనసులో మన్మథుడు కావాలని కోరుకునే ఆడవాళ్ళు, రతీదేవి కావాలని కోరుకునే మగవాళ్ళు - ఆ కోరికతో పాటు మరికొన్ని జతపడని కోరికలు, కూడా కోరుకుంటారు. నెమ్మదైన మొగుడిలో భీమబలుడు వుండటం, నవ మన్మథుడుండటం అరుదే.

మనసులో కోరుకున్న దొకటి దొరికిన దింకొకటి అయ్యేటప్పుడు ఆ దొరికే వస్తువుమీద ఒక విధమైన యేహ్యాభావం యెంత కాదనుకున్నా మనసులో మానని గాయంలా వుంటుంది. దరి చేరడానికి వెళ్తే ఖస్సు బుస్సున్న పెళ్ళం వైఖరికి ఆ రాత్రంతా గోపాలం నిద్దర పోలేదు. ఆ మరుచటిరోజు రాత్రి పెళ్ళం యెత్తి పొడుపులతో ఆత్మహత్య తప్పించుకోడానికి తప్ప తాగేసాడు.

తాగి ఒంటిమీద తెలివి లేకపోయినా యీ మారు మూల వుచ్చ కంపునించి అమరగానం వుండి వుండి వినిపిస్తున్నాడు. నారాయణమ్మ చెవిలో ఆ కూనిరాగం పడి దగ్గిరగా వెళ్ళింది. వాడి చేతిలో రిష్టు వాచీ వుంది. అదిమి పట్టి పైకి లేవనెత్తింది. లేచాడు గానీ జూగిపడిపోతున్నాడు. చెయ్యి పట్టుకుని మెల్లగా నడిపించి ఆ పక్కనే వున్న గుట్టమీద తాటాకుల కొంపలోనికి తీసుక వెళ్ళింది. ఇద్దరే తలదాచుకోడానికి సరిపడే కొంపది.

అర్ధ రాత్రి దాటిపోయింది. అప్పుడప్పుడు కదిలే లారీల శబ్దం. దక్షిణ దిశ నించి వుప్పుటేరు దుర్గంధం. పడమటనున్న శ్మశానంనించి కట్టెలు కాలి వదిలిన చమురు కంపు నలు దిశలా వ్యాపించిన మెర్క్యురీ లైట్ల వెలుతురు విడి విడిగానున్న తాటాకుల కప్పులోనించి లోనకు పడుతోంది. గోపాలంకి తెలివి వచ్చేసరికి నేలమీద చింకి తాటాకుల చాపకు చెయ్యి తగిలింది గానీ పక్కనే తగిలి అదిమి పట్టి నారాయణమ్మ పడుకుంది.

యవ్వనం వచ్చాక యేది నిత్యం కోరుకున్నాడో, అదే యా వయసులో తొలిసారి ప్రాప్తించినట్లనిపించింది. మిడిసిపడుతూ మేలు కళ్లతో చూసి, మిదపడి మృదువైన శరీరాన్నంతా అమె వప్పచెప్పగానే గోపాలంలో తొలిసారి కామోద్రేకం అంటే చవి చూశాడు. ఆ క్షణంలో తన మగసిరిపై విశ్వాసం ఏర్పడింది. నారాయణమ్మను ఎవ్వరు నివ్వని అడగలేదు. ఎక్కడున్నావని అనుకోలేదు. ఆ రాత్రంతా నిద్రపోలేదు. మళ్లీ మళ్లీ యీ శుభ ఘడియలు యీ అవకాశం దొరకదేమోనన్న శంకతో నారాయణమ్మనలా నగ్న సుందరిగా వుంచేశాడు. కాలం యిలా తనకోసం ఆగిపోదన్నట్లు తూరుపున తెలతెలవారే చిహ్నాలు కనిపించాయి.

అవేశం తగ్గాక చేతిలో రిష్టువాచీ చూసి అడిగాడు అలా ఆమెను పట్టుకునే.

"నీ పేరు"

"నారాయణమ్మ"

"నేనిక్కడికెలా వచ్చాను?"

"ఆ వుచ్చుల దొడ్డిలో జారిపోయావు. తెచ్చి బాధలో వున్నావని పక్కనేసుకున్నాను."

ఇంకా అతనిలో మమకారం హెచ్చినట్లుంది. ఆమె గత చరిత్ర అంతా తెలిసి పోయినట్లుంది. అందుకే.

"నేనంటే యిష్టమేనా?" అన్నాడు.

"ఇష్టమే"

"ఎందుకు?"

"నీవుబాగా పాడతావు"

"పాటలంటే నీ కిష్టమా?"

"మా నాయన మా వూర్లో కీర్తనలు పాడేవాడు."

"నీవు నేర్చావా? ఏది మెల్లగా...."

"గరుడ గమన రారా– నను నీ కరుణ నేలుకోరా!" అంది చిన్న కూని రాగంతో.

"నిన్ను ఏలుకుంటాను" నీ కిష్టమేనా?"

"రెండింటికి ఒప్పుకుంటే"

"ఆ షరతులేమిటో చెప్పు"

"నా పాతబతుకు గురించి అడక్కు. నీ బతుకు గురించి నే నడగను."

"సరే ఒప్పుకున్నాను. ఇంకో షరతేమిటి?"

"నీవు తాగితే నాకిష్టం వుండదు"

"తప్పా?

"నీ కూడుతిని నీ కళ్ళు కప్పను. తాగినోళ్లకి మాట విలకద వుండదు. తాగితే నీతి తప్పానని నిందలేస్తావు" "సరే. రెండు షరతులకూ ఒప్పుకున్నాను."

ఇంటికి పొద్దున్నే వెళ్లిపోయాడు. ఆ రాత్రి యేడు గంటలకే నారాయణమ్మ దగ్గరకు వచ్చేసాడు. సబ్బుతో ఒళ్లంతా రుద్దుకుని సన్నని చీర సర్దుకుని మరీ వేచివుంది. నలుపైనా నిగనిగ మెరుస్తోంది. ముఖాన యెర్రని కుంకుమబొట్టు దిద్ది మరీ పెట్టింది. గోపాలంని చూడగానే చంగునలేచి కులుకుతూ పొంగి వలపుబాటలో నడిచింది. మూడు రాత్రుళ్లు ఓవర్‌టైంమని అబద్ధాలాడి జీవితంలో తొలిసారి మూడు రాత్రులను గడిపిన మహదానందంతో ప్రోవిడెంట్‌ఫండ్‌లో మూడువేలు అప్పుపెట్టాడు. ఆ డబ్బు అందుకున్న వెంటనే యిలానూ యీ జాగా బాగులేదు. బటారు బయలుగా వుంది. ఏ క్షణాన మ్యునిసిపాల్టీ వాళ్ళు పీకేస్తారో? అప్పుడే ఆ పాకల వాళ్లకి రెండుసార్లు బెదరించారని. నారాయణమ్మ వుండటానికి ఒక మంచి పాక వెయ్యాలని నిర్ణయించుకున్నాడు. ఒక బంజరులో జాగా ఆక్రమించి పాకవేశారు. అందులో చిన్న మంచం, పరుపు ఆమె సొగసు చూసుకోడానికి ఒక సెకండ్‌హేండ్ నిలువుటద్దం, నాలుగు చీరలు యిలా ఆ డబ్బు ఖర్చు పెట్టగా మిగిలినది నారాయణమ్మచేత యిల్లు గడపటానికి పెట్టాడు. ఇవన్నీ జరిగిన మరునాడే యింట్లో మామగారు తగవుపెట్టడం గోపాలం మూడోసారి యిల్లు వదలటం జరిగింది.

★ ★ ★ ★

జీతాల రోజు. పావని ఫోనుచేసి మరీ వచ్చింది. అప్పటికే వూర్లో చుట్టాలలోనూ, ఆఫీసులో పనివాళ్లలోనూ యీ మొగుడూ పెళ్లాల తగవు చిలవయి పలవలు చేసుకుని ఒక నోటినించి యింకో నోటికి మార్పులతోనూ చేర్పులతోనూ చక్కని కథలై నడుస్తున్నాయి.

అప్పటికే లోకం తెలుసుకున్నది. అనుకున్న దేమిటంటే...

"అంత బాగా పాడే గోపాలం గొంతులో అపస్వరంలా బజారుముండ యెవరో పలుకు తోందట! అట యేమిట? దానితో సినిమాలకే తిరుగుతోంటే."

"గోపాలం యెప్పుడూ లిమ్కాయైనా తాగే వాడు కాదే. అలాంటిది కాక్‌టెయిల్లోనికి దిగాడంటే యేదో గొప్ప సెట్‌బేక్ వచ్చి వుంటుంది..."

"ఆ మధ్య వీర్యవృద్ధికి ఆయుర్వేద లేహ్యాలు తిన్నాడట. ఇంజక్షన్లేవో తీసుకున్నాడట. ఈ ముండ దగ్గరికి చేరడానికేనా?"

"పెళ్లయి యిద్దరి పిల్లల తండ్రయి అంత మంచివాడని పేరు సంపాదించుకున్నవాడికి నాలుగు పదులు దాటేక యీ వూబిలో యెందుకు కూరుకు పోయాడో ?"



ఒకడు మెల్లగా అనేసాడు "పెళ్ళాన్నిగాని అనుమానించాడా?"

పెళ్ళాం అంటే గోపాలానికి హడలుకదా.. అనుమానించడం ఒకటా? వెర్రిగా వాగితే నాలిక కోసేస్తుంది. తను చెప్పినట్లు గానుగెద్దులా తిరగకపోతే కొరడాతో చెమ్డాలూడదీస్తుంది."

చుట్టూ వున్నవాళ్ళు యిలా చిత్రంగా చిత్రాలు రాసుకుంటుంటే, నీడల్లా యీ భార్యా భర్తలు జీవితాలనాడు ఆఫీసు యజమాని గదిలోనికి వచ్చారు. ఈ నీడలకు నోళ్ళున్నయి. గోతులైన మనసుల్లో మురికినీరు చేరేవుంది. ఒకరివేపు ఒకరు చూసుకోకుండానే వాదనలు జరుగుతున్నాయి

"మిస్టర్ గోపాలం. నీ ప్రవర్తన యింతగా దిగజారిందే?"

జవాబుగా వచ్చిన గోపాలం చిన్న నవ్వును చూసి

"నేను చాలా ముఖ్య విషయం యెత్తితే అలా నవ్వుతా వెందుకు?"

"ఏడవమంటారా?"

"ఆ జవాబు బట్టే ఆలోచించండి" అంది పావని.

"ఎందుకిలా చేసావ్?"

"ఎలా?"

"తాగుతున్నావట. ఎవరితో బజారుముండతో తిరుగుతున్నావట?"

"ఎవరు చెప్పారు?"

"ఎవరు చెప్పారో నేను నీతో విన్నవించుకో అఖ్ఖర్లేదు. గానీ ఆఫీసు పెద్దగా యిదే నిజమైతే నిన్ను సరియైనదారిలో పెట్టకూడదా?

"అయితే వినండి మీరన్న ఆటలన్ని అబద్ధం ఇప్పుడు నేను నడుస్తున్న దారి సరైనదని నా విశ్వాసం."

"అయితే యింటికెందుకు వెళ్లటంలేదు? జీతం యెందుకివ్వటంలేదు?"

"ఇప్పటి వరకూ నాకో యిల్లులేదు."

"ఇన్నాళ్ళూ ఎక్కడున్నావ్?"

"అది మా మామగారిల్లు"

"అక్కడ నీ కుటుంబం వుందికదా. వాళ్ళని పోషించే బాధ్యత నీకులేదా?"

"నా కుటుంబాన్ని పోషించే బాధ్యత నాకువుంది."

"అంచేత నీ జీతం తీసుకోడానికి నీ భార్య వచ్చింది"

"నా జీతం నేను ఆర్జించాను. మీరు దయచేసి యింకొకరికి దానం చెయకండి"

"దానం" యీసడించింది పావని.

"నా యిష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టుకుంటాను"

"ఇష్టం... ఏమండి. మీ పుణ్యం వుంటుంది. ఇదేదో సెటిల్ అయ్యేవరకు... అతని చేతికి డబ్బురాకుండా చూడండి. ఆటకట్టేస్తుంది." అని పావని యజమానికి బ్రతిమాలి ధోరణిలో అంటే

"నా జీతం ముట్టుకోడానికి యెవరికీ అధికారంలేదు. ఈ వేళ నేను డ్యూటీకి వచ్చాను. నేను సంతకంపెట్టి నా జీతం తీసుకుంటాను."

"ఎవరెలా యిస్తారో నే చూస్తానని" పావని సవాలు చెయ్యగానే "ఇవ్వనని అనమను"

బానిస బ్రతుకులు

"అనండి" అని యజమానివేపు తిరిగితే అతను మాటాడకుండా యిరువురివేపు అలా చూస్తున్నాడు.

"మాటాడరేం?" అని రెట్టించింది పావని

"ఏం మ్లాటాడతాను? జీతం అతనికివ్వననడానికి నాకు అధికారంలేదు. ఏమయ్యా? గోపాలం. ఏ కుటుంబంలోనైనా యేవో చిన్న తగవులొస్తుంటాయి. సర్దుకపోకపోతే కటుంబ గౌరవం మంట గలవదా? ఆవిడ బయటకు అలా ధైర్యంగా మాటాడుతున్నా లోపల యెంతగా కుమిలిపోతోందో? రేపొద్దు ఫలానావాడి బిడ్డ అని చెప్పుకుంటేగానీ పెళ్లిళ్ళు పేరంటాలు అన్నీ జరగాలి కదా! ఇప్పటికే ఒక గౌరవమైన కటుంబం మర్యాద వీధిలో పడింది. నేను బయటకు వెళ్తాను ఇద్దరూ కాస్సేపు మాటాడుకుని ఒక నిర్ణయానికి రండి" అంటూ లేచిపోతుంటే గోపాలం కూడా లేచిపోతూ,

"వద్దు మీరు లేవకండి. ఇందులో నిర్ణయానికి యిదేం పెద్ద సమస్య కాదు ఇన్నాళ్లకి నాకొయిల్లు నా యిల్లు కాదు, అది నా అత్తవారిల్లు అనిపించింది. అత్తవారింట్లో అల్లుడు వుండటం అనర్థమని బయలుకొచ్చేసాను. పరిస్థితు లలా వచ్చాయి నా భార్యా బిడ్డలను ఆదుకొనని నేనెప్పుడూ అనలేదు. వాళ్లు నేను తీసుకునే అద్దె యింట్లోకి వచ్చి వుంటానంటే నాకేం అభ్యంతరం లేదు. నా తాహతుకు తగ్గట్లు వాళ్లను సుఖంగా వుంచడానికి ప్రయత్నిస్తాను."

"మా నాన్న రెండంతస్తుల మేడలో చిన్నప్పటి నించి పెరిగాను. నా తమ్ముడు ఫైదేశం నించి నెలకు పదిహేను వేలు పంపిస్తున్నాడు నా పిల్లల చదువులు కాన్వెంటులో చదువు తున్నారు. అవన్నీ వదులుకుని యితగాడి పాకలో వుండె ఖర్మ నాకేం వచ్చింది?"

"అయితే నెల కంత కుటుంబానికని" యజమాని అంటుంటే;

"నాకి బిక్ష అఖ్ఖర్లేదు. ఇలాంటి వాళ్లని నలుగుర్ని పోషించ గలం!"

"మరి జీతం ఆపడం దేనికి?" అన్నాడు యజమాని.

"ఈ జీతం యెలా ఖర్చు పెడుతున్నాడో ఆలోచించండి!"

"గోపాలం కుటుంబాన్ని పోషించనని అనలేదు కదా! మీ యిద్దరూ యేదో పంతంలో చిక్కుకున్నట్లుంది. ఇది న్యాయస్థానం కాదు. మాకు దండనాధికారాలు లేవు. ఇది సివిల్ కేసులా వుంది. నేనేం చెయ్యలేను." అనేసాడు యజమాని.

గోపాలం ముందు కదలి పోయాడు. తరువాత పావని చర్రున లేచి వెళ్లిపోయింది.

★ ★ ★ ★

పెంపుడు కుక్క యింట్లో నించి పారిపోయి యింకో యజమానిపై విశ్వాసం పెంచుకున్నట్లు అనిపించింది పావనికి. కరువుగా మాటాడే మొగుడు యిప్పుడు మాటలతో రంపంకోత నేర్చుకున్నాడెలా? సహవాస దోషంతో చెప్పులూ రాళ్ళూ విసిరే కొంటె కుర్రానిలా మొగుడు యజమాని యెదరగా కనిపించాడు ఈ బొంకు రంకు వ్యాపారం యెన్నాళ్ళు సాగుతుందో నేనూ చూస్తానని భీష్మించు కుంది. మేక ప్రసంగం చేస్తున్నాడు గుడిసెను మేడ చేద్దామని తాపత్రయ పడుతున్నాడు. గుడ్డిగా ఒక పులి బోనులో దూరిన యీ మేకపోతు గాంభీర్యంతో యేం సాధిస్తాడో నేనూ చూస్తానని పంతం పట్టింది.

ఇలా రోజుకి రోజూ హెచ్చుతున్న పంతం పచ్చిగోడై తనమీదే పడినట్లుంది. తన వాగుడు తన పనికి, తన నిద్రకే చేటు చేస్తున్నాయ్. ఈ ధీరురాలు మగని దండించడానికి యే దండం దొరక్క దీనురాలై పోయి, యేం చెయ్యడానికి పాలుపోని సమయంలో తన తమ్ముడు వాసు చెప్పకా చెయ్యకా వచ్చేడు.

"ఏంట్రా వుత్తరమైనా రాయకుండా వచ్చేసావ్?" అని తండ్రి అంటే, "మీ అందరికి సర్‌ప్రైజ్ యిద్దామని!"

"నేను రాసిన వుత్తరాలన్ని చేరాయను కుంటాను."

"ఫోటోలతో సహా చేరాయి!"

"ఏ అమ్మాయైనా నచ్చిందా?"

"తరువాత అవన్నీ మాటాడుకుందాం! మేష్టారు బాగున్నారా?"

"మేష్టారు మాటకేం గాని... ముందు స్నానం చెయ్యి. ఎప్పుడు తిన్నావో యేమిటో?" అంది పావని.

స్నానం అయ్యాక బట్టలు మార్చుకుని,

"ఈ రెండు చీరలు నీకు. ఈ డ్రెస్ బాబిగాడికి. ఈ మిడ్డీ బేబికి. . మరి యీ డ్రెస్ మేష్టారికి!"

అన్నీ పుచ్చుకున్న పావని మేష్టారి డ్రెస్ పుచ్చుకోలేదు.

'ఏం?'

'ఎక్కడున్నాడో వెతికి నివ్వే వెళ్లి యియ్యి." అంది, పావని.

"ఏమైంది?"

"ఏం చెప్పానురా... సిగ్గుతో వీధిలోనికి వెళ్లటం మానేసాను' అన్నాడు తండ్రి సదాశివరావు

"మళ్ళీ అలక సాగించారా?"

"అలకా ఈ సారి అలక కాదు బంధాలన్నీ తెంపేసుకుని ఒక బజారు ముండతో యెక్కడో వున్నాడు."

"ఈ వూర్లోనేనా?"

"హాఁ! ఆఫీసు కెళ్తున్నాడు. జీతం దాని ఒడిలో పోస్తున్నాడు."

"మేష్టారు ఎందుకు యిలా చేసారో కారణం తెలుసుకున్నారా?"

"పోయేకాలం!" అని తండ్రి తేల్చేగానే,

"ఎన్నాళ్ళైంది వెళ్లిపోయి?"

"రెండు నెలలు దాటి పోయింది!"

"ఇంత జరిగినా నాకెందుకు రాయలేదూ?"

"నేను రాస్తానంటే, నాన్నే వద్దన్నారు!" అంది

పావని

"ఎందుకు రాయలేదండి?"

"అక్కడ ఒక్కడివి వున్నావు నివ్వూ బాధపడటం దేనికని?"

"అసలు కారణం యేమిటో తెలుసుకోడానికి ప్రయత్నించారా?"

"అప్పుడప్పుడు తాగుతున్నాడని తెలిసి డబ్బుంటే పాడు చేస్తాడని మూడు వేలు ప్రావిడెంట్ ఫండ్‌లోను గురించి అడిగాను ఆ మరుచటి రోజే వెళ్ళి పోయాడు "

"డబ్బు గురించే యిలా చేసాడంటే నమ్మలేను!"

"ఆ డబ్బు చూసుకునే యింతపనీ చేసాడు కదా మీ మేష్టారు" అంది పావని.

"డబ్బు వాడికి చేరకుండా చేద్దామని పావని వాడి ఆఫీసుకు వెళ్ళి ప్రయత్నించింది. లాభం లేకపోయింది "

"డబ్బు కారణం అయ్యి వుండదు మనం లక్ష్మి అని కొలుస్తాం గానీ.... పెట్రోలులా నిముషంలో డబ్బు అంటుకపోతుంది ఇంత సాహసం చేసారంటే చాలా బలమైన కారణం వుండాలి."

"ఇంత చెడ్డ రోజులు నా జీవితంలో కలలో నైనా చూడలేదురా! బయటకు వెళ్ల లేను. వచ్చావు కదా! కొనాళ్ళుంటావు కదా.. . ప్రయత్నించు" అన్నాడు తండ్రి.

మరుచటి రోజు వుదయమే ఆఫీసు గేటు దగ్గర కాసాడు వాసు గోపాలం "మేష్టారూ!' అన్న కేక వినగానే ఒక్కసారి అదిరిపడి చూసాడు.

"ఏమిటయ్యా ఎప్పుడొచ్చావు?"

"నిన్న .. "

"ఎన్నాళ్ళు శెలవు?"

" నా శలవు మాటకేం గానీ ... ఈ వేళకి మీరు శలవు పెట్టకూడదూ! ఇద్దరం అలా సరదాగా తిరుగుదాం. మీ పాటలు విని యెన్నాళ్ళయి పోయిందో అనిపిస్తోంది వాచిపోయా ననుకోండి!"

"తప్పదా?"

"కొత్తగా అడుగు తున్నారు. ఇదివర కెప్పుడూ నా విషయంలో మీరు సంశయించలేదే?"

"అయితే యిక్కడే వుండు లోపలకు వెళ్ళి శలవు చీటి పెట్టి వస్తాను" అని లోపలికి వెళ్ళాడు. ఒక అరగంట తరవాత బయటకు వచ్చి,

"ఈ వేళ చెయ్యవలసిన పని యింకొకరికి అప్పజెప్పడంలో ఆలస్య మైంది చెప్పు యెక్కడికి వెళ్దాం?"

'ఎక్కడికి వెళ్దాం? ఎక్కడిక్కివెళ్తే మనం హాయిగా మాటాడుకోగలం? మీ పాట వినగలను? మీ యింటికే...."

"నా యిల్లా?"

'మీ రెక్కడుంటే అక్కడకు. నాకు' యెట్టి అభ్యంతరం లేదు."

"అభ్యంతరం అని కాదు ఒక షాకు నించి బయటపడి సుఖంగా వున్నాను. నివ్వు యింకో షాకు యివ్వనంటే నాకేం అభ్యంతరం లేదు"

"మీ మిద వున్న గౌరవంతో నేనంత పస చేస్తానా?"

'నిజమే' చిన్నప్పటి నించి నీ ప్రవర్తనే వేరు. ఎదుటి వాళ్ల గురించి ఆలోచిస్తావు. నివ్వు వెళ్ళి పోయాక నన్ను మర్యాద యిచ్చిన వాళ్లే లేకపోయారు నేను ఏచ్చి రాగాలు తీసే పిచ్చి వెధవనై పోయాను.'

"ఏమిటలా అయిపోతున్నారు? మీ చల్లని నవ్వును దాచేస్తున్నారేం?"

అనగానే నడుస్తూనే గోపాలం సహజమైన చిరునవ్వుతో ముఖం వెలిగించాడు కొంత దూరం వెళ్ళాక ఆటో దొరికింది ఇద్దరూ యెక్కారు.

(ఇంకాఉంది)

ఇడ్లీ = ఇడ్డెన అంటే?

మో నియర్ విలియమ్స్ సంస్కృతం ఇంగ్లీషు నిఘంటువు (1899) లో "ఇణ్డరి" లేదా "ఇణ్డలీ" అంటే "ఎ కయిండ్ ఆఫ్ కేక్" అని ఉంది. ఈ మాట నిఘంటువులలో కనపడేదే కాని వాడకంలో లేదని నిఘంటువుని తయారు చేసిన వారు సూచించారు కాని "మాష- ఇణ్డరి" వైద్యగ్రంధాలలో ఉన్నదని ఆయుర్వేద శిరోమణీ చెదలువాడ రాజరాజేశ్వరశర్మగారు ఈ విలేఖరికి చెప్పారు

అన్నద్రవ శూలం

భోంచేసిన అన్నం జీర్ణం అయ్యేటప్పుడు, జీర్ణమైన సిగప వచ్చే కడుపు నొప్పికి

మాషండరిం సలవణాం
సుస్విన్నాం తైలపాచితాం!
తాదృశీం సర్పిషా ఖాదేదన్న
ద్రవ నిపీడితః –

సైంధవ లవణం కలిసిన మాషెండరిని (మినప్పప్పు వంటకం) ఆవిరిలో పెట్టి, నెయ్యితో గానీ, నూనెతో కాల్చి ఎత్తిగానీ అన్నద్రవములో తినాలి

(భావమిశ్రుడి భావప్రకాశం)

మదరాసు యూనివర్శిటీ ప్రచురణ తమిళ్ లెక్సికాన్ మొదటి సంపుటంలో –

"ఇట్టలి" అంటే "ఎ కయిండ్ ఆఫ్ కేక్ ప్రిపేర్డ్ బయి స్టీమింగ్ సెమిసాలిడ్ డో మేడ్ ఆఫ్ రయిస్ మిక్స్‌డ్ విత్ బ్లాక్‌గ్రామ్" అని ఉంది.

'ఇటి" అంటే "పౌడర్, డస్ట్, ఎనీతింగ్ సల్వరయిస్‌డ్" అని కూడా ఉంది.

"ఇటియల్"కి "ఎ లూస్ కన్ఫెక్షనరీ మేడ్ ఆఫ్ ఫ్లోర్" అని రాసి ఉంది

బర్రో, ఎమెనోల "ఎ ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీ లో తమిళ్ లెక్సికాన్‌లోని మాటలనే వేశారు "ఇట్టలి"కి

ఇడ్లీ, ఇడ్డెన అనే మాటలలో ఆవిరి లేదా వేడితో తయారయిన భక్ష్యం అన్న అర్థం ఇమిడి ఉన్నదని కొందరు అనగా ఈ విలేఖరి విన్నాడు కాని నిఘంటువులు చూస్తే ఈ అర్థమే స్ఫురించటం లేదు!



తమిళంలో "ఇత్తి" అంటే "వయిట్ ఫిగ్" అని అర్థం అని బర్రో, ఎమెనోల నిఘంటువే తెలుపుతోంది

కన్నడంలో బొగ్గుకి "ఇడ్లి" అంటారని తెలుస్తోంది! మలయాళంలో "ఇడ్లి" అంటే "మంచి అర్థం" లేదని ఈ విలేఖరికి ఒక అరవ స్నేహితుడు చెప్పాడు

సి. కె. గోడె, తంకప్పన్‌నాయర్ మొదలయిన వారు ఇడ్లీ, దోసె వగయిరాలని గురించి పెద్ద వ్యాసాలు రాశారు ఇది ఒక ప్రాచీనమయిన భక్ష్య విశేషం అన్న మాట వినపడుతూ ఉంటుంది కాని దానికి గట్టి ఆధారం ఉన్నట్లు తోచదు!

ఇడ్లీ, వడ, దోసె, ఉప్మా. లాంటివి ప్రపంచంలో ఎన్నో చోట్ల వండుతూనే వచ్చారు జనం అనుకోవాలి

ఇటీవలే ప్రొఫెసర్ చల్లా రాధాకృష్ణశర్మగారు (ఆంధ్రపత్రికలో) ఒక చిన్న వ్యాసం రాశారు కాని ఇడ్డెన = ఇడ్లీ యొక్క ధాతువు' (?) జోలికి వెళ్లలేదనే అనాలి!

దోసె సంగతి ఏమిటి? — రా. గం.

జయసుధ సమాధానాలు



యం. కె. జి. తిలక్, అనకాపల్లి

నటిగా మీకు తెల్సినంతవరకూ జీవితంలో నటించడం గొప్పా? లేక నటనలో జీవించడం గొప్పా?

నటిస్తూ జీవించడం అనితరసాధ్యమైన విషయం కదా తిలక్‌జీ. జీవితంలో నటించడమనేది అందరికీ చెల్లు. నటనలో జీవించడం కొందరికే చెల్లు.

మల్లిక, పార్వతి, నాగిరెడ్డిగూడెం

మీరు నటించిన చిత్రాల్లో మీకు నచ్చిన చిత్రం ఏది?

నచ్చని వాటిని గురించి అడగండి చెప్తాను. నచ్చినవి 4 లేక 5 చిత్రాలు ఉన్నాయి.

గాదె జానకీదేవి, బరంపురం-2

మీరు ఎన్నో రకాల పాత్రల్లో జీవించారు జీవితంలో మోసపోయిన స్త్రీలకు ఆర్థికంగా చేయూతనిచ్చే ఉద్దేశ్యం మీకు ఎప్పుడైనా కలిగిందా?

కలిగింది. కానీ, అవసరం వున్న అందరికీ చేస్తే నాకేమీ మిగలదని అర్థమయింది.

కలివరపు విశ్వేశ్వరరావు, నరసన్నపేట

మీ పిల్లల్ని మీలా నటించేందుకు ప్రోత్సహిస్తారా? లేక నటించనివ్వనని అంటారా?

ఎవరికెలా వ్రాసి ఉంటే అలా జరుగుతుంది. పిల్లల్ని చక్కగా పెంచడమే మన బాధ్యత. పెరిగిన బిడ్డల యిష్టాయిష్టాల మీద వాళ్ల భవిష్యత్ ఆధారపడి వుంటుంది.

టి. శ్రీనివాసరావు, ఉండిమండలము

"మగధీరుడు" చిత్రంలో చిరంజీవి ప్రక్కన నటించేటప్పుడు ఎలా ఫీలయ్యారు?

అందరితో నటించినట్లే మామూలుగానే

టి. నూర్ అహ్మద్, హిందుపూర్

సినిమా పరిశ్రమపైమీ అభిప్రాయం?

సదభిప్రాయం.

బెల్లం మనిరాజు, సేలం-5

మీరు నటించే సమయంలో ఉత్సాహంగా ఉంటారా? మామూలుగా ఇంట్లో ఉండేటప్పుడు ఉత్సాహంగా వుంటారా?

మనిషి ఉత్సాహంగా లేకుంటే ఏమీ చెయ్యలేడు. ఏదీ సాధించలేడు. ఉత్సాహమే లేకుంటే మనిషే లేడు గనుక నేను ఎప్పుడూ ఉత్సాహంగానే ఉంటాను.

బి. యం. శోభారాణి, బెంగుళూరు

స్త్రీకి స్వేచ్ఛ అవసరమా? అయితే ఎలాంటి స్వేచ్ఛ అవసరమంటారు?

సమాజానికి చికాకు కల్గనంత వరకూ స్వేచ్ఛ అవసరమే!

స. రాజశేఖర, ధర్మవరం

మీ తర్వాత స్థానం విజయశాంతిదా? సుహాసినిదా? ఎవరిది?

ఇద్దరిదీ కాకపోవచ్చు!

స. రాజశేఖర్, ధర్మవరం

సినిమాల్లో నటించాలనుకునే నేటి యువతీ యువకులకు మీరిచ్చే సమాధానం ఏమిటి?

అనుకోవటం తేలిక! బట్ లుక్ బిఫోర్ యు లీప్.

వి. కళ్యాణి, మధిర

ఈ భారతదేశంలో పుట్టినందుకు మీరు గర్వపడతున్నారా?

సిగ్గుపడటంలేదు.

కానూరి సూర్యారావు, గుడివాడ

నేటి సినిమాలలో అర్ధనగ్న దృశ్యాలు స్త్రీ స్థాయిని ఎంతవరకూ పెంచుతాయి?

పెరిగేది స్థాయి కాదు ... హాయి. □

మనవి

ఈ వారం ఉత్తమ ప్రశ్నగా ఏది ఎన్నిక కాలేదని గమనించ కోరుతున్నాము

-సం.

కూపన్

ఆంధ్రసచిత్రవారపత్రిక
జయసుధ సమాధానాలు

ప్రశ్న:


పంపినవారి పేరు:

పూర్తి చిరునామా:

అభిమాన తారలపై అభిప్రాయం

అందం పట్టుదల, క్రమశిక్షణ, ఓర్పు ఇటువంటి మంచి గుణములన్నీ ఒకే నటునిలో చాలా అరుదు. కాని "పుణ్యం కొద్దీ పురుషుడు" అన్నట్లుగా పై సుగుణములన్నీ కలిగియున్న ఏకైక నటుడు నటభూషణ శోభన్‌బాబు. ఆనాటి "వీరాభిమన్యు" చిత్రం నుండి నిన్న, మొన్నటి 'శ్రావణసంధ్య' చిత్రం వరకూ సినీ పరిశ్రమకు ఏకైక "మహారాజు" మన శోభన్‌బాబు.

వ్యక్తిగతంగా శోభన్‌బాబు తన అభిమానులకిచ్చే సందేశాలు హృదయాలను ద్రవింపజేస్తాయి. ఆయన మనస్సు "దేవాలయం" వలె పవిత్రమైనది,






"మల్లెపూవు" కన్నా తెల్లనిది. నిర్మలమైనది అనడంలో అతిశయోక్తి లేదు. ఆనాడు, ఈనాడు, ఏనాడూ ఒకేలా ఉండే ఏకైక నటుడు మన శోభన్‌బాబు. అందుకే ఆయన అభిమాన సంఘాలలో నేనూ ఒక అభిమానినైనందులకు చాలా గర్విస్తున్నాను.

—తటవర్తి గోపాలకృష్ణ,
రామచంద్రపురం

* * *

నాకు బాలకృష్ణపై అభిమానం పెరగడానికి అతడు మన నేటి సినీ పరిశ్రమలో ఉన్న

యువనటీనటులలో అనతికాలంలోనే తనకంటూ ఒక ప్రత్యేక స్థానము ఏర్పరుచుకొన్నవారు కాబట్టే! బాలకృష్ణగారు నటించిన 'జననీ జన్మభూమి, కథా నాయకుడు, మంగమ్మగారి మనుమడు' చిత్రాలలో ఇతని నటన మెచ్చదగినది బాలకృష్ణ 'కథా నాయకుడు' చిత్రంలో రాజకీయ చైతన్యం గల యువకునిగా ప్రదర్శించిన నటన నా మనస్సుకు ఆకట్టుకున్నది

నేను బాలకృష్ణ అభిమానిగా తనికిచ్చే నిర్మాణాత్మకమైన సూచన ఏమిటంటే కుటుంబ కథా చిత్రాలలో, పౌరాణిక జానపద చిత్రాలలో వైవిధ్యంగల పాత్రలను పోషించాలి

—కె. విశ్వనాథ్‌రెడ్డి, గుల్జారిపేట, అనంతపురం

'పంతులమ్మ' కాదు... 'ఏందంటి కాపురం'తో తెలుగు తెరకు పరిచయమై నేటి వరకు అనేక విభిన్న పాత్రలతో నా మనసు నాకట్టుకున్న తార జయసుధ.




కళాభినేత్రి వాణిశ్రీ తరువాత ఎవరు అన్న ప్రశ్నకు సమాధానముగా నిలిచి, నేడు కళాతపస్వి అక్కినేని నాగేశ్వరరావు గారితో నటిస్తూ, సమర్పించు 'ఆదిదంపతులు' హిట్ కావాలని, మంచిపాత్రల పోషణతో మమ్ములను ఆనందపరుస్తూ వుండాలని మా ప్రగాఢ వాంఛ.

—ఎ. వాణి, పెనమలూరు,
విజయవాడ

* * *

అవి నేను ఎనిమిదవ తరగతి చదువుతున్న రోజులు "న్యాయంకావాలి" సినిమా రిలీజయింది. మా ఇంట్లోవాళ్ళు ఆ సినిమాకు పంపమన్నారు- ఎ సర్టిఫికెట్ ఇచ్చారు అని. నా అదృష్టం అలాగే వుందనుకున్నాను. క్యాసెట్ తెప్పించుకున్న టేప్ రికార్డర్‌లో డైలాగులు విని అదిరి పోయాను. ఖచ్చితంగా చూడాల్సిందేనని మొండి పట్టుపట్టి మా నాయనమ్మను తోడు తీసుకుని వెళ్ళాను. అంతే నండీ అప్పటి నుండీ రాధిక నటన నాకు ఎనిమిదో ప్రాణం అయ్యింది. నటనకు జీవం పోస్తున్న ఆ నటీమణిని కొనియాడేందుకు నాకు భాష చాలదు. ఆతర్వాత "త్రిశూలం" సినిమా చూసి మరింత ఎత్తుకు ఎదిగిన ఆమె నటనకు మనసులోనే జోహార్లర్పించాను. ఆ చిత్రంలో ఎంత అమాయకత్వం ఎంత చిలిపితనం అంతే పాళ్లలో శోకం అద్భుతంగా నటించి నటనకే భాష్యం చెప్పింది. కానీ నేడు నటనతో పాటుగ్లామర్‌కు ప్రాధాన్యత నిస్తున్న రోజులు కాబట్టి దయచేసి శరీరాన్ని —మరో సావిత్రిలా చేసుకోవద్దని అభిమాన




పూర్వకంగా మనవి చేస్తున్నాను.

—వై. సుజన, సుబేదార్‌పేట,
నెల్లూరు

నా అభిమాన నటి విజయశాంతి. అందాల గ్లామర్ తార ఆమె. గ్లామరే కాదు యాక్షన్ కూడా ఆమె సొత్తు. ఎలాంటి పాత్రకైనా జీవం పోసి విజయాన్ని పొందడంలో ఆమెకు ఆమెసాటి అని నిరూపించుకుంటుంది. నిదర్శనానికి "ప్రతిఘటన" "వందేమాతరం" చిత్రాలు . 'ప్రతిఘటన' ప్రతీకార వాంఛతో ప్రేక్షకులను ఆకట్టుకుంటే 'వందేమాతరం' శాంతి యుతంగా ప్రేక్షకుల హృదయాలను కదిలించింది. ఈ రెండు చిత్రాలు ఆమెను ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కించాయి. యిక ముందు కూడ మంచి వైవిధ్యమున్న పాత్రలను ఎన్నుకుని వాటికి జీవం పోయాలని, విజయశాంతి





నటించిన ప్రతి చిత్రము విజయవంతము కావాలని, నా ఆశ, అభిలాష, ఆకాంక్ష.

—నీరజ, లాల్‌దర్వాజా,
హైదరాబాద్

* * *

నా అభిమాన నటి "భానుప్రియ" . అంత చిన్న వయస్సులోనే అంత చక్కటి హావ భావ ప్రదర్శనలో ఆమెకు మరి ఎవరు సాటిరారని "అనాదిగా ఆడది" సినిమా చూసిన ప్రతి ఒక్కరికి తెలుస్తుంది.




సుఖదుఃఖాల సన్నివేశాలలోను, హాస్యసన్నివేశాలలోను ఆమెకు ఆమే సాటి. భానుప్రియ అటు నిర్మాతలకు, ఇటు దర్శకులకు విసుగు లేకుండా ప్రేక్షకుల హృదయాలను దోచుకున్నారు. భానుప్రియ ఏ పాత్రలో నటించినా నిండుగా, హుందాగా నటించాలని నా అభిప్రాయము. "అన్వేషణ" చిత్రంలో ఆమె నటన చాలా అద్భుతంగా వుంది.

—ఎం రమాశాంతి,
మాచర్ల □

సినిమా


విజయనిర్మల దర్శకత్వంలో కృష్ణ, నరేష్ నటించిన "కృష్ణ పరమాత్మ"

"కురుక్షేత్ర సంగ్రామంలో మార్గదర్శిగా, సంరక్షకుడుగా ఉండి మంచిని సూచించిన శ్రీ కృష్ణుని పాత్ర ఆలంబనగా హీరో పాత్రను రూపొందించటం జరిగింది. పాతిక రోజులలోనే షూటింగ్ పూర్తయింది. ఎం. ఆర్. రాధా పుత్రుడు రాధారవి విలన్‌గా, ఒక కీలకమైన పాత్రలో ప్రముఖ తమిళ కేరెక్టర్ ఆక్టర్ సెందామర్తై, ఒక ప్రత్యేక పాత్రలో రాధ నటించడం మరో విశేషం," అన్నారు విజయనిర్మల. ఈమె స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో, శ్రీ పంచవటి చిత్రాలయ కంబైన్స్ అధినేత కొగంటి విశ్వేశ్వరరావు నిర్మించిన "కృష్ణ పరమాత్మ" చిత్రంలో కృష్ణ, నరేష్, రాధిక, తులసి, కె. ఆర్. విజయ, నూతన్ ప్రసాద్, రాధారవి, సెందామర్తై, అల్లు రామలింగయ్య, వీరభద్రరావు, శుభలేఖ సుధాకర్, రాజా, సంగీత, జయ విజయ పాల్గొన్నారు. విజయకృష్ణ రాజ్ కథకు సత్యానంద్ సంభాషణల కర్త. వేటూరి గీతాలు, జె. వి. రాఘవులు సంగీతం, పుష్పాల గోపీకృష్ణ, ఛాయ, కొదండం శిల్పం, ఆదుర్తి హరనాధ్ కూర్పుతో పద్మనాభం నిర్వహణ బాధ్యతలు వహించారు.

ఎ. ఎన్. ఆర్., వెంకటేశ్‌లతో సి. అశ్వనీదత్ చిత్రం

"ధర్మం కోసం న్యాయం నీడలో పోరాడే న్యాయమూర్తిగా నాగేశ్వరరావు గారు, న్యాయం ముందు నిలబడే చురుకైన పాత్రలో డి. వెంకటేష్ నటిస్తున్నారు. అణగదొక్కబడుతూన్న న్యాయానికి, పెచ్చుమిరుతున్న నేరానికి మధ్య జరిగే ఘర్షణ ప్రధాన ఇతివృత్తం," అన్నారు కె. మురళీమోహన రావు. ఈయన దర్శకత్వంలో చలసాని అశ్వనీదత్ స్వాప్నిక క్రియేట్స్ తరపున నిర్మిస్తూన్న (వైజయంతీ మూవీస్ సమర్పించే) చిత్రం తొలి షెడ్యూల్ ఏప్రిల్ 1 నుంచి 10 వరకు జరిగింది. తదుపరి షెడ్యూల్స్ మే 21–31, జూన్ 16–30, జూలై 16–31 . ఎ. ఎన్. ఆర్. , దగ్గుబాటి వెంకటేశ్, గొల్లపూడి, నూతన్ ప్రసాద్, రజని,

"పవిత్ర"లో రాజేంద్రప్రసాద్, భానుప్రియ






"శ్రీ వేమన చరిత్ర"

శేషాలు

-జి. వి. జి.



జయచందర్



"విక్రమ్ 007" లో కమలహాసన్, డింపుల్ కపాడియా

అన్నపూర్ణ, నవనటి రంజని పాల్గొంటున్నారు. పరుచూరి సోదరులు కథ, మాటలు రాశారు. వేటూరి గీతాలు, చక్రవర్తి సంగీతం, ఎం. వి. రఘు ఛాయ, గౌతంరాజు కూర్పు, పట్టాభి ప్రొడక్షన్, భాస్కరరాజు శిల్పం, ధర్మరాజ్ సంయుక్త దర్శకత్వం నిర్వహిస్తున్నారు.

"పగసాధిస్తా"

"యాక్షన్ పిక్చర్. మా నరేష్ పక్కన 'మిస్ ఆంధ్ర' కీర్తి హీరోయిన్. ఏప్రిల్ 11 నుంచి మే 3 వరకు ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు విజయనిర్మల. ఈమె స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎస్. కుమార్ నిర్మించే ఎస్. వి. కంబైన్స్ వారి పై చిత్రంలో గిరిబాబు, వినోద్, వేలు, వీరభద్రరావు, సెందామరై ఆదిగా గల వారు పాల్గొంటున్నారు. జయసుధ ఓ ప్రత్యేక భూమికను నిర్వహిస్తోంది. సత్యానంద్ సంభాషణ కర్త. రాజ్ కోటి స్వరకల్పనలో సీతారామశాస్త్రి, అప్పలాచారి గీతాలు రాశారు. పుష్పాల గోపీకృష్ణ ఛాయ, కోదండం శిల్పం, శీను నృత్యాలు, ధర్మలింగం సాహసాలు, ఎన్. శేషు – టి. మాధవరెడ్డి సహకారదర్శకత్వం, జి. చంద్రశేఖర రెడ్డి కూర్పుతో ఆర్. పద్మనాభం సహనిర్మాత.

శోభన్‌బాబుతో రాఘవేంద్ర సినీ క్రియేషన్స్ చిత్రం

"శ్రీవారు– తర్వాత శోభన్‌బాబు, బి. భాస్కరరావుల కాంబినేషన్‌లో తయారయ్యే చిత్రం. ఏప్రల్, మే, జూన్ నెలల్లో షూటింగ్," అన్నారు ఇదివరకు శోభన్‌బాబుతో "శ్రీవారు, కొంగుముడి" చిత్రాలను అందించిన పై సంస్థ అధినేత కందేపి సత్యనారాయణ. ఈయన తాజా చిత్రంలో శోభన్‌బాబు, విజయశాంతి, సత్యనారాయణ, గొల్లపూడి ఆదిగాగల వారు పాల్గొంటున్నారు. కె. వి. మహదేవన్ సంగీతం, సురేష్ ఛాయ, కళాధర్ శిల్పం, గాడి సత్యం నిర్మాణత, వేణు ప్రొడక్షన్, కె. సత్యం కూర్పుతో బి. భాస్కరరావు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తున్నారు.



హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర చలన చిత్ర బహుమతుల ప్రదానోత్సవ సభలో ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు చలన చిత్ర రంగప్రముఖులను సుత్తివేలు, వేటూరి సుందర రామమూర్తి, ఎస్. పి. బాల

సినిమా


కృష్ణ సరసన సుహాసిని తొలిసారి నటిస్తున్న "శాంతి నివాసం"

"మనసిచ్చిన మగువ ఒకరు. మనువాడిన మగువ మరొకరు. ప్రేమకు, పెళ్ళికి మధ్య నలిగి పోయిన ఓ పవిత్ర ప్రేమమూర్తి కథ.... ఆ ప్రశాంత శాంతి నివాసంలో రామలక్ష్మణుల్లాంటి అన్నదమ్ముల మధ్య అగ్నిపర్వతాలు బ్రద్ధలయ్యాయి. దేవత లాంటి వదినమ్మ గుండెల్లో సుడిగుండాలు చోటు చేసుకున్నాయ్.... ప్రేమ, పవిత్రత, అనురాగం, అనుబంధం అన్ని రసాలనూ అందించే అందమైన కథను భీశెట్టి సమకూర్చిన రాజలక్ష్మి మూవీస్ వారి పై చిత్రంలో కృష్ణ డాక్టర్‌గా ఒక ఉదాత్తమైన పాత్రను పోషిస్తున్నారు. సుహాసిని, రజని, సత్యనారాయణ, జయంతి, వేలు, వీరభద్రరావు, శ్రీలక్ష్మి వగైరా తారాగణం. "ఏప్రిల్ నుంచి జూలై వరకు ప్రతి నెలా చివరి పది రోజులు జరిగే నాలుగు షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే రాజాచంద్ర. సత్యానంద్ మాటలు, వేటూరి పాటలు, చక్రవర్తి సంగీతం, కె. ఎస్. హరి ఛాయ, అంగర విజయకుమార్ నిర్వహణ, దాసం శాయి సంయుక్త దర్శకత్వంతో ఈ చిత్రాన్ని నిర్మించే అంగర సత్యం ఆగస్టులో విడుదల చేయదలచినట్లు తెలిపారు.

"శ్రీ దత్త దర్శనం" ద్వితీయ భాగం

"శ్రీ దత్తాత్రేయుని సందేశాన్ని జనులకు బోధపరచడానికి అత్యంత శక్తివంతమైన ప్రక్రియ సినిమా. దత్తాత్రేయుడు ఆదిగురువు అని తెలియపరచడానికి రెండో భాగం కూడా నిర్మించడం జరుగుతుంది. దీనికి ముందుగా "అష్టలక్ష్మి" చిత్ర నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నాం," అన్నారు శ్రీ దత్త సచ్చిదానంద స్వామీజీ. "శ్రీ దత్త దర్శనం" చిత్రాన్ని తమిళ, హిందీ, మరాఠీ భాషల్లోకి అనువదిస్తున్నట్లు శ్రీ ధత్త సచ్చిదానంద ప్రొడక్షన్స్‌నిర్మాణ సారధి వల్లభనేని లక్ష్మీదాసు తెలియ పరిచారు.

"రాక్షసుడు"లో చిరంజీవి, రాధ





మా ఆవిడకు కాస్త సినిమా పిచ్చి వుందోయ్! పెళ్ళి మూడు నిద్రలకు వాళ్ళింటి కెళ్ళినపుడు పన్నెండు సినిమాలు చూపించింది! మూడు నిద్రలకు మా ఇంటికి తీసుకొచ్చినప్పుడు పన్నెండు సినిమాలు చూపించిందాకా వదల్లేదు!



సత్కరించారు. ముఖ్యమంత్రి నుంచి సత్కారం అందుకుంటున్న వారిలో రామోజీరావు, మురళీ మోహన్, విజయశాంతి, నిర్మల, చరణ్‌రాజ్. సుబ్రహ్మణ్యం, జానకిగార్లని ఫోటో లో చూడవచ్చు

ఈయన నిర్మించిన పై చిత్రంలో అర్జున్, నవనటి వెన్నెల, గొల్లపూడి మారుతీరావు, నవ నటుడు మదన్, రమణ, వై. విజయ, విజయబాల, వైజాగ్ శ్యామల నటించారు. గణేష్‌పాత్రో మాటలు, సి. నారాయణ రెడ్డి పాటలు, కె. వి. మహదేవన్ సంగీతం, లక్ష్మన్ ఛాయ, శివ- సుబ్రహ్మణ్యం నృత్యాలు, సాహుల్ సాహసాలు, ఎస్. ఎస్. రెడ్డి సహకార దర్శకత్వం, కొండపనేని రామలింగేశ్వరరావు శిల్పం, ఎం. రంగారెడ్డి- మజ్జి కృష్ణప్రసాద్ ప్రొడక్షన్, రావుశ్రీ సంయుక్త దర్శకత్వంతో కోడి రామకృష్ణ స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించారు.



"పెళ్ళి పిచ్చోళ్ళు"లో రేవతి


చిత్రీకరణ ముగిసిన "మన్నెంలో మొనగాడు"

"కారడవిలో మసలే రెండు లేత హృదయాల మధ్య జరిగిన కమనీయమైన ప్రణయ గాథ. ఏప్రిల్ 1 నుంచి 10 వరకు చివరి షెడ్యూల్‌ను పూర్తి చేశాం. అంతకు ముందు అరకులోయ ఫారెస్ట్ హౌస్, సంతలోని రెస్ట్ హౌస్, చాంపి గ్రామం, పాడేరు, మాడ్‌గడలోని తేనెపుట్ట చెట్టు వద్ద పాటలు, సన్నివేశాలు, ఫైట్స్ చిత్రీకరించాం. ఇదొక కొత్త తరహా సబ్జెక్టు, నవరసభరిత మైనది. ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా భార్గవ్ ఆర్ట్స్ యూనిట్ చక్కని కథను సమకూర్చింది," అన్నారు ఎస్. గోపాల్ రెడ్డి.

భానుమతికి రఘుపతి వెంకయ్య అవార్డు

ప్రముఖ నటి, సంగీత విద్వాంసురాలు, నిర్మాత, దర్శకురాలు, రచయిత్రి, అయిన శ్రీమతి భానుమత రామకృష్ణ తెలుగు చలన చిత్ర పరిశ్రమకు చేసిన గణనీయమైన సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమెకు 1985 సంవత్సరానిక రఘుపతి వెంకయ్య అవార్డును ఇచ్చింది

ఏప్రిల్ 10వ తేది ఉగాది పండుగ నాడు ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు ఈ అవార్డును శ్రీమతి భానుమతికి బహూకరించారు. ప్రతి ఏటా చిత్ర పరిశ్రమలోని ప్రముఖులకు ఇచ్చే ఈ అవార్డు క్రంద రు.25 వేల నగదు, మెమెంటో విజేతక అందచేస్తారు



ఉగాది రోజున తెలుగు లలిత కళా తోరణంలో ముఖ్యమంత్రి శ్రీ ఎన్ టి. రామారావు శ్రీమతి పి. భానుమతీ. రామకృష్ణకు రఘుపతి వెంకయ్య స్మారక అవార్డు అందచేస్తున్న దృశ్యం.



ప్రతిభ + సౌజన్యం = శిల్ప దర్శకుడు భాస్కరరాజు

వాహినీ స్టూడియోలో బ్రహ్మాండమైన విజయా వారి "పాతాళ భైరవి" ఆలయం సెట్టు ఫ్లోర్‌లో రంగులకు అంటుకున్న దుమ్మును తుడుస్తున్న ఓ పన్నెండేళ్ళ అబ్బాయి ఆయాసంతో ఒళ్ళు విరుచుకుంటూ ఒకసారి తలెత్తి, ఆ సెట్టంతా చూశాడు. "ఇలాంటి సెట్స్‌ను తాను ఏనాటికైనా వేయగలడా? ఏ తపనతో ఎక్కడో భీమవరం దగ్గరున్న తన స్వగ్రామం చిలుకూరు నుంచి ఇంత దూరం వచ్చాడో – అది నెరవేరుతుందా?"

స్వస్థలంలో ఆ అబ్బాయి వీధిబడిలో నోట్‌బుక్ పేజీలన్నిటినీ పాఠాలతో కాక బొమ్మలతో నింపడం చూసి, "బొమ్మలు గీసే కుంకవు– నీకు చదువెందుకురా?" అని ఓసారి బడిపంతులు తపీమని మొట్టికాయ వేశాడు కూడా మిత్రులతో భీమవరం వెళ్ళి సినిమాలు చూసినప్పుడు, "ఆహా! సెట్స్ ఎంత బావున్నాయి!" అని ఆ అబ్బాయి అన్నప్పుడల్లా, "వీడెక్కడ దొరికాడురా– సినిమా అంతా చూసి వొట్టి సెట్స్ గురించే మాట్లాడ్తాడు! నీకంత ఇష్టంగా ఉంటే– ఆ మద్రాసేదో వెళ్ళి, ఆ సెట్సేమిటో వేసుకోరాదూ, వెర్రి మొహమా!" అని విరగబడి నవ్వుకునేవారా మిత్రులు.

అవన్నీ దీవెనలుగా భావించాడా అబ్బాయి.

ఎలాగో తను మద్రాసు కొచ్చి పడ్డాడు. ఇప్పటికి– కనీసం ఇంత అందమైన సెట్‌లో ఫ్లోర్ తుడిచే అదృష్టమైనా తనకు దక్కింది. ఇదే చాలు ప్రస్తుతానికి– అని మురిసి పోయాడా అబ్బాయి.

ఆ అబ్బాయి కలలు నిజమవడానికి అది తొలి మెట్టు

ఆ అబ్బాయే నేటి సుప్రసిద్ధ శిల్ప దర్శకుడు భాస్కరరాజు

"వాహినీ స్టూడియోలో ఎ కె శేఖర్‌గారు, గోఖలేగారు లాంటి సిద్ధహస్తు లెందరో రూపొందించే సెట్లు ఎంతో కళాత్మకంగా ఉండేవి అవి తెలుగు సినిమా రంగంలో ఏనాటికైనా చెరగని రూపాలు. ఆ ప్రముఖ డైరెక్టర్లందరూ నన్ను బిడ్డగా చూసుకున్నారు ఆదరించారు ఆర్ట్ డైరెక్షన్‌లో ఆ ఆల నుంచి ఎన్నో విషయాలు, విధానాలు నేర్పారు. ఆ మహామహుల ఆశీస్సుల ఫలితంగానే నేడు నేను ఇన్ని సంస్థలకు పని చేయగలుతున్నాను," అంటారు భాస్కరరాజు ఎంతో వినయంగా

భాస్కరరాజులో అణకువ, వినయ విధేయతలు, నొప్పింపక తానొవ్వని తత్వం, కృషి, శ్రద్ధ, ఓపిక ఉన్నాయి గనుకే "ఉయ్యాల – జంపాల" చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్‌గా తొలి అవకాశ మిచ్చారు దర్శక నిర్మాత తిలక్

ఒకప్పుడు ఏ "పాతాళభైరవి" సెట్‌లో తాను ఫ్లోర్‌బాయ్‌గా పని చేశాడో– అదే "పాతాళభైరవి" చిత్రాన్ని పద్మాలయ వారు హిందీలో భారి ఎత్తున నిర్మిస్తూ, తనను ఆర్ట్ డైరెక్టర్‌గా నియమించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు భాస్కరరాజు

మీ ప్రతిభ, మీ మంచితనం కూడా కారణాలు," అన్నాను.

'అలా అనకండి, సార్! నే వేసిన స్కెచ్‌లకి తగ్గట్టు సెట్స్ వేయడంలో కృషి చేసే మోల్డర్స్, కార్పెంటర్స్, పెయింటర్స్– అందరికీ ఈ క్రెడిట్‌లో భాగముంది– ప్రత్యేకించి కెమెరామన్‌కు కూడా ... ఎందుకంటే– ఒక పెద్ద పర్వతాన్ని చూపించాలనుకోండి. చిన్నగా "మినియేచర్"ను నేను రూపొందిస్తాను బాగా దగ్గర్నుంచి చిత్రీకరిస్తాడు ఛాయా గ్రాహకుడు. ఇందులో ఎవరు నేర్పరితనం కొరవడినా ఆ ఎఫెక్ట్ రాదు కదా? అంచేత, ఇదంతా సమిష్టి కృషి," అన్నారు భాస్కరరాజు.

సాంఘిక, చారిత్రక, పౌరాణిక, జానపద చిత్రాలలోనూ– ముఖ్యంగా ఇటీవలే విడుదలైన "సింహాసనం" లాంటి భారి చిత్రం వరకు అంగరంగ వైభవంగా రంగాలంకరణ చేయడంలో, పాత్రలకు రూపకల్పన చేయడంలో భాస్కరరాజు మేథస్సు ఎంతటిదన్న విషయం అందరికీ తెలుసు. ఈ విషయమే ఆయనతో అంటే–

"బ్రహ్మాండమైన సెట్స్ చూసి ఆర్ట్ డైరెక్టర్ పనితనం అత్యద్భుతంగా ఉందని మెచ్చుకుంటూంటారు ప్రేక్షకులు. ఐతే, ఒక నిరుపేద నివసించే పూరిపాక, పరిసరాలు– ఎంతో దీనంగా, సహజంగా కనిపించేలా సెట్స్ రూపొందించడంలో కూడా ఉంది ఆర్ట్ డైరెక్టర్ ప్రతిభ ... కథ, వాతావరణం, పాత్రల స్థితిగతులు బట్టి సెట్స్, దుస్తులు రూపొందిస్తేనే సహజత్వం కనిపిస్తుంది మన కళల్లో జాతీయత ప్రతిబిం బించాలి. "తాండ్రపాపారాయుడు" చిత్రం తీసుకోండి బొబ్బిలి, విజయనగరం వగైరా పలు చరిత్ర ప్రసిద్ధి పొందిన ప్రాంతాలకు వెళ్ళి, అక్కడి కోటలు, రాజదర్బారులు, కరవాలాలు, శిధిలావస్థలో ఉన్న ఎన్నో చారిత్రక ఆధారాలు పరిశీలించాం ఆఖరికి, ఆ కాలపు "బావుటా" కూడా మా కొకటి లభించింది. వీటి అధారాలతో సెట్స్‌ను రూపొందిస్తేనే అలనాటి వైభవం కళ్ళకు కట్టినట్లు ఉంటుంది. ఇంకో విషయం కూడా చెప్పాలి. ఒక్కో భాషలోని చిత్రానికి కళాదర్శకత్వం వహించడానికి ముందు ఆ ప్రాంతపు వాతావరణంతో సాన్నిహిత్యం ఏర్పరచుకోవాలి. ఒక హిందీ చిత్రంలోని గ్రామీణ వాతావరణం కోసం నేను ఉత్తర భారతంలోని ఒక పల్లెకు వెళ్ళి పరిశీలించడం జరిగింది. ఆ విధంగానే సెట్స్ రూపొందించాను అందుకే ఆ హిందీ చిత్రం చూసిన వారికి వార్ప్రాంతీయత కనిపించింది "

"ఎప్పుడైనా మీరు రూపొందించిన సెట్ మకే అసంతృప్తికరంగా అనిపించిందా?"

"ఉన్నట్టుండి ఆర్టిస్టులందరి కాల్షీట్లను అతి కష్టంమీద సంపాదిస్తారు. రాత్రికి రాత్రే సెట్‌ను రూపొందించి మర్నాటికి సిద్ధం చేయవలసి వస్తుంది. అలాంటప్పుడు నాకు ఒకటి రెండుసార్లు అనిపించింది– మరి కాస్త టయిమ్ ఇస్తే, ఈ సెట్‌ను ఇంకా బాగా వేయడానికి వీలుండేది కదా అని."

అన్నట్టు ఇటీవల ఔట్‌డోర్స్‌లో ఎక్కువగా షూటింగ్‌లు జరుపుతున్నారు ఔట్‌డోర్స్‌లో ఆర్ట్ డైరెక్టర్ అవసరం ఉండదా?

అవసరం లేకుండా తీస్తున్నవారూ కొందరు లేకపోలేదనుకోండి. ఆర్ట్ డైరెక్టర్ ఉంటే, అక్కడి సహజ వాతావరణానికి మరింత నిండుదనం, శోభ కలిగించేలా ఆ పరిసరాలలో కొద్ది పాటి చేర్పులు, మార్పులు చేయడానికి వీలవుతుంది. "సంపూర్ణ రామాయణం" విషయానికి వద్దాం. అందులో వనవాసం సీన్.... ఏ అడవుల్లోనైనా తీయొచ్చు కదా? ఐతే ఎన్నుకున్న లొకేషన్‌లో ఆర్ట్ డైరెక్టర్ చేత అక్కడక్కడ సెట్లు వేయించి, ఆ కొరడవిని ఎంతో కళాత్మకంగా చూపడానికి వీలవుతుంది. దీన్నిబట్టి ప్రముఖ డైరెక్టర్ బాపుగారు స్వయంగా విఖ్యాత చిత్రకారులై ఉండీ కూడా ఆర్ట్ డైరెక్టర్‌కు ఎంత విలువ ఇచ్చారో విశదమవుతుంది. వారు దర్శకత్వం వహించిన "భక్త కన్నప్ప" చిత్రానికి కూడా నాచేత ఔట్‌డోర్‌లో సెట్స్ వేయించారు. అలాగే "బొబ్బిలి బ్రహ్మన్న" కూడా. చిత్రం కళాత్మకంగా ఉండాలని తపనపడే డైరెక్టర్లందరూ ఔట్‌డోర్స్‌లో ఆర్ట్ డైరెక్టర్లకు పని కల్పిస్తుంటారు. ఇలా ఎందరో దర్శకుల వద్ద నుంచి ఎంతో నేర్చుకుంటున్నాను. నేను నేర్చుకోవలసింది ఇంకా ఎంతో ఉంది." అనే భాస్కరరాజు నిగర్వి, నిండుకుండ. నిరాడంబరజీవి. ఆయన అసిస్టెంట్లకు స్కూటర్లు ఉన్నా- ఈయనకు సైకిల్ కూడా లేదు! కాలినడకనే వెళ్తుంటారు" భగవంతుడిచ్చిన కాళ్ళు ఉన్నాయి కదా సార్!" అంటూ. సొంత ఇల్లు లేదు. బ్రహ్మాండమైన సెట్స్ వేసే ఈయన సైకవ్పు బీటలు వారి. కూలి పోయేటట్లున్న ఒక చిన్న ఇంట్లో అద్దెకుంటున్నారు. అదేమిటంటే, "నేను మద్రాసుకు వచ్చిన కొత్తల్లో ఎలా ఉన్నానన్న విషయం మరవకూడదు, సార్!" అంటారు ఎంతో సౌమ్యంగా.

వృత్తిలో ఎంత సిద్ధహస్తుడో, స్వవిషయంతో అంత బద్ధకస్తుడు భాస్కరరాజు!

–(జి. ఎ. జి.)



వితరణ శీలి యార్లగడ్డ వెంకన్నచౌదరి. మృతి



ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు, వాణిజ్య వేత్త, 'నమ్మిన బంటు' మొదలైన ఉత్తమ చిత్రాల నిర్మాత, **వితరణ శీలి అయిన శ్రీ యార్లగడ్డ వెంకన్న చౌదరి** ఏప్రిల్ 6వ తేదీన మదరాసులోని అపోలో ఆసుపత్రిలో కన్ను మూశారు. ఆయన వయసు 74 సంవత్సరాలు కొంతకాలంగా ఆయన అస్వస్థులుగా ఉన్నారు

శ్రీ వెంకన్న చౌదరి ప్రకాశం జిల్లాలోని కారంచేడులో 1912లో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. 18 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు కొన్ని సంవత్సరాలు కారాగార వాసం చేసారు ఆయన పదవుల కోసం కాకుండా సేవా నిరతితో చేసిన కృషి మహాత్మాగాంధీ ప్రశంసలు అందుకున్నది.

స్వాతంత్ర్యానంతరం రాజకీయాల పట్ల వైముఖ్యం కలిగి ఆయన మదరాసులో స్థిరపడ్డారు. 1950 నుంచీ అక్కడే వుంటూ వాణిజ్య, పారిశ్రామిక రంగాలకి తమ సేవలని అందించారు.

రెండు సార్లు ఆంధ్ర - వాణిజ్య మండలి అధ్యక్షులుగా ఎన్నికైనారు. తమిళనాడు అమ్మకం పన్ను సలహా సంఘం, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంఘం, చిన్నతరహా రేవుల అభివృద్ధి సంఘం వంటి సంస్థలలో క్రియాశీలక మైన పాత్ర నిర్వహించారు.

ఆయన చేసిన కృషికి గుర్తుగా మదరాసులోని కోడంబాకంలో ఒక ప్రాంతానికి చౌదరి నగర్ అని పేరు పెట్టారు. మదరాసులోని తెలుగు పాఠశాలలకి, ఆంధ్రప్రదేశ్ లోని అనేక కళాశాలలకి, వైద్య శాలలకి ఆయన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మంగళగిరి దగ్గర కాన్సర్ ఆసుపత్రి, పరిశోధనా సంస్థల నిర్మాణానికి ఆయన 30 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

శ్రీ వెంకన్న చౌదరి తమ భార్య జ్ఞాపకార్థం 1980లో 'శ్రీ యార్లగడ్డ రాజ్యలక్ష్మి కళాపీఠం' స్థాపించి వివిధ రంగాలలోని ప్రముఖులని ప్రతి ఏటా సత్కరిస్తున్నారు. నటి సావిత్రి జ్ఞాపకార్థం 1982లో మరో అవార్డుని ఏర్పాటు చేసారు. □

సినిమా

హరికృష్ణ కొత్త చిత్రంలో శోభన్‌బాబు, విజయశాంతి

"ఇది ఫక్తు కమర్షియల్ చిత్రం మే నుంచి జూలై వరకు షూటింగ్,"అన్నారు రాజాచంద్ర. ఈయన దర్శకత్వంలో వై. రాజ్యలక్ష్మి నిర్మించే శ్రీనికేతన్ ఆర్ట్స్ వారి చిత్రంలో శోభన్‌బాబు సరసన విజయశాంతి నాయిక సత్యానంద్ మాటలు, చక్రవర్తి సంగీతం, కె ఎస్ హరి ఛాయతో శోభన్‌బాబు సమర్పించే ఈ చిత్రం వై. హరికృష్ణ నేతృత్వంలో రూపు దిద్దుకుంటుంది.

కృష్ణ "ప్రతిభావంతుడు" మే 1న

"కృష్ణగారి సరసన భానుప్రియ తొలిసారి నాయికగా నటించిన చిత్రం. నేను డైరెక్ట్ చేసిన తొలిచిత్రం. రొషెస్ చూసిన వారు చాలా బాగా వచ్చిందంటున్నారు, "అన్నారు డాక్టర్ ఎం. ప్రభాకరరెడ్డి. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎస్. రామచంద్రరావు నిర్మించిన పై సర్వజనరంజక చిత్రంలో శ్రీధర్, గుమ్మడి, ప్రసాద్‌బాబు, అల్లు రామలింగయ్య, వేలు, రాజ్‌వర్మ, సంయుక్త, షావుకారు జానకి, శుభ, కె. విజయ, జయమాలిని ఇతర పాత్రధారులు. మద్ది పట్ల సూరి మాటలు, సత్యం సంగీతం, పుష్పాలగోపీకృష్ణ ఛాయ, భాస్కరరాజు శిల్పం, శీను నృత్యాలు, రాజు సాహసాలు, రామ్‌సూరి– జి. సత్యం సహదర్శకత్వం. ఎస్. వెంకటేశ్వరరావు నిర్వహణ, కోటగిరి గోపాలరావు కూర్పు తెరవెనుక హంగులు. □



సీరియల్

వసంతగీతం

దేవినేని ఉష

జరిగిన కథ-3: చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయిన కృష్ణ వరుసకు చిన్నాన్న అయిన సుబ్బారావు దగ్గర పెరుగుతాడు. హైదరాబాద్‌లో బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. మాలతిని చూడటానికి పెళ్ళిచూపులకై మద్రాసు వెళ్ళుతాడు కృష్ణ. కృష్ణ, మాలతి ఒకరినొకరు నచ్చారు. హైదరాబాదుకు తిరుగు ప్రయాణంలో అను పరిచయమైంది కృష్ణకి. ఒక కోయ వ్యక్తి కృష్ణకి ఇప్పుడనుకుంటున్న అమ్మాయితో పెళ్ళి కాదని వేరే అమ్మాయితో పెళ్ళి అవుతుందని జాతకం చెప్తాడు. రాంబాబు చేతిలోనుండి తప్పించుకొని వచ్చి కృష్ణ ఆశ్రయం కోరింది అను. ఆమెను ఒక వర్కింగ్ ఉమెన్ హాస్టల్లో చేర్పించి జాబ్ కోసం గట్టిగా ప్రయత్నం చేస్తానని చెప్తాడు కృష్ణ.

ఆ హాస్టల్‌లో ఇద్దరి ఉద్యోగినులకు ఒక రూమ్ ఇస్తారు. అనుకు ఒక రూమ్‌లో ఇచ్చారు. ఆమె రూమ్‌మేట్ కమల. అప్పటి వరకు ఆ రూమ్‌లో కమల ఒక్కతే ఉంది. ఇప్పుడు అందులో అనుకు కూడా ఇచ్చారు. రెండు మంచాలు రెండు ఛెయిర్స్. రెండు బీరువాలు గోడకే అమర్చబడి ఉన్నాయి. బీరువాలకు అద్దాలు బిగించారు. అను తన బ్యాగ్‌లో బట్టలు తీసి బీరువాలో సర్దుకుంది. బ్యాగ్ అడుగున తను వెంట తెచ్చుకున్న సర్టిఫికెట్స్ జాగ్రత్త చేసింది.

ఆమె రూమ్‌మేట్ కమల స్నానం చేసి వచ్చింది. తెల్లని ఆర్గండి చీరలో ఉంది. ఆమె జడ మోకాలు కింద వరకు ఉంది. అను ఆ జడనే చూస్తూ ఉండిపోయింది. ఆమె మొహం వేపు చూసింది. భయం వేసింది. మొహం అంతా అక్కడక్కడ కాలిన గుర్తులతో తెల్లగా ఉంది. ఆ కాలిన గుర్తులు లేకపోతే అందగత్తెల కోవలోకి వచ్చేది.

ఆమె అనుని ప్రేమగా పలకరించింది. మాట చాలా మెల్లగా ఉంది. ఆమె వివాహిత అనీ, ఒక పెద్ద కంపెనీలో స్టెనో అనీ, ఎందువల్లో ఇలా హాస్టల్‌లో ఉంటోంది అనీ అను తెలుసుకుంది. తను కూడా ఇప్పుడే బి. ఎ. పరీక్షలు రాసాననీ, ఇంకా రిజల్ట్సు రాలేదనీ, ఈ హాస్టల్‌లో ఉండి, ఏదైనా జాబ్ చూసుకుంటాననీ చెప్పింది అను.

అసలే స్నేహం అంటే అను పడి చచ్చిపోతుంది దాంతో కమల స్నేహంగా మాట్లాడేసరికి అను త్వరలో ఆమెను అల్లుకుపోయింది. తెల్లవారేసరికి ఇద్దరూ మంచి స్నేహితురాళ్ళు అయిపోయారు.

ఉదయం పది గంటలకల్లా అందరు చిలకల్లా ముస్తాబు అయి డైనింగ్ రూమ్‌కి వెళ్ళి భోజనాలు చేసి, బాక్సులో టిఫెన్ పెట్టించుకుని అవి హాండ్ బ్యాగుల్లో పెట్టేసుకుంటూ బైటకు వెళ్ళిపోతున్నారు.

చివరకు హాస్టల్ స్టాఫ్, అను మాత్రం మిగిలిపోయారు. అను కాసేపు ఆఫీస్ రూంలో సుమిత్రాదేవి దగ్గర గడిపింది కాసేపు ఆవిడ ఇచ్చిన పుస్తకాలతో కాలక్షేపం చేసింది. నాలుగు గంటల నుండి కృష్ణ కోసం ఎదురు చూడసాగింది

అన్నయ్యలు, అమ్మా, నాన్న గుర్తు వచ్చారు. కళ్ళు చెమ్మగిల్లాయి. ఇంట్లో ఆ వత్తిడి తట్టుకోలేక వచ్చేసింది వాళ్ళు తన కోసం ఎంత బాధపడి ఉంటారో, ఎవడితోనో లేచిపోయానని ఎంత అసహ్యించుకుంటారో, దీప ద్వారా వాళ్ళు ఎలాగో రాంబాబు ఎడ్రస్ తెలుసుకుని ఈ పూరు రాంబాబు ఇంటికి వస్తారు. అతను తనకు లొంగలేదని ఎన్ని కల్పించి వాళ్ళతో చెప్తాడో. అందరూ ఉండి ఎవరూ లేని దానిలా అనాధలా ఇక్కడ ఉన్నాను. ఉద్యోగం వచ్చాక జరిగినదంతా నాన్నకు లెటర్ వ్రాయాలి. అర్థం చేసుకుని వస్తే వస్తారు. లేకపోతే తను బ్రతుకంతా ఇలా వంటరిగానే గడిపేస్తుంది. పరిపరి విధాలుగా ఆలోచించసాగింది.

కృష్ణ రానే వచ్చాడు. అతని రాక ఎడారిలో ఒయాసిస్సులా అనిపించింది అనుకు.

"ఎలా ఉన్నారు?" నవ్వుతూ పలకరించాడు.

"అయాం ఫైన్!" తనూ నవ్వింది.

"ఉండండి సుమిత్రాదేవి గారి వద్ద పర్మిషన్ తీసుకుని అలా బైటకు వెళదాం' అంటూ ఆఫీస్ రూంలోకి వెళ్ళాడు.

ఆవిడ వద్ద పర్మిషన్ తీసుకుని ఇద్దరు ఇందిరా పార్కు వెళ్ళే బస్ ఎక్కారు.

పార్కులో ఒక పక్కగా కూర్చున్నారు.

"చూడండి పెళ్ళి కావాల్సిన వారు. ఇలా నా వెంట బైటకు పదేపదే వచ్చినా బాగుండదు. ఒక్కసారి మీ వాళ్ళకు లెటర్ వ్రాయండి. వాళ్ళు వచ్చి మిమ్మల్ని చూసి సంతోషపడతారు. మీరు ఇక్కడే ఉండి జాబ్ చూసుకుందురు గాని" కృష్ణ నచ్చజెప్పాలని చూసాడు.

తల అడ్డంగా తిప్పింది. "వద్దండీ. వాళ్ళకు రోజు రోజుకు నా మీద అనుమానాలు పెరుగుతున్నాయే కానీ, నన్ను నమ్మలేరు. ఇప్పుడు వాళ్ళని కలుసుకోవాలని లేదు నాకు. దయచేసి ఆ విషయాలు మర్చిపోండి. నాకు ఏదైనా చిన్న జాబ్ ఇప్పించినా చాలు. నా దారిన నేను బ్రతుకుతాను. ఆ తరువాత నా గురించి ఇలా వచ్చే రిస్కు కూడా మీకుండదు. మీ గురించి నాకేం అపకారం జరగదు. కానీ నా వల్ల మీ భవిష్యత్‌కే ఏదైనా చెడ్డ పేరు వస్తుందేమో."

"అలా ఎప్పుడూ అనుకోవద్దు. నేనేం చెడు ఉద్దేశ్యంతో మీకు సాయం చేయడం లేదు. అయినా నా మేరేజ్ కూడా నిశ్చయం అయిపోయింది. మీరు చెప్పినట్టుగా మీకేదైనా జాబ్ ఇప్పిస్తాను. ఆ తరువాత ఇష్టాన్ని బట్టి మనం ఫ్రెండ్స్‌గా ఉండొచ్చు. లేదా విడిపోవచ్చు. అదీ మీరు నా సాయం కోరారు కాబట్టి. లేకుంటే మీరెవరో, నేనెవరో?"

"మీకు మారేజ్ సెటిల్ అయిందా?"

"అవును" అంటూ మాలతి గురించి చెప్పాడు.

అను తన సంతోషం ప్రకటించింది. సుధాకర్ గుర్తు వచ్చాడు. ఒళ్ళు అసహ్యంతో జలదరించింది.

"మీలాంటి మంచి మనసున్న వ్యక్తికి భార్యగా అవటం ఆవిడ అదృష్టం అండీ" నవ్వుతూ మనస్ఫూర్తిగా అంది.

"ఆ మాట అనకండి" వారించాడు నవ్వుతూ.

"ఏం?" వింతగా చూసింది.

"డబ్బులో కానీ, చదువులో కానీ, హోదాలో కానీ ఆమె కంటే నేను తక్కువవాడిని. వాళ్ళు మాతో కావాలని చుట్టరికం కలుపుకుంటున్నారు. అందుకని రేపంతా అటువంటి గొప్ప సంబంధం దొరకటం నా అదృష్టం అని అంతా అంటారు."

అను గలగలా నవ్వింది.

"ఆ పెళ్ళి కూతురుకి ఒక చెల్లి ఉంది. పేరు స్వప్న. అచ్చం మీలాగే మాట్లాడుతుంది" అనును చూస్తూ అన్నాడు.

"నన్ను అలా మీరు మీరు అనకండి. నాకు బాగోదు. అను అనండి చాలు" అంది.

"ఓ కే. నా కంటే చిన్నవారు కాబట్టి అలానే అంటాను. నాకు మిమ్మల్ని చూస్తుంటే స్వప్న గుర్తు వస్తుంది."

"ఆ అమ్మాయి అంటే మీకు చాలా ఇష్టంలా ఉంది."

"అవును. ఐ లైక్ నైస్‌గాళ్."

ఎనిమిదింటికల్లా అనును హాస్టల్ దగ్గర దింపి కృష్ణ ఇంటికి వెళ్ళిపోయాడు.

★ ★ ★ ★

వారం రోజులు జరిగిపోయాయి. కృష్ణ తెలిసిన ఓ ఎ. ఏజన్సీలో అనుకు జాబ్ ఇప్పించాడు సేల్స్‌గర్ల్‌గా. గవర్నమెంట్ జాబ్ కోసం ఓ. ఎ. రిజల్ట్సు వచ్చాకా ట్రై చేద్దామని చెప్పి అనును అక్కడ చేర్పించాడు. కోఠీలో ఉంది జీతం నాలుగు వందలు ఇస్తారు. ఒకనెల వర్క్ చూసి మరొక వంద ఎక్కువ ఇస్తామన్నారు.

అనుకు అక్కడ బాగానే కాలక్షేపం అయిపోతోంది. పర్మినెంట్ జాబ్ దొరికాక అప్పుడు ఇంటికి లెటర్ వ్రాయాలని నిర్ణయించుకుంది. ఇప్పుడు కృష్ణ అనుకు రోజూ కనపడుతున్నాడు. సాయంత్రం కాసేపైనా షాప్‌లో వచ్చి కూర్చుంటున్నాడు. ఆ షాప్ ఫ్రెండ్‌దే కాబట్టి సమస్యలేదు. అను కూడా అప్పుడప్పుడు వాళ్ళతో మాట కలుపుతూ పని చూసుకునేది. అను రిజల్ట్సు కోసం ఎదురు చూడసాగింది.

ఎప్పుడైనా ఒకో ఆదివారం అను కోరిక మీద కృష్ణ ఆమెకు గండిపేట, యాదగిరిగుట్ట, గోల్కొండ దూరంగా ఉన్న ప్రదేశాలు చూపించేవాడు. అప్పుడైనా కృష్ణ ఆమెతో వికారంగా ప్రవర్తించేవాడు కాదు. అతని నిగ్రహం తెలిసాక అతనితో ఎక్కడికి వెళ్ళటానికయినా అనుకు భయం అనిపించేది కాదు. అతనొక గురువు, తనొక శిష్యురాలు. అలా ఉండేది అను మనసులో.

రోజులు గడచిపోసాగాయి. ఆమె బి. ఏ. రిజల్ట్సు తెలిసాయి. సెకెండ్ క్లాస్‌లో పాసయ్యింది. ఆ రోజు అను తన డబ్బుతో మొదటిసారిగా కృష్ణకు హోటల్ అన్నపూర్ణలో గ్రాండ్‌గా పార్టీ ఇచ్చింది.

తనకు తెలిసిన ఒక గవర్నమెంట్ కంపెనీలో ఒక పోస్ట్ ఖాళీ ఉన్నట్టు తెలుసుకున్నాడు కృష్ణ. దానికోసం ట్రై చేయసాగాడు. ఒక ఐదు వేలిస్తే పని జరుగుతుందని కనిపెట్టాడు. ఆ మాటే అనుతో అన్నాడు.

"అలా అయితే నా బంగారం తాకట్టుపెట్టి ఐదు వేలు తెండి, అవి జీతం మీద విడిపించుకుంటాను. దీంతో మీకు నా రిస్క్ వదలిపోతుంది" అంది మళ్ళీ.

కృష్ణ అలాగేనంటూ ఇంటికి వచ్చేసాడు. గదిలో లెటర్స్ రెండు పడివున్నాయి. విప్పి చూసాడు. ఒకటి విజయవాడ నుండి తండ్రి రాసింది. కృష్ణ వచ్చి చాలాకాలం అయిందనీ, ఎలా ఉన్నాడో వరమ్మ దిగులు పెట్టుకుందని వీలైతే ఒకసారి వచ్చి వెళ్ళాల్సిందిగా వ్రాసారు. వచ్చే నెలలో దసరాకు కూతుళ్ళిద్దరూ భర్తలతో వస్తున్నట్టు అప్పుడు కృష్ణ కూడా రావాల్సిందని కోరారు. అంతేకాక కూతుళ్ళు ఉండగానే తామంతా మద్రాస్ వెళ్ళి మాలతికి పసుపుకుంకుమ పెట్టి తమ కోడలిని చేసుకుని వస్తామనీ, పెళ్ళి వేసవిలో అని రామనాథంగారు వ్రాస్తున్నారు కాబట్టి అప్పుడే లగ్నాలు పెడతామని వివరంగా వ్రాసారు. అది చదవగానే అతని మనసు దూదిపింజలా తేలిపోయింది. మాలతి ఆనాటి రూపం కనులముందు నర్తించసాగింది. వేసవి దాకా ఆమె ఎడబాటు ఎలా సహించాలా అనుకున్నాడు. దసరాకు విజయవాడ వెళ్ళి పసుపు, కుంకుమ పెట్టటానికి ఇంట్లో వాళ్ళతో పాటు తనూ వెళితే బాగుండుననిపించింది. కానీ వాళ్ళు తనని తీసుకువెళ్ళరు. ఒక వేళ వెళ్ళినా చీప్‌గా ఉంటుందని ఆ ఆలోచన విరమించుకున్నాడు.

అదురుతున్న పెదవులతో మాలతి "ఐ లవ్ యూ" అంటూ చెవిలో గుస గుసలాడినట్టు అనిపిస్తోంది.

పగలంతా పనులతో గుర్తు రాకున్నా ప్రతి రాత్రీ కాసేపైనా మాలతి గురించి తల్చుకోవడం అలవాటు అయిపోయింది. ఆమెతో తన జీవితం అందంగా ఊహించుకుంటాడు నిద్రపట్టే వరకూ.

ఎప్పుడైనా మాలతికి లెటర్ వ్రాద్దామన్నా వాళ్ళ ఎడ్రస్ అతని దగ్గర లేదు.

రెండో కవర్ చింపాడు. అది ఢిల్లీ నుంచి కమలాకర్, ప్రమీల వ్రాసారు.

రామనాథం నుండి తమకు లెటర్ వచ్చింది. కృష్ణ వాళ్ళందరికీ బాగా నచ్చాడనీ, కాకపోతే మాలతి పి. హెచ్. డి. కుంటుపడకుండా అది ఈ వేసవితో పూర్తి అవుతుంది కాబట్టి అప్పుడు పెళ్ళికి ముహూర్తం పెడతామని రాసాడు అని ఉంది అందులో. తాము దసరాకు విజయవాడ వస్తున్నారు కాబట్టి కృష్ణను కూడా పండుగనాటికి రమ్మనమని గట్టిగా వ్రాసారు.

అందరూ వస్తున్నారు. తను వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు.

దసరాలోగా కృష్ణ కొన్ని పనులు చేసాడు. అవి అను నగలన్నీ అమ్మి ఆ డబ్బుతో ఆమెకు గవర్నమెంట్ జాబ్ ఇప్పించాడు.

అను చేరిన కంపెనీ చాలా మంచిది జీతం కూడా ఎక్కువే వస్తుంది. అను



వసంతగీతం

జీవితానికి ఒక అలంబన ఏర్పరచగలిగినందుకు అతనికి గర్వంగా ఉంది తనకు చేతనైనంత వరకూ ఒకరికి మేలు చేయడం అతని పాలసీ.

ఆ సాయంత్రం కంపెనీ వదలగానే అను కృష్ణ బ్యాంక్ దగ్గరకు వచ్చింది. ఇద్దరూ పబ్లిక్ గార్డెన్స్ వరకూ నడచుకుంటూ వచ్చారు. లోపలకు వెళ్ళి ప్రశాంతంగా ఉన్న చోటున కూర్చున్నారు.

"కంపెనీలో వర్క్ ఎలా ఉంది అను?" కృష్ణ ఆమెను ప్రశ్నించాడు.

"బాగుంది. గాలికి కొట్టుకుపోయి చిరిగి పులిస్తరాకుగా మారాల్సిన నా జీవితాన్ని ఒక చుక్కానికి చేర్చారు. మీకు జన్మంతా రుణపడి ఉంటాను" అను కళ్ళ నుండి నీళ్ళు కారిపోయాయి. కంఠం గద్గదమయింది.

"అర్రె, ఏమిటి కన్నీరెందుకు? కేవలం నా సాయంతో నే అంతా అయిపోలేదుగా! నీ తెలివి, నీ డబ్బు, నీ చదువే నీకు ఉపయోగపడ్డాయి." కృష్ణ ఆమెను ఓదారుస్తూ అన్నాడు.

"మీ సాయం లేకపోతే నేను ఎందుకు పనికివచ్చేదాన్ని ఈపాటికి ఏ దర్టీ బిచ్‌గానో మారాల్సి వచ్చేది."

"ప్లీజ్ జరిగింది వదిలేయి. దేవుని దయవల్ల నీకు అంతా మంచే జరిగింది మీ ఇంటికి లెటర్ వ్రాస్తావా? జాబ్ వచ్చాకా వ్రాస్తానని అన్నావుగా!"

"ఎప్పుడో నాకు బుద్ధి పుట్టినప్పుడు రాస్తానులెండి. అయినా వాళ్ళు నమ్మవద్దూ నన్ను."

"నీ ఇష్టం" అని వూరుకున్నాడు

"మీరు దసరాకు ఇంటికి వెళతానన్నారు.

"ఆ, అదే చెప్పాలనుకుంటున్నాను. రేపు నైట్ వెళతాను. పండగ రెండు రోజుల్లో ఉంది. పండగ వెళ్ళాకా నాలుగు రోజుల్లో వచ్చేస్తాను."

"అయితే మీరు మద్రాసు వెళ్ళరా?"

"ఛీ, ఇంకా నేనెందుకు? అమ్మ, వాళ్ళు వెళతారు."

"మీ పెళ్ళికి మంచి ప్రజెంటేషన్ ఇస్తాను" సరదాగా అంది.

"ఇవ్వు. నీ పెళ్ళికి నేనూ ఇస్తాను." తను హాస్యంగా అన్నాడు.


దాంతో అను మొహం వాడిపోయింది. ఏవో జ్ఞాపకాలు చుట్టుముట్టాయి.

"అనూ! అదేమిటి అలా అయిపోయావు" కంగారుగా అడిగాడు.

"నాకు పెళ్ళా?" నిర్లిప్తంగా చూసింది.

"ఏం ఎందుక్కాదు. ఇంతకంటే ఎక్కువ తప్పుచేసినవాళ్ళకు అవటంలేదా? నీకేం తక్కువ? అయినా నువ్వు ఒప్పుకుంటే టి. వి. షాప్ చందు బంగారంలా చేసుకుంటాడు" ఆవేశంగా అన్నాడు.

"అలా అని మీతో చెప్పాడా?" వెలవెలబోయింది. మొన్నటి వరకు అను పని చేసిన టి. వి. షాప్ ఓనర్ చందు అతడు యువకుడు. కృష్ణ ఫ్రెండ్. అతనికి తన షాప్‌లో పనిచేస్తున్న అనుపై మనసు ఉండేది. కానీ ఆమెలో ఏ స్పందనా లేకపోవడం గ్రహించి ఆమెతో అనలేదు. ఒకసారి కృష్ణతో అన్నాడు. అనుకు పెళ్ళాడే ఉద్దేశ్యం అంటే తానే ఆమెను పెళ్ళాడుతానని. అను మనసు గ్రహించిన కృష్ణ గప్‌చిప్‌గా ఊరుకున్నాడు. ఇప్పుడు సందర్భం వచ్చిందని అనుతో చెప్పేసాడు.



"కృష్ణగారూ! మీరే సాయం చేసినా నిస్సంకోచంగా తీసుకుంటాను. కానీ నా జీవితంలో ఏ మగవాడి పాత్ర ప్రవేశపెట్టే సాయం మాత్రం చేయాలని ప్రయత్నించకండి. అది ఈ జన్మలో జరగదు." కచ్చితంగా చెప్పింది.

కృష్ణ ఆమె మొహంలో సీరియస్‌నెస్ చూసి అల్లరిగా నవ్వేసాడు.

"అలాగే అనూ! నీకేదో సాయం చేసినంత మాత్రాన నేను నిన్ను శాసిస్తానని నువ్వు అనుకోవద్దు. నీ గతం ఏమిటో ని చేత చెప్పించగలిగానా? ఇదీ అంతే. ఇక ఆ ప్రసక్తి వదిలేయి!"" టాపిక్ అక్కడితో తుంచేసాడు.

* * *

కృష్ణ ఊరు వెళ్ళిపోయాడు. ఆ సంగతి అను కృష్ణ బ్యాంక్‌కు ఫోను చెసి కనుక్కుంది.

సాయింత్రం కంపెని అవగానే హాస్టల్‌కు వచ్చేసింది. పండుగ దగ్గరకు వచ్చేసింది కాబట్టి హాస్టల్‌లో అందరూ కొత్త చీరలు తెచ్చుకుంటున్నారు. కమల కూడా బజారుకు వెళ్ళటానికి సిద్ధంగా ఉంది. అను వస్తూనే అలసటగా మంచం మీద వాలిపోయింది.

"అను బజారుకు రాగలవా" కమల రిక్వెస్ట్ చేసింది. ఆమె అడగటంతో తీసిపారేయలేక పోయింది. తను లేచి గబగబా మొహం కడుక్కుంది." చీర మార్చుకునేలోగా కమల కిచెన్‌లోకి వెళ్ళి రెండు కప్పుల టీ తెచ్చింది. ఇద్దరూ తాగి బైటకు వచ్చారు. కమల ఆటో మాట్లాడింది. సుల్తాన్ బజార్‌లో నీలకంఠ స్టోర్స్‌లో కమలకు మంచి చీర తీసారు.

"నువ్వు తీసుకో అనూ."

"వద్దక్కా నాకు చాలా ఉన్నాయిగా!"

"అవన్నీ పాతవి."

"అయినా నా దగ్గర ఇప్పుడు డబ్బు లేదు." అను జంకింది. కొత్త జాబ్. వచ్చే నెల గానీ జీతం రాదు. కొద్దిగా డబ్బు ఉంది. దాంతో ఈ నెలంతా జరపాలి.

"డబ్బు నేనిస్తాను. నీ దగ్గర ఉన్నప్పుడు ఇవ్వు" అంటూ అను వారిస్తున్నా వినక కమల అనుకు చీర ప్యాక్ చేయించింది.

ఇద్దరూ బిల్ చెల్లించి బైటకు వస్తున్నారు.

"అనూ!" మగ కంఠం వినిపించింది. ఉలిక్కిపడి చూసింది. ఎదరుగా రాంబాబు నిలబడి ఉన్నాడు. అను గజగజా వణికిపోయింది.

"అనూ! నీతో మాట్లాడాలి ప్లీజ్!" బ్రతిమాలుతున్నట్టు అడిగాడు.

"అనూ ఎవరతను?" కమల అడిగింది.

"నాకు తెలిసినతను" అంటూ ధైర్యం తెచ్చుకుంది, జడుస్తూ ఉంటే మరీ బెదరాల్సి వస్తుందని.

"నీతో నాకు మాటలు ఏమీ లేవు" కచ్చితంగా చెప్పేసింది.

"అనూ! నీ కోసం మా వాళ్ళంతా వచ్చారు. నీ సంగతి నేను కూడా చెప్పలేకపోయాను. ప్లీజ్ అవాళ ఏదో ఆవేశంతో పొరపాటు చేయబోయాను."

అను అసహ్యంగా చూసింది. "రాంబాబూ! అప్పుడు నీ నిజ స్వరూపం తెలుసుకోలేక నీ గురించి నేను పొరపాటు పడ్డాను. ఇప్పుడలా జరగదు. మైండిట్!" అంటూ మరో మాట కవకాశం ఇవ్వక గబగబా ముందుకు నడిచింది. కమల అనును అనుసరించింది.

కఠినంగా జవాబు చెప్పి వచ్చిందే కానీ అసలే పిరికితనం ఎక్కువగా ఉన్న అను గుండె భయంతో అదురుతోంది. అతను తనని వెంటాడుతున్నాడేమో అని భయపడిపోతోంది.

"అనూ! ఎవరతను?" కమల మరోసారి అడిగింది.

"మా దూరపు బంధువుల అబ్బాయి" అబద్ధం చెప్పక తప్పలేదు.

"అసలు కథ ఏమిటో యు" కమల ఆరా తీసింది.

కృష్ణకే చెప్పనిది ఈమెకు ఎలా చెప్తుంది? అను నవ్వేసి ఊరుకుంది. కమల మరి రెట్టించలేదు.

కిసాన్ సమయాన్ని మీ పిల్లలతో ఎవరు పంచు కుంటారో ఊహించండి చూద్దాం

మిక్కీమౌస్, డొనాల్డ్‌డక్, విన్నీది పూ, గూఫీ, మీరు కొనే ప్రతీ స్క్వాష్ లేక క్రష్ బాటిల్‌తోబాటు, ఒకొక్క గ్లాసుమీద ఒక్కొక్కరు మీ కోసం ఉచితంగా వస్తున్నారు

కిసాన్ స్క్వాష్ మరియు క్రష్. అతి రుచికరమైన, మధురమైన పళ్ళనుండి చెయ్యబడ్డవి. మీకు సులభంగా. సుముఖానందాన్ని ఉల్లాసాన్ని ఇవ్వగల పానీయాలు చక్కెర వెయ్యనక్కరలేదు. క్షణాల్లో తయారు చెయ్యవచ్చు.

నిత్యం ఒక కిసాన్ బాటిల్ చేతికందుబాటులో ఉంచుకోండి. ఏ రకమైనా లేదా పూర్తి ఆరు రకాలూ కొని, మీ పిల్లల డిస్నీ స్నేహితుల్ని కూడా. ఇంటికి తీసుకెళ్ళండి.


కొత్త, రుచికరమైన పళ్ళనుండి చెయ్యబడ్డవి, సాధారణంగా కిసాన్‌వే మరి



ఉచితం

ప్రతీ బాటిల్‌తోబాటు





© 1983 Walt Disney Productions


స్క్వాషెస్ మరియు క్రషెస్


ఆరెంజ్, పైనాపిల్, లెమన్, గ్రేప్, మ్యాంగో, లెమన్ బర్లీ.

గ్లాసులు. ఆరెంజ్, రోస్ పైనాపిల్ మరియూ ఖుస్ సిరప్స్‌తోకూడా లభిస్తాయి.

ఈ పథకం స్టాకున్నంతవరకే ప్రతీ బాటిల్‌తోబాటు విక్రేత స్థలాల్లో మాత్రమే.

Kissan





వసంతగీతం

హాస్టల్‌కు వచ్చినా అను కడుపులో భయం తగ్గలేదు. సమయానికి కృష్ణ కూడా లేడే అనిపించింది. పండుగ రోజు కూడా సరదాగా ఉండలేకపోయింది.

కమల మాత్రం కొత్త చీర కట్టుకుంది అనుని కూడా కట్టుకోమంది. అను నిరాసక్తిగా ఉండిపోయింది

"నాకు అర్థం అయిందిలే నీ దిగులు?" కమల నవ్వింది.

"ఏమిటి అర్థం అయింది?" తెచ్చి పెట్టుకున్న ఉత్సాహం చూపిస్తూ అడిగింది అను.

"పాపం మీ కాబోయే శ్రీవారు రాలేదనా? కమల వెక్కిరించింది.

"కాబోయే శ్రీవారా! ఎవరూ?" అయోమయంగా చూసింది అను

"అబ్బ ఏం నటన! అదే నీ కోసం వచ్చే కృష్ణగారు. అతను రాలేదనే నువ్విలా ఉన్నావు అవునా?" చిలిపిగా చూసింది.

ఒక్క క్షణం అను మనసులో ఏదో తెలీని స్పందన కలిగింది. అంతలో తమాయించుకుంది.

"కమలా! అలా అని ఎప్పుడు అనుకోకు" సీరియస్‌గా అంది

'అమ్మో! ఎందుకమ్మా అంత కోపం?"

అను కోపాన్ని తగ్గించుకుంది "అక్కా! ఆయన నాకు గురువు లాంటి వారు అంతే కాదు ఆయనకు పెళ్ళి కుదిరిపోయింది. ఈ వేసవిలో వారి పెళ్ళి జరుగుతుంది."

"నిజమా?" కమల ఆశ్చర్యపోయింది.

"అతను నిన్ను చేసుకుంటాడని హాస్టల్‌లో అంతా అనుకుంటున్నారు. అందుకే అతను నిన్ను శ్రద్ధగా చూస్తున్నాడని సుమిత్రాదేవి కూడా అనుకుంటున్నారు" కమల చెప్పింది

"లేదు. ఎవరూ అలా అపోహ పడొద్దు ఆపదలో ఉన్న నాకు సాయం చేసారు అంతే. మా ఇద్దరి మధ్యా స్నేహం తప్ప మరొకటి లేదు."

"అది అందరూ నమ్మాలిగా" కమల నవ్వింది.

"అలా అయితే ఆయన్ని హాస్టల్‌కు రావద్దని చెప్పేస్తాను" మళ్ళీ సీరియస్‌ అయిపోయింది అను

"అంత పని చేయకు" కంగారుగా వారించింది కమల

"అనూ! నా జీవితమే పెద్ద అగాధం అనుకునే దాన్ని నీ జీవితం అంతకన్నా అగాధం అనిపిస్తోంది" కమలే మళ్ళీ అంది.

"నా జీవితం నీకే కాదు ఎవరికీ కొరుకుడు పడదు. నీ కిష్టమైతే నీ సంగతి చెప్పు" ఆర్ద్రంగా అడిగింది అను.

కమలకు గతం గుర్తు వచ్చింది. తెచ్చి పెట్టుకుంటున్న సంతోషం ఇగిరిపోయింది.

"వద్దు అనూ! నా జీవితం అంతా బాధలమయమే. నువ్వు వినలేవు" అంది

"ఫరవాలేదు నీ కిష్టమైతే చెప్పు లేదా మానెయ్యి "

"చెప్తాను" కమల కళ్ళు తుడుచుకుంది."పుట్టగానే అనాథను నేను. ఎవరో బంధువులు పెంచారు. నాకు చదువు బాగా వచ్చింది. అందంగా ఉండేదాన్ని నా అందం చూసి ఒక ఇంజనీరుగారు కట్నం లేకుండా చేసుకున్నాడు. కానీ అతడు శాడిస్ట్. పెళ్ళి అయిన రెండేళ్ళకే అతని శాడిజాన్ని భరించలేక జీవచ్ఛవాన్ని అయ్యాను. నాకు గర్భిణీ వచ్చింది. కానీ ఆయన శాడిజం ప్రభావం వల్ల అది కాస్తా విచ్ఛిన్నం అయింది. నేను పుట్టెడు కడుపు శోకంలో ఉంటే నన్ను పలకరించడానికి ఆయన బాస్, వారి భార్య వచ్చారు. ఆయనేమో తిన్నగా వెళ్ళక నా పొడుగు జుట్టును ప్రసంశించాడు దాంతో ఈ మనిషి సహించలేకపోయాడు. ఎంతో ప్రాణంగా పెంచుకున్న నా జుట్టు కత్తిరిస్తానంటూ కత్తెర తెచ్చాడు. నేను సహించలేకపోయాను. అతన్ని ప్రతిఘటించి ఆ కొంపలో నుండి శాశ్వతంగా బైటకు వచ్చేసాను. మళ్ళీ అతని ముఖం చూడలేదు. మా బంధువు ఒకాయన ఉద్యోగం ఇప్పించారు అప్పటి నుండి ఇలా ఇక్కడ ఉండిపోయాను" ముగించింది

కమల కథ వినగానే అను మనసు జాలితో నిండిపోయింది. "అక్కా! నీ మనసూ, శరీరం కూడా చాలా బాధ అనుభవించిందన్న మాట. నీ కంటే నేను చాలా నయం. కేవలం నా మనసు మాత్రమే చిత్రహింస పడింది. అంతే!" అంటూ కళ్ళు మూసుకుని పడుకుంది

కమల అను వేపు చూసింది అసలే సున్నితమైన అను మనసు ఎటువంటి చిత్రహింస అనుభవించిందో తెలుసుకోవాలనిపించింది. కాని అను మౌనం చూసి అడగలేకపోయింది

(ఇంకా ఉంది)

భారతీయులపై శోభరాజ్ అభిప్రాయం!

ఇటీవల తీహారు జైలు లోంచి ఎంచక్కా తప్పించుకు పోయిన ఛార్లెస్ శోభరాజు ఒకనాడు భారతీయుల మీద తన అమూల్య అభిప్రాయం ప్రకటిస్తూ డబ్బు కోసం భారతీయులు ఏ పనయినా చేస్తారు వారంటే నాకసహ్యం అన్నారట. ఆతడు తీహార్ జైల్లోంచి తప్పించుకున్నా దాని మీద పోలీసుల కధనం కాకమ్మ కథలా వున్నది. ప్రభుత్వం పూర్వాపరాలు ఆలోచించకుండా ఆ జైలు అధికారు లందర్నీ సస్పెండు చేసి వుండుండాలికదా!

శరీరానికి 'ఎ' విటమిను ఆవశ్యకత!

'ఎ' విటమినులోపం వల్ల చాలా రకాల, రకరకాల రోగాలు వస్తాయని అమెరికన్ వ్యవస్థలోని ఆరోగ్య సంస్థ అన్నదట ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా వంటి దేశాలలో యీ విటమిన్ లోపం వల్ల ఏటికి అయిదారు లక్షల మంది పిల్లలు గుడ్డివారయి పోతున్నారట శ్వాసకోశం, మూత్ర పిండాలు, ఉదర కోశంలోని జిగురు పొర చక్కగా వుండాల్సిన విధంగా వుండాలంటే యీ విటమినుతో శరీరానికి సత్ సంబంధాలుండాలట. ఈ విటమిను ఎక్కువగా ముదురు ఆకు పచ్చరంగు కాయ కూరలలోను, పళ్ళలోను వుంటుందట పసిపిల్లలకు యీ విటమిను స్తన్యం నుంచి దొరుకుతుందట–

ప్రియురాలి మోసం– ప్రియుని అస్త్రం!

ఫ్రాన్స్‌కు చెందిన జూలిస్ మొరొయిస్ అనే ఛాయా చిత్ర కారుడు తన స్టూడియోకు వచ్చి నగ్నంగా పోజులిచ్చే మోడల్‌గర్ల్ లిసెట్టి వెర్సల్ అనే అందాల భరిణెను పెళ్ళాడడానిగ్గాను డబ్బు చకచకా సంపాదించనారంభించాడట ఈ లోగా ఆ బుల్దెమ్మ ఓ ప్రభుత్వోద్యోగితో పెళ్ళి కుదిర్చేసుకుందట. జూలిస్ ఆమెను బ్రతిమాలినా, బామాలినా తర్ అన్నదట దాంతో అతగాడిక్కోపం వచ్చి ఆమె నగ్న సౌందర్యపు ఫొటోలన్నీ ఓ కట్టగా కట్టి "నేనెరిగిన నీ భార్య" అని పైన రాసి, ఆ బంగి పెళ్ళి కుమారుని కిచ్చి, అక్కడే విప్పి చూసుకునేలా చేశాడట. తత్ఫలితంగా ఆ వరుడు పెళ్ళిని రద్దు చేసుకు చక్కా పోయాడట మార్గాంతరం లేని ఆ పిల్ల యిహ "నీవే గతి నాకూ" అని అతని వద్దకు చేరిందట

ఫలించని ప్రయత్నం – జైలు ప్రాప్తం!

ఫ్రాన్స్‌కు చెందిన మెట్స్ నగర నివాసి ఆర్నాల్డ్ అనే అతను జీవితం మీద రోతపుట్టి నిద్ర మాత్రలని తన భార్య గర్భనిరోధానికి వాడే మాత్రలన్నీ గుటుక్కున మింగేశాడట మరోసారి ఆత్మహత్యా ప్రయత్నంలో వంట యింటిని దిగ్బంధం చేసి, గ్యాసువదిలేశాడట. చచ్చేలో పునా ఓ సిగరెట్టు కుతితీరేలా కాలుద్దామని తలచి దాన్ని వెలిగించే సరికి ఆ గ్యాసంటుకుని, డామ్మని తలుపు పగిలి, అతను ఆ వూపుకు బయట విసిరేయ బడ్డాడట. ఎన్నిసార్లు చావ యత్నించినా కుదరట్లేదే అని చింతించే లోగా పోలీసులు వచ్చి ఆత్మహత్యా ప్రయత్న నేరం మోపి ఆతన్ని అరెస్టు చేసి, తీసుకు పోయారట– జైలుకో! చచ్చాడన్న మాటే!

కూతుర్ని చంపి తల్లి ఆత్మహత్య!

గోపిచెట్టిపాలయం అనే వూరుకు చెందిన 45 ఏళ్ళ కాళియమ్మ అనే ఆవిడ తన భర్తను వొదిలేసి, 20 ఏళ్ళ కూతురు వళ్ళితో విడిగా వుండేదట. వళ్ళి అదే వూరుకు చెందిన ఓ కుర్రాడితో రహస్య ప్రేమాయణం పెట్టుకుని, రాత్రిళ్ళు తోటలో కామదాహం తీర్చుకొనేదట ఇది గమనించి ఆమె తల్లి ఆమెను హెచ్చరించి 24 ఏళ్ళ వెంకటసామి అనే అతనికిచ్చి వివాహం చేసిందట పెళ్ళయిన నాలుగో రోజు వెంకటసామి తన భార్యను పుట్టింట్లో వదిలి తానో వారంలో వస్తానని చెప్పి వెళ్ళాడట ఆ రాత్రి వళ్ళి తన ప్రియునితో కామక్రీడ సల్పి వస్తుండగా ఆమె తల్లి చూసి ఆవేశంతో ఆమె మెడలోని కొత్త పసుపుతాడునే వురితాడుగా మార్చి గొంతు బిగించి చంపి, తానూ నూతిలో పడి ఆత్మహత్య చేసుకున్నదట


351 రోజులకు చేరిన ఉత్తరం!

వెస్ట్ బెర్లిన్‌కు చెందిన లాండ్‌టగ్ అనే ఆయన 20 కిలో మీటర్ల దూరంలో వున్న "అంటర్‌బిలేసిమ్" అనే చోటుకు ఓ ఉత్తరం వ్రాసి మునిచ్ నుంచి పోస్టు చేస్తే ఆ వుత్తరం 351 రోజుల అనంతరం తిరిగి ఆయనకే చేరిందట. ఈ విషయం ఆయన పోస్టు శాఖామాత్యులకి ఫిర్యాదు చేసి వూరుకున్నాడట పైగలిగిందంతే కదా!

హాలండ్ కారాగారాల్లో క్రిక్కిరిసిన ఖైదీలు!

హాలండ్‌లో చిన్న చిన్న దొంగలకు కారాగార శిక్ష వేసినా, కారాగారాలలో ఖాళీగా చోటు లేనందు వల్ల పోలీసులు వారిని చివాట్లు పెట్టి వదిలేస్తున్నారట. పెద్ద జాతి దొంగలతో, బందిపోట్లతో, హంతకులతో, కిరాతకులతో అక్కడి జైళ్ళు క్రిక్కిరిసిపోయి వున్నాయట. □

బ్లెస్డ్ విత్ సన్



విపినమూర్తి

"సీతా బ్లెసెడ్ విత్ సన్. బోత్ ఆర్ సేఫ్"

టెలిగ్రాం వచ్చింది రామారావుకి–

అందుకున్న డిస్పాచ్ క్లర్క్ ద్వారా సమాచారం అందరికీ అందేసింది. 'పార్టీ పార్టీ' అంటూ రామారావు బల్లను చుట్టేసారు.

విషయం అర్థమవని రామారావు టెలిగ్రాం కాయితం తీసుకున్నాడు.

బుర్ర పైకెత్తిన అతని మొహంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. రెండు కళ్ళూ వర్షించబోయే మేఘాలయిపోయాయి.

బిత్తరపోయారు కొలీగ్స్.

రామారావు గబగబా టాయిలెట్స్‌వేపు నడిచాడు.

అయిదు నిమషాల తర్వాత తిరిగి వచ్చాడు. అంతా వాళ్ళ వాళ్ళ సీట్లకు వెళ్ళిపోయారు. మొహంకడుక్కొని తలదువ్వుకుని రుమాలు మడతల్లోని పౌడర్‌ను కాస్త అద్దుకుని మరి వచ్చాడు. అన్ని చేసినా అతని మొహంలోకి కళ తిరిగిరాలేదు.

గురువుల్ని పిలిచి స్వీట్స్‌కి, టీలకి డబ్బులు యిచ్చి పంపాడు.

మిఠాయి తీసుకుంటూ అభినందించిన ఆఫీసరు–

"సెలవు ఎప్పట్నుంచి కావాలోయ్ రామారావ్?"

"ఉత్తరం రావాలిసార్! వచ్చాక అప్లయ్ చేస్తాను....."

"లీవ్‌లెటర్ తర్వాత యివ్వొచ్చులే! సరాసరి పరుగెత్తి నర్సరిలో సీటుకి 'డొనేషన్ కట్టేసిరా!" అజోక్‌కి బలవంతంగా నవ్వాడు రామారావు.

రఘూ మురళీ గుర్నాధం అప్పటికే రామారావు ప్రవర్తన గురించి విన్నారు. మిఠాయిలు అందుకుంటూ రామారావు మొహాన్ని పరిశీలించారు. వాళ్ళ చూపుల్ని తప్పించుకుంటూ అక్కడి నుంచి కదిలాడు రామారావు.

గురూ! బయట వెయిట్ చేస్తాం! మమ్మల్ని కలవకుండా వెళ్ళిపోక" మురళి అన్నాడు.

5 పిఎమ్.

రామారావు ఎంతకి రాలేదు. ముగ్గురూ అతని సెక్షన్‌లోకి నడిచారు. కిటికీ రెక్కలను మూస్తున్న చప్పుడు ! ఫైళ్ళ దొంతర్ల మధ్య నిర్జనంగా ఉంది ఆఫీస్!

తన సీట్లోనే ఉన్నాడు రామారావు.

మురళి ముందుగా అతన్ని చేరుకున్నాడు. భుజం మీద పడ్డ చేతికి ఉలిక్కిపడ్డాడు రామారావు. కంగారుగా చేతిలో పర్సు మూసేసి జేబులోకి తోసేసాడు.

అప్పటికే అందులో ఫోటో మురళి కంట పడింది.

"ఏం జరిగింది రావ్! ఎందుకలా ఉన్నావూ?"

జవాబు లేదు. రామారావుతో బాటు అంతా బయటకు నడిచారు. నగరం వేలగొంతులతో అరుస్తూ లక్షకాళ్ళతో పరుగెడుతోంది.

రక రకాలుగా ప్రశ్నించి విసుగెత్తిన మిత్రులు మౌనం వహించారు.

సడన్‌గా రామారావే అన్నాడు- "అన్నట్టు గురూ! పిల్లలు పుట్టినపుడు మందు పోయించారుగా మీరంతా...."

"యిప్పుడా వూసు ఎవడెత్తాడో ...." రఘు.

"మీరడగాలేంటి? నా సంతోషం. నేనే యిచ్చుకుంటున్నా. వెనూ సంగతి చూడండి."

ఎవరూ ఉత్సాహం చూపించలేదు. రామారావు బలవంతంమీద 'సరే' అన్నారు. పోతే- వెనూ? ఇది వాళ్ళకి నిత్య సమస్య! వాళ్ళందరివి ఒంటి గది కాపురాలే! ప్రస్తుతం భార్యలంతా యిక్కడే ఉన్నారు. రామారావు ఒంటరిగానే ఉన్నా అతని ఇంటి యజమాని భార్యకన్నా ఎక్కువ! రాత్రి తొమ్మిదయితేచాలు-ఆయన 'అద్దె వాళ్ళ వాటాల్లో పంటిపిల్లు ఏడిచినా ఉగ్రనారసింహుడయిపోతాడు.

దానాదీనా గురునాధం అన్నాడు.

ఎప్పటికప్పుడు చెబ్దామనుకుంటాను - మన వెనూ సమస్యకి శాశ్వత పరిష్కారం దొరికిందిగానీ"

"ఏందిరా ఆ నసుగుడో? చెప్పేదేదో చెప్పిసావరాదా? ఇరవై రూపాయల డిఫెన్సు రమ్ముకి నలభై రూపాయల హోటలు గది మాత్రం కుదర్దో!" రఘు.

"కొండల్రావని.... ఎక్స్ సర్వీస్‌లే! పిల్లా పీచూ లేదు! తనూ పెళ్ళామే! గురు డెప్పుడూ అన్‌మిదే! ముసలావిడ మహా మంచిది! అరేంజ్‌మెంట్సన్నీ చేసిపెడుతుంది.....! ఆయనకి కంపెనీ గావాలి!"

"యిక్కడెప్పుడాంకి యింత నసుగుడేందిరా....?"

"తగ్గూ గురూ! కథ అక్కడితో అయిపోలేదు! గురుడు స్కీమ్ రోలర్! సినంతా తనే డామినేట్ చేసేస్తాడు.... మన మందు మన్ని తాగనీడు.... మన సావు మన్ని సావనీడు...."

"అడ్జస్టయిపోవాలి బిదరూ! తాగటానికి సోటిచ్చినాడు తండ్రితో సమానం...."

"షటప్!"

రామారావు అరుపుకి ముగ్గురూ నీళ్ళిమ్మలయిపోయారు. ఫుట్‌పాత్‌మీద నలుగురైదుగురు ఆగి తనని గమనించేసరికి రామారావు గాభరా పడుతూ..... అయామ్‌సారీ! అయామ్ సారీ రఘూ!" నడక అందుకున్నాడు. ఘుూ తేరుకున్న మురళి రెండంగల్లో అతన్ని సమీపించి-

"ఇట్సాల్‌రైట్! మనలో మనకేంటి? ఎందుకిలా అయిపోతున్నావ్?"

రామారావు అతని మాటలకు అడ్డుపడుతూ-

"నేనేం చెప్పలేను!.... నన్ను మన్నించండి! డ్రింక్ అయాక పడుకోడానికి చోటుంటుందీ అంటే..... ఎక్కడయినా నాకు అభ్యంతరం లేదు. ఏదైనా హోటల్లో రూమ్ చూడండి! అయామ్ ప్రిపేర్డ్! ఏమయినా.... ఈరోజు నాకు మందు కావాలి...."

విడిపోయేముందు ఏడు గంటలకు ఎక్కడ కలవాలో చెప్పాడు గురునాథం!

సన్నంగా పొడుగ్గా ఉన్నాడు కొండల్రావు. అయినా ఒకప్పుడు బలమైన మనిషిలా అవుపిస్తాడు అరవై ఏడేళ్ళ వాడిలా ఉండడు.

గ్లాసుల్లో నింపుతూ అన్నాడు కొండల్రావు–

"అయితే.... రామారావుకి కొడుకు పుట్టాడంటారు! యింకేం....? యీ రోజంతా అతనిదే! ఓయ్ యింటావిడా! నీకు మనవడుట్టేట్ట!పకోడీల్లో మరికాసిన్నిజీడి పలుకులు తగ్గించు..." అంటూ అదావుడి చేసాడు.

అప్పటికి రామారావుతన మూడ్సని కొంత స్వాధీన పరుచుకున్నాడు.కొద్దిగా సిగ్గుపడుతూ "మీరుపెద్దవాళ్ళు! మీలాంటి వాళ్ళతో యిలా కూచోడం...."

కొండల్రావు బిగ్గరగా నవ్వుతూ అతని భుజంమీద చరిచాడు.

"నువ్వెక్కడి మందు తీసుకోటం తప్పనుకుంటున్నావా...?"

"అహహఁ....అదికాదాసర్...."

"చూడు బాబూ! యిది పుచ్చుకోటం తప్పయితే చిన్నాళ్ళతో తీసుకున్నా తప్పే పెద్దాళ్ళతో తీసుకున్నా తప్పే!అసలు తప్పు అనుకునేది చెయ్యరాదు. చేసేది తప్పు అనుకోరాదు. ప్రపంచం పట్ల హిపోక్రటిక్‌జెటిలుక్ ఉండకూడదు.

"మీరు.... పెద్దవారు...."మళ్ళీ నసిగాడు.

"ఏంటిపై –పెద్దరికం? అనుభవాన్ని పంచుకోడమే పెద్దరికం! నాకొడుకులతో నేను లైంగిక విషయాలు కూడా మాట్లాడతాను..."

"వాడంతేలెండిసార్...కుర్రాడు..."తెలిషి తక్కువగా సర్దబోయాడుగుర్నాథం.

"నాకు తెల్సులేవో ముసిలాడా!" భిగ్గరగా నవ్వుతూ గ్లాసులు అందించి "–ఛీర్స్!ఫర్‌ది హెల్త్ ఆఫ్ రామారావ్స్ సన్!"అన్నాడుకొండల్రావు.

పెద్దావిడ జీడిపప్పు పకోడీ ప్లేట్లు తెచ్చేసరికి మొదటి రౌండ్ అయిపోయింది. రామారావు వేగంగా తీసుకోడాన్ని గమనిస్తున్న మురళి తనూ ఫాస్టవకూడదనుకున్నాడు.

గుర్నాథం మాటలు వాస్తవమే! కొండల్రావు ఎవ్వరికీ చోటివ్వడం లేదు. రఘూకి మందు ముఖ్యంగాని మాటలు కాదు. గుర్నాధానికి తనే నేతృత్వం వహించాలని ఉంటుంది. ఆ పని ముసిలాయన చెయ్యడం అతనికే ఇబ్బందిగా ఉంది. తాగిందంతా తన్నుకు బయటకు వచ్చేస్తున్నట్టనిపిస్తోంది - నీ బొంద నీకేం తెలుసాయ్!- అనే ముసిలాయన ధోరణికి-! రామారావుకి మురళికి ముసిలాయన అధికంగా మాట్లాడుతున్నా అర్థ రహితంగా మాట్లాడుతున్నట్టు లేదు.

అందరూ 'మూడు' మొదలెడుతూంథగానే రామారావు నాలుగు 'రా'గానే ముగించేసాడు. లేచి నిలబడ్డాడు.

"కొండల్రావుగారూ! మీరు నా తండ్రయితే ఎంత బాగుండేదీ...."

మనిషి కొద్దిగా తూలుతున్నాడు. గభాలున వంగి కొండల్రావు కాళ్ళు చుట్టేసాడు..... అతను భుజాలు పట్టుకుని లేపబోతె-

"డోంట్టచ్‌మి....!" గట్టిగా కాళ్ళు పట్టేసి కళ్ళు మూసేసాడు.

"ఏం జరిగింది రామారావ్?" మురళి లేచి భుజంమీద చెయ్యేసాడు.

"షటప్! నోరెత్తారా వాయించగల్ను! లెట్ మి టాక్! క్షమించండి సార్! మిమ్మల్నికాదు నేను. షటప్..... అంట!"

ఊగిపోతూ లేచి నించుని...." నాన్నగారూ!జీవితమంతా నాకు దారి చూపనక్కర్లేదు.... ఇప్పుడు చూపించండి."

తన కుర్చీలో కూర్చున్నాడు.

అతనికి ప్రపంచం తిరుగుతున్నట్టుంది. విశాలంగా ఉన్న గది చిన్నదైపోయింది. భరించరాని దుఃఖాన్ని మూపుమీద మోసుకుని పరుగెత్తి అలసిపోయిన గుర్రాల డెక్కల చప్పుడులా వస్తున్నాయి మాటలు-

"నేను హంతకుణ్ని! పాపాత్ముణ్ని! ఈరోజు కాపోతే రేపు..... రేపు కాపోతే ఎల్లుండి.... యిక్కడ కాపోతే అక్కడ..... అక్కడ కాపోతే యిక్కడైనా (గుండెలమీద కొట్టుకుంటూ) నేను నిజం ఒప్పుకోక తప్పదు! నా నేరానికి నాకు శిక్ష తప్పదు! నాకు పుట్టిన కొడుకే నన్ను శిక్షిస్తాడు! అయినాసరే.... నేను ఆయన్ని ద్వేషిస్తాను..... ద్వేషం నా రక్తంలో జీర్ణించుకుపోయింది.... డ్రగ్ ఎడిక్ట్ డ్రగ్ లేకుండా నడవలేనట్టే నేను ఈ ద్వేషాన్ని నిత్యమూ సేవించకుండా జీవించలేనండి కొండల్రావు నాన్నగారూ!"

రెండు చేతులూ ఓదాన్తో ఒకటి కొట్టుకుంటూ జుట్టు పీక్కుంటూంటే మురళి లేచి ఆపబోయాడు. కొండల్రావు సైగతో వారించాడు.

"యస్! నేను చెప్పేస్తాను! మీరే నా జడ్జి! నా ద్వేషం తప్పా? నే చేసింది హత్యే కావచ్చు! చంపింది చంపాల్సినంత కర్కోటకుణ్నేనని మీరు తీర్పివ్వాలి...."

ఆరోజు నాకు బాగా గుర్తు-

ఏడాది వయసు పెంచి నన్ను బళ్ళో వేసాడు మా నాన్న. ఆటలపిరీడు. నేను కింద పడ్డాను. బట్టలనిండా దుమ్ము. మోచేతిమించి రక్తం. ఉక్రోషంతో లేచాను. నన్ను తోసినవాడు ఫెల్టు పట్టుకున్నాను. వాడు విదిలించుకున్నాడు. చొక్కా చిరిగిపోయింది. వాడు పరుగెత్తాడు. చీకటి పడేదాకా ఆకలేసేదాకా నేను యింటికి వెళ్ళలేదు.

రోజూ లెక్క ప్రకారం పదయిదాకా నాన్న రాడు. అప్పుడు నేను పుస్తకాలు మూసి సంచీలో పెడతాను. నన్ను నాలుగ్గంటలకు లేపుతాడు. పలకా పుస్తకం ముందెట్టుకుని జోగుతాను. వచ్చి తడతడా వాయిస్తాడు - అలాటి నాన్న యింకా రాడులే అనుకున్నాను. యింటి ముహం పట్టాను. అమ్మ కొట్టదు. కొట్టేట్టు అరుస్తుందంతే!

వీధి వరండాలోంచి చూసాను. చెల్లి ఉయ్యాలలో నిద్రోతోంది.

/దొంగలా అడుగులో అడుగులేసుకుంటూ /నడిచాను. పడక్కుర్చీలో నాన్న!

అరేయ్ రామూ!"

వణుకొస్తోంది. బొమ్మలా వెళ్ళి ముందు నించున్నాను.

"సన్యాసమ్మ కొడుకు చొక్కా చించేసావు!"

నోట మాట లేదు. తల కూడా కదలటం లేదు.

"పలకాపుల్లా పట్రా!"

సెకన్లో తెచ్చాను.

"అక్షరాలన్నీ రాయి!"

రాసేస్తున్నాను. భయంతో పరుగులు పెట్టుకుంటూ జ్ఞాపకంలోంచి పుల్ల ద్వారా పలకమీద పోగు పడుతున్నాయి అక్షరాలు.

"అయిందా?"

బుర్ర "ఊపాలనే" ఉంది. ఊగటంలేదు. కళ్ళు కదపాలనే ఉంది. కదలటం లేదు.

"యిలాతే!"

పలక ఆయన చేతిలో ఉంది. ఆయన చూపులు అక్షరాలమీద ఉన్నాయి. కింద ఉంచాడు. లేచాడు. నించున్నాడు. బనీను జేబులోంచి చుట్ట తీసాడు. నోట్లో పెట్టాడు. పెట్టె తీసాడు. పుల్ల గీసాడు. రెండు దమ్ములు పీల్చాడు. లావాటి చుట్ట భగభగా మండుతోంది. ప్రపంచమంతా ఆ మంటే!భగభగా....!

"ఋ" ఎలా రాయాల్రా?"

ఖాళీ పలక నా ముందు ది. దానిమీద పుల్ల వజవజా ఫణుకుతోంది.

ఇప్పటికి ఎప్పటికి 'ఋ'కి ఎన్ని కొమ్ములివ్వాలో నాకు తెలీదు. ఆ క్షణంలో ఎన్నిచ్చానో నాకు తెలీదు.

"అలు అలూలు రాయరా–"

అవ్వి తెలుగు భాషలో ఎందుకు ఎవరు పెట్టారో నాకు తెలీదు. వాళ్ళకి నామీద ఏదో అకారణ వైరం ఉండి తీరాలి.

పలకని అందుకుని పచార్లు మొదలెట్టాడు. చివరకి దాన్ని టేబిల్‌మీద ఉంచాడు. మరోమారు చుట్ట పీల్చి నాదగ్గరకు వచ్చాడు.

"తెలుగు బాషకి వర్ణాలు ఏభయ్యారు. నువ్వు స్కూల్లో చేరి సరిగ్గాయీరోజుకి యాభయ్యారు. నీకు మూడు అక్షరాలు రాలేదు–" అంటూ ఆగి–

"నువ్వు సన్యాసమ్మ కొడుకుని కొట్టావనుకో! వాడు నిన్ను కొడతాడు!కరిచావనుకో–కరుస్తాడు! గిల్లుతావనుకో- గుచ్చేస్తాడు!చొక్కా చించావనుకో- వాడూ నీ చొక్కా చించుతాడు!వాడి చొక్కాకి డబ్బు లిచ్చేస్తాను! నీకు కుట్టిస్తాను!అందుకు డబ్బులు చాలకపోతే మరిన్ని పద్దులు రాస్తాను! రాత్రిం బవళ్ళు పని చేస్తాను! కానీ–

రోజుకి ఓ అక్షరం చొప్పున కనీసం ఓ అక్షరం చొప్పునైనా యీపాటికి నువ్వు నేర్చి ఉండాల్సింది - నీకు మూడు అక్షరాలు రాలెదు - మూ.. ..డు... "

నా ఎడమ చేయి తన చేతిలోకి తీసుకున్నాడు. అది కర్కశంగా ఉంది. అయినా వదులుగానే పట్టుకుంది. చేతిని వెనక్కి తిప్పాడు.

"సరిగ్గా మూడు గంటలలో ఆ మూడు అక్షరాలూ రాసిస్తే సరే! లేకపోతే కుడి చేతిమీద కూడా యిలాగే-"

అమ్మా!

అమ్మా! అమ్మా!!!

రెండు చేతులూ జాచి రామారావు చూపిస్తూ అరిచాడు.

"చూడండి! కొండల్రావుగారూ! బాగా చూడండి! యివి యివి నా అయిదో ఏట మా నాన్న యిచ్చిన కానుకలు!"

రెండు చేతులమీదా కాలిన మచ్చలు!!

4

భయానకమయిన నిశ్శబ్దం!

ఫాను చప్పుడు ఆ నిశ్శబ్దానికి అండర్‌లైన్ చేస్తోంది! ముసిలావిడ రామారావు అరుపులికి లోపల్నుంచి వచ్చి ఓ కుర్చీలో కాస్త దూరంగా కూర్చుంది.

"అలా పడింది ద్వేషానికి బీజం నాలో!

"అల్లరి చెయ్యటం వాడి హక్కే! నేను ఒప్పు-కుంటున్నాను. నేర్చుకోటం వాడి బాధ్యత! అది వాడు గుర్తించాలి! వాడు గుర్తించక పోతే గుర్తుంచుకునేట్టు నేను చేస్తాను!చేసి తీరతాను!"

అంటూ మా అమ్మ తండ్రితో స్పష్టం చేశాడు మా నాన్న!

ఇది నా తొమ్మిదో ఏట!

స్కూల్లో ఫస్ట్ మార్కు రావాలి! ఇది ఆయన నిర్దేశించిన లక్ష్యం!

నా అదృష్టంకొద్దీ అది దుంపల బడి! మేకల మందల్లాంటి పిల్లలు! హాజరుకి పేర్లు చదవటానికే టీచర్లకి సమయం సరిపోయేది! సగానికిపైగా పిల్లలకి ఒంటిమీద గుడ్డలు ఉండేవికావు. పెద్ద పొట్టలు - ఈనుబుల్లల్లాంటి కాళ్ళు - గుళ్ళుతో కొంతమంది అస్తమానూ ఏడస్తుండే వాళ్ళు! చింపిరిజుట్లుల్తో ఆడపిల్లలు పేలు తీసుకునే-వాళ్ళు! సగం క్లాసుకయినా సరిపోయేవికావు నేల బల్లలు! బట్టలు వేసుకునేవాళ్ళు బల్లలమీదా లేనివాళ్ళని నేలమీదా కూర్చోబెట్టేవాళ్ళు! అలాంటి-చోట ఏ వృక్షమూ లేనిచోట మహా వృక్షంలా ఉండే-వాడిని! నా రోజు బాగోలేదు- కొత్తగా బదిలీ అయివచ్చిన మాస్టారికి డ్రాయింగ్ వచ్చు!

మన చుట్టూ ఉండే రంగుల్ని, పిట్టల వంపుల్ని, చెట్ల గుంపుల్ని, రోజుకి ఓ వేషం కట్టే చంద్రుణ్ణి, కొండల్ని - మన ఎదురుగా ఉండే చిన్నారి తెల్ల కాగితంపైకి లాక్కొచ్చి బంది చేయటంలో ఎంత గమ్మత్తు! ఎంత తమాషా! ఎంత అద్భుతం!!

మా తాతగారు వచ్చినప్పుడు నా పిచ్చి బొమ్మల్ని తెగ మెచ్చుకున్నారు!" అది విన్న అమ్మ ఎందుకూ కొరగాని కొడుకు ఎంతో గొప్పవాడని తెల్సినట్టు పొంగిపోయింది! అప్పటికప్పుడు రంగుల పెట్టె కొని యిచ్చారు.

దాన్ని చూసాక మా నాన్న పెదాలు బిగించాడు. వణికిపోతూనే అమ్మ నన్ను దగ్గరకి తీసుకుంది.

"మీ రిచ్చారా వాడికాపెట్టె?"

"తప్పేముంది....?"

"పెద్దవాళ్ళు దన్నిచ్చి పిల్లలకి అల్లరి మప్పుతారన్నమాట-"

"ఇందులో అల్లరేముంది-? సరదా-"

"చదువు-తిండి పెట్టే చదువు తప్ప-మరేదయినాసరే- దానికి భంగం కలిగించేది అల్లరే. ముమ్మాటికీ అల్లరే!"

"పోనీ-అల్లరే అనుకుందాం! పిల్లలు చెయ్యక పోతే నువ్వూ నేనూ చేస్తామా?"

కొంతసేపటిదాకా మాట్లాడలేదు నాన్న!

మాట్లాడినంతసేపూ నాకు కొంత నయమే! మాట్లాడుతూ మధ్యలో ఆపాడా..... నాకు పాంటు తడిసిపోవాల్సిందే! నిద్రలో తడిసిపోయే అలవాటు యీమధ్యవరకూ ఉండేది నాకు.

"సరే! వాడు అల్లరి చెయ్యొచ్చు! కాని వాడికి ఈఏడు కూడా స్కూల్లో ఫస్ట్ మార్కు రావాలి! వచ్చి తీరాలి!"-"


బదిలీ అయివచ్చిన మాస్టారి అబ్బాయి నిస్సందేహంగా నాకన్నా తెలివైనవాడు! పైగా కొన్నాళ్ళు కాన్వెంట్‌లో చదివాడు. వాక్యాలను వాక్యాలుగా గుర్తించుకొని వెలువరించటమే నాకు చేతనయితే- వాక్య నిర్మాణం కూడా వాడికి అప్పటికే చేతనయింది. నాకన్నా వాడికి మొత్తంమీద అయిదు మార్కులు ఎక్కువ వచ్చాయి.

స్కూల్లో మార్కులు తెలుసుకున్నాక నేను అటునుంచి అటే మా తాతగారి ఊరు బస్సు ఎక్కేసాను. ఆ రాత్రి తొమ్మిదికి ఆఖరు బస్సులో దిగాడు మా నాన్న. నిద్రలోంచి లేచి కూర్చున్నాను.

"పిల్లల హక్కు అల్లరి అని మీరు వాదించారు. అమలు చేసారు. పన్నెండు గంటలకు మీ యింటికి వచ్చిన కుర్రాణ్ణి తిరిగి తీసుకొచ్చి నాకు అప్పజెప్పటం మీ బాధ్యత. దాన్ని మీరు గుర్తించ లేదు. ఆ క్షణంలోనే మీకూ నాకూ బంధుత్వం తెగిపోయింది. మీ గడప యికపై నేను మెట్టను! మీరు నా గడప మెట్టినా భార్యతో మాట్లాడితే- అది తిరిగి మీ కూతురు అయిపోతుంది!పదరా రామూ!"

నన్ను తీసుకు ఎనిమిది మైళ్ళు నడిచాడు! నేను నడవలేకపోతే భుజంమీద ఉంచుకుని మోసాడు. లారీ పట్టుకుని రాత్రి రెండయిసరికి ఇంటికి చేరాం!

"రోజు రోజుకి పోటీ పెరిగిపోతోంది. మెడిసన్‌కి, ఇంజనీరింగ్‌కి ఆఖరుకి పోలిటెక్నిక్, ఐ.టి.ఐ. కి లక్షలక్షల మంది నీలాంటి కుర్రాళ్ళ పోటీ! అక్షరం ముక్క వస్తే బ్రతికేయొచ్చనే రోజులు పోయాయి.



ఫస్ట్‌లో ఉండకపోతే బతుకులేదు కల్లర్ ఇన్‌స్టింక్ట్‌తో పెరగాలి నీలో కల్లర్ ఇన్‌స్టింక్ట్ లేకపోతే నువ్వు బ్రతకలేవు. నీకు అల్లరిమ్మింది మనసు మళ్లాలి. అన్నిటికి యిదొక్కటే మార్గం"

చొక్కా ఎత్తి వీపు చూపించాడు రామారావు.

"మా తాతగారు పోయినప్పుడు అమ్మను పక్షణ పట్టనలేదు నాన్న.

అలా నాలో ద్వేషం మొక్కయింది.

పియూసీలో మార్కులతో ఎంసెట్లో కూడా సీటు సంపాదించుకోలేనప్పుడు యిచ్చిన ట్రీట్‌మెంట్‌తో ఆ ద్వేషం మహా వృక్షమయింది

చివరికి నేను సైన్స్‌లో డిగ్రీ తీసుకున్నాను

5

ఇంటర్వ్యూకి హైదరాబాదు వెళ్లాలి. జీవితంలో తొలి ఇంటర్వ్యూ, మొట్ట మొదటి సారిగా ఒంటరి ప్రయాణం. ఆ రాత్రి నాన్న పిలిచాడు.

"రేపు నువ్వు ట్రెయిన్ ఎక్కుతున్నావ్.. ."

"అవునండి!" తల ఎత్తకుండానే అన్నాను.

"ట్రైన్ దిగుతావు. ఇంటర్వ్యూకి వెళ్ళేలోపున నువ్వు చేసే పనులు రెండే! ఒకటి చదువు ... రెండు చదువు.....! కసి.... కల్లర్ ఇన్‌స్టింక్ట్‌తో చదవాలి. సెలక్టయి తీరాలి. రాజ్యం వీరభోజ్యం...."

పందెం కోడిని దువ్వుతున్నాడు నాన్న.

ట్రైన్ ప్లాట్‌ఫారంని విడిచిపెట్టేవరకూ ఒకటే మంత్రం.... సెలక్టయి తీరాలి..... చదవాలి.

బ్లెస్‌డ్ విత్ సన్

మహానగరంలో కాలు పెట్టాను.

మరో లోకంలోకి అడుగుపెట్టాను! అతి విలువయిన సాయంకాలం యిది! నాకు కావల్సింది హాయిగా తినొచ్చు! చూడాలనుకున్నది నిర్భయంగా చూడొచ్చు!

హోటల్లో రూమ్ తలుపులు బిగించాను

నన్ను ఖైదు చేసిన సెల్‌కి ఎటునుంచో ఓ కాస్తంత వెలుతురు వచ్చే కంత పడినట్టుంది. మంచంమీద మెత్తటి పరుపుమీద దొర్లెయ్యాలని...... గెంతులు వెయ్యాలని .. కేకలు పెట్టాలని ... ఎదురొచ్చిన ప్రతి వాడిమీదకూ ఎగిరి ఎగిరి ఎదురొమ్ముమీద తన్నెయ్యాలని

టవల్ తీసుకుని బాత్రూంలోకి నడిచాను.

అద్దం! అద్దంలో రామారావు! లుంగి రామారావు! గుండెలమీద వీపుమీద వెంట్రుకల రామారావు! కండల రామారావు! పుష్టిగా భుజాలతో రామారావు!

"ఎవరో నా ప్రతి వెంట్రుకా పట్టి లాగుతున్నారు.

ఆకలిగా ఉంది. రాత్రి 12 అయింది. టవలూ లుంగి అలాగే ఉన్నాయి. అప్పటిదాకా జనరల్ నాలెడ్జి బుక్కు బట్టీ వేస్తున్నానా....??? ఎందుకూ.....? ఎవరు నన్నిలా శాసిస్తున్నారూ.....? బంధిస్తున్నారూ.....? తిండి తినకుండా..... ఏంటిది?

చేతిలో పుస్తకం గిరాటేసాను

అది నా చేతి నుంచి దూరం కాలేదు అతుక్కుపోయి వుంది దాన్ని తోసేశాక నాకు ఏమ మళ్ళీ చదూతున్నాను

తెల్లారింది.

రాత్రంతా మెలకువగా ఉన్నా భోజనం లేకున్నా బడలిక లేదు! జీవితం అంతా సంకెళ్ళలో ఉన్న మనిషికి సంకెళ్ళు విప్పి వదిలేస్తే... కమ్మరి దగ్గరకుపోయి వాటిని చేయించుకుని వేయించుకుని నిద్రపోయి లేచినంత హాయిగా ఉంది.

నా అదృష్టం!

నా ప్రమేయం ఉందో! లేదో!! నేను సెలక్టయాను. కావాలంటే మర్నాడే జాయినవచ్చు-అన్నారు.


పోస్టాఫీసుకు పరుగెత్తాను! "సెలక్టెడ్" అంటూ నాన్న చెప్పినట్టు టెలిగ్రాం యిచ్చాను.


రూమ్‌కి చేరుకున్నాను తలుపులు మూసుకున్నాను.

మంచంమీద వాలిపోయాను. జీవితమంతా తిండి తిననంత నిస్సత్తువ! పడని పదార్థంతో ఎక్కించిన మందంతా బయటకు వచ్చినట్టు దుఃఖం! నే చదూకున్నది నా చదువు కాదు! ఇంటర్వ్యూను ఫేస్ చేసింది నేను కాదు. సెలక్టయింది నేను కాదు! నేను నేనుకాదు! జీవితంలో యింక నేను,నేనయ్యే అవకాశం లేదు!

కళ్ళు తెరిచేసరికి గదంతా చీకటి!

లైట్! బాత్రూం అద్దం ముందు నేను! అద్దంలో నాన్న చెయ్యి బైటకు వచ్చి "శహభాష్, మైడియర్





కిల్లర్!" అంటూ భుజం తడుతోంది!

నోరు తెరిచాను! వికృతంగా పొడుచుకొచ్చినట్టు నాన్న పళ్ళు! చేత్తో అద్దం చెరిపేసాను! నా కళ్ళు! నా కళ్ళే! మానవ సహజమైన ఆలోచనలులేని క్రూరమైన జంతువుల కళ్ళు! అ క్రూరత్వం విపరీతమైన భయం నుంచి పుట్టినది! సృష్టిలో ఏ జంతువూ చంపాలని చంపదుట! తను చచ్చిపోతానేమోననే చంపుతుందట! డెస్పరేషన్ లీడ్స్ టు కిల్లింగ్!

సర్కస్ జంతువుకి పారిపోయే అవకాశం ఒకే ఒకమారే వసు ంది!

ఇంతకాలం నన్ను ఆదేశించిన నాన్న ముందు నేను నోరు విప్పలేదు! ఇప్పుడీ మెదడుతో నేను వాదించను! అది చేయాలనుకున్నది చేసెయ్యని! నేను నోరు విప్పను!

క్షణాలలో బట్టలు తగిలించుకున్నాను. పోస్టాఫీస్‌లో ఉన్నాను

టెలిగ్రాం ఫారంనాన్న శరీరంలా కనిపిస్తోంది చేతిలో పెన్ను కత్తిలా ఉంది ఒక్కో అక్షరమూ అతన్ని చీల్చేయటానికి ఉరుకుతోంది నా విడుదల జెండా రెపరెపల్లా ఉన్నాయి అక్షరాలు!

"యువర్ సన్ డైడ్ యిన్ ఆక్సిడెంట్! హైదరాబాద్ పోలీస్"

6

వింటూన్న వాళ్ళు నిశ్చేష్టులయిపోయారు రఘు, గుర్నాథం నిద్రలోకి జారుకున్నారు.

"వారం రోజులు హాయిగా నిద్రపోయాను. ఓ కొటీగ్ రూమ్‌లో చిక్కడపల్లిలో చేరాను నాన్న నా గురించి ఎంక్వైరీకి ఏ క్షణాన్నయినా ఆఫీసుకు రావచ్చని అదుర్దా భయం! వస్తే - "నాకేం తెలీదు! నేనిచ్చిన టెలిగ్రాంలో జాబ్‌లో జాయినయానని - వీలు చూచుకొని సెలవు మీద వస్తానని రాసాను -" అని చెప్పాలని రిహార్సల్స్ వేసుకుంటూనే ఉన్నాను

పది రోజులయింది అమ్మ పదే పదే ఏడుస్తున్నట్టు ఎలుస్తున్నట్టు . " సెలవు పెట్టి బయల్దేరాను

ఆత్మహత్య చేసుకున్న నాన్నకి అపరకర్మలు జరుగుతున్నాయి! ఆ రోజుకి అది అయిదో రోజు!

కటుంబ భారాన్ని నెత్తి మీద వేసుకున్నాను

ఈదుతున్నాను! కాని అద్దం ముందు ఒంటిగా నించుంటే . రాత్రివేళ చీకట్లోకి చూస్తుంటే కేకలు! అరుపులు! నాన్నా! నాన్నా!

ఆ టెలిగ్రాం నేనే యిచ్చానన్న రహస్యం క్రమంగా నాలోనే ఉండిపోయింది నేనల్లిన కథే అందరికి మిగిలిపోయింది తంతి శాఖవారి పొరపాట్లలోకి ఈ నేరం నెట్టివేయబడింది

పెళ్ళయింది సిత గర్భవతి అయింది వెయ్యిన్నొక్క దేవుళ్ళకు మొక్కాను. - దేవతలారా! నాకు కొడుకును ప్రసాదించకండి - అని!

నాలో ద్వేషం నా మనస్తత్వాన్ని విపరీతంగా మార్చేసింది నా రాక్షస చర్యలకు నేను సాక్షినే గాని కర్తను కాలేకపోయాను. భయం! మా నాన్న నాకు కొడుకుగా పుడతాడు నన్ను చంపటానికే పుడతాడు!ఇది జన్మ జన్మల వైరం! యుగయుగాల శతృత్వం!వాడిని మానసికంగా చంపేసినంత కాలమే నేను బతికుంటాను. నా బానిసగా ఉంచుకున్నంత కాలమే - డబ్బులిచ్చే రాబోట్‌లా మలచుకుంటేనే -అందుకు చదివే యంత్రంలా మార్చేస్తేనే నాకు భద్రత! అసలు వాడు పుట్టకుండా ఉంటేనే నా భద్రత! సీతకు నన్ను చూస్తే వణుకు! గర్భం ధరించిన దగ్గరనుంచి అది చిత్రవధ అనుభవించింది! తెగేసి చెప్పాను - "నువ్వు కొడుకుని కన్నావా! జాగ్రత్త!"

చెప్పండి! తీర్పివ్వండి! నేను చేసింది హత్యేనా? నేను చంపింది - నన్ను యిరవై రెండేళ్ళు చంపిన నాన్ననా? నే చచ్చిపోయానన్న వార్త విని గుండె పగిలి చనిపోయేటంత ప్రేమగల నాన్ననా"

ఈ మనస్తత్వంతో నేను నా కొడుకుని నా చిన్నారి తండ్రిని నా పసిడి బుగ్గల బాబుని ప్రేమించగలనా" ఈ బుల్లి బుల్లి వేళ్ళు నా వేళ్ళను బిగించుతుంటె అవి అందించే ఆనందాన్ని అందుకోగలనా" ఆ లేత కాళ్ళు నా గుండెల మీద తంతూంటె

ఆ పిడికిళ్ళు చప్పిడి గుద్దులు గుద్దితే భయంతో నేను జంతువు కాకుండా ఉండగలనా" -

మాట్లాడుతున్న రామారావు గబాలున లేచి కొండల్రావు కాళ్ళ మీద పడి పిచ్చిగా తల వూపుతూ - "నేను మీలాంటి తండ్రిగా ఉండగలనా?" అంటూ అరుస్తున్నాడు

'రామారావ్! నీ తప్పేంలేదు. .నువ్వు హత్య చేయలేదు పడుకో పడుకో!' అంటూ -

అక్కడే తివాసి మీదే రామారావుని పడుకోబెట్టి జోకొట్టాడు కొండల్రావు వెంటనే రామారావు నిద్రపోయాడు

అతని జేబులోంచి జారి పడిన పర్సుని మురళికి అందించాడు కొండల్రావు

అది అందుకుని పెద్దగా నిట్టూర్చాడుమురళి దాన్ని తెరచి అందులో ఫోటో వేపు ఓ మారు చూసి - "ఇది రామారావు తండ్రిగారి ఫోటో అయివుండాలి-

దాన్ని చూసి ఆశ్చర్యపోయాడు కొండల్రావు

"వీడు వెంకట్రావుగాడు " అప్రయత్నంగా అన్నాడు

"ఈయన మీకు బాగా తెల్సా?"

కొంతసేపటి వరకూ కొండల్రావు మాట్లాడలేదు -

"వీడు నేనూ మిత్రులమెలా అయామో!" వాడు మితభాషి! నేను డబ్బా! నా చుట్టూ పదిమంది వుంటే వాడెప్పుడూ ఒంటరి. కాలేజీలో వాడికి నేనొకణ్ణే ఫ్రెండ్‌ని. మా చదువులు అయాక మూడుసార్లే కలుసుకున్నాం నేను ఆర్మీలో జాయినయాను. అయితే మా ఉత్తరాల సంబంధం తెగిపోలేదు చిత్రంగా - 'ఉత్తరాలలో వాడు డబ్బా - నేను

ఇ·వేమన·పద్యాలు



పుట్టలో నె తేనె పుట్టిన రీతిని
గట్టుమీద మణియు గట్టు విధము
కట్టెలోన నగ్ని పుట్టిన విధమున
పెట్టి పుట్టవలయు భువిని వేమ

మితబాషని! ఆత్మహత్య చేసుకొనే ముందు కూడా వాడు నాకు ఉత్తరం రాసాడు .'

'రాకు! రాకు నాన్నా!' అంటూ బుర్ర అటూ యిటూ ఊపుతున్నాడు రామారావు "పడుకో! పడుకో!" అంటూ వెల్లకిలా ఉన్న మనిషిని పక్కకు తిప్పాడు మురళి

"మీరు ఎరిగిన వెంకట్రావు గనుక మీ తీర్పు మార్చుకుంటారన్న మాట "

తల అడ్డంగా ఊపాడు కొండల్రావు

"తీర్పు జడ్జిమెంట్ .! మురళీ! ఎవరి జీవితం మీదయినా తీర్పివ్వటానికి మనమెవరం?-నాదొక్కటే దృష్టి -! మన ముందు నిలబడి విలవిలలాడి పోతున్న మనిషని .. అతడెవరయినా

బ్లెస్డ్ విత్ సన్

-ఎలాంటివాడయినా . బ్రతికించేందుకే చూడాలి! నా మాటవల్ల ఓ మనిషి, బతికే అవకాశం ఏమాత్రం వున్నా - 'నా అంతరంగ దృష్టికి పూర్తిగా విరుద్ధమయిన మాటలయినా అంటాను!తీర్పయినా యిస్తాను!.. ఎవరయినా యివ్వాలనే వాదిస్తాను..."

ముసిలాయన అభిప్రాయం మురళికి నచ్చలేదు భ్రమల్లో ఉంచి ఎవర్నయినా ఎలా రక్షిస్తావ్? సత్యం చెయ్యలేని పని అసత్యం ఎలా చేస్తుంది? అసలు సత్యం, ధర్మం, న్యాయంకి హృదయంతో పని లేదు- అనుకున్నాడు ఆ మాట అనలేదు

కొండల్రావు కొనసాగించాడు.

ఎల్లల పెంపకం మీద వాడికి నాకూ చాలా వాదనలు నడిచాయి పెర్ఫెక్షన్ వాడికి ఓ పెద్ద అబ్సెషన్' - ప్రతి దాన్నీ పెర్ఫెక్ట్ చెయ్యాలి శిలను శిల్పంగా మార్చాలంటే ఉలితో చెక్కక తప్పదు! దీనిలో జాలి ప్రసక్తి లేదు మనం జీవించాలన్నా మన ఎల్లల్ని జీవించేటట్లు చేయాలన్నా - ఎమోషన్స్‌ని ఖాతరు చెయ్యకూడదు - అనేవాడు వెంకట్రావు. నేను అందుకు బిన్నం ఎగిరే పక్షిని యీదే చేపని ఎవడు పెర్ఫెక్ట్ చేస్తాడు? ఎదగనిచ్చితే - ఎగరటమో యీదటమో అదే వస్తుంది లక్ష్యం ఎంతగా గొప్పదయినా హృదయం లేని పద్ధతి దారుణం అనేవాణ్ని నేను!

చనిపోయే ముందు రాసిన ఉత్తరంలో -

ఆత్మహత్యే శేషమని నా లెక్కలు తేల్చాయి ఎర్నింగ్‌మెంబర్ కాబోయే కొడుకు పోయాడనా? ఇంత కాలం నాతో జీవించిన మనిషి పోయాడనా? నాకు తెలటంలేదు చెయ్యాల్సిన పెళ్లిళ్లూ మొయ్యాల్సిన బరువులూ నన్ను భయపెట్టే-స్తున్నాయా? - వేదాంతాలు నాకెప్పుడూ సహాయపడలేదు యిప్పుడూ పడటలేదు గుడ్‌బై! -

అంటూ రాసాడు వెంకటరావు -

తండ్రికొడుకుల్లో ఎవరి మీద జాలి పడాలో మురళికి తెలలేదు

పెద్దగా దగ్గుతూ కొండల్రావు లేచి నించున్నాడు - గబగబా వచ్చి ముసలావిడ అతని గుండెల మీద రాసింది మంచినీళ్లు యిచ్చింది

మురళీ! నా ఎల్లలకి నేను స్వేచ్ఛనిచ్చాను ఆడుకునే వయసులో చదువులు మోపడమా వాళ్ల లేత భుజాలమీద - అని కూడా అనుకున్నాను ఇంకా ఇంకా సంపాదించి వాళ్లకు జీవితం బరువు తగ్గించలేనా - అనుకున్నాను ప్రేమ వాత్సల్యం అంటే అదనే నమ్మాను. అయామ్ స్టిల్ ప్రౌడ్ ఆఫ్ మి!'

కొండల్రావు టాయిలెట్ వేపు నడిచాడు

అంతటా నిశ్శబ్దం!

మురళి వేపు చూస్తూన్న ముసలావిడ అంది -

"లోకాన్ని చూస్తున్న మగాళ్లు వాళ్లు ఎల్లల గూర్చి లక్షల ఆలోచనలు చేస్తారు ఇళ్లలో మగ్గిపోయే ఆడాళ్లం మేం! ఏం చెయ్యగలం? వెంకట్రావుగారు పెట్టిన నిర్బంధాన్ని ఆవిడా ఒప్పుకుంది ఈయన అనే స్వేచ్ఛను నేనూ ఒప్పుకున్నాను అయితే - యిలా బాధపడే రామారావుని చూసినా, నా పిల్లల్ని తలుచుకున్నా - ఆడాళ్లెవరికయినా ఒక్కటే అన్పిస్తుంది కడుపున పుట్టిన బిడ్డ కడుపునిండా తినాలి! కంటినిండా నిద్రపోవాలి అంతే - అందుకే మగాళ్లు ఒక్కళ్లే కర్తలా? ఆ భగవంతుడే కర్తా? - నాకు తెలీదు ఎవరూ కాదనే నాకు తోస్తుంది -"

మురళి సోఫాలో అలాగే కూర్చుండిపోయాడు

మీ పిల్లలు ఎక్కడున్నారమ్మా -?"

ముసిలావిడ గొంతులో దుఃఖమూ అదో విధమైన గర్వమూ -??

"జైల్లో!" అంది. □


బొమ్మల సీరియల్ విక్రమ్



సీక్రెట్ ఏజంట్ విక్రమ్ సీక్రెట్ ఏజంట్ సీక్రెట్ ఏజంట్ విక్రమ్ సీక్రెట్ ఏజంట్ విక్రమ్ సీక్రెట్ ఏజంట్ విక్రమ్

సీరియల్

ఎన్.భారతీదేవి



ప్రేమసాగరం

(గత సంచిక తరువాయి)

ఇద్దరు సిస్టర్స్ వచ్చి, మిమ్మల్ని డాక్టరుగారు తీసుకు రమ్మన్నారని, స్వప్నను చెరో చెయ్యి పట్టుకుని, నిదానంగా నడిపించుకుని తీసుకొచ్చి, డాక్టర్‌గారి రూములో కూర్చోబెట్టారు మరో పది నిముషాల తర్వాత, డాక్టర్ జయానాగరాజ్ వచ్చారు ఆ రూములోకి.

పెదవులపైన చిరునవ్వు, నిర్మలంగా ఉన్న ఆమె చూపులు, అనునయంగా, ఓదార్పుగా ఉండే ఆమె మాటలు, రోగులపాలిట అమృతంలా పని చేస్తాయి.

"స్వప్నా! వంట్లో ఎలా ఉంది?" చిరునవ్వుతో అడిగింది డాక్టర్ జయానాగరాజ్.

స్వప్న చూపులు, శూన్యంలో చూస్తున్నాయి. మాట్లాడకుండా శిలలా అలాగే కూర్చుంది.

"చూడమ్మా! నీకు మతిస్థిమితం లేదని, ఇంట్లో వాళ్ళనందర్నీ గొంతు పిసికి చంపబోతున్నావనీ, చివరికి నీ కన్న బిడ్డను కూడా చంపబోయావనీ, ఒక్కగానొక్క బిడ్డ అయిన బాబును, చంపుతావేమో అన్న భయంతో, మీ వారు స్వయంగా నిన్నిక్కడకు తీసుకొచ్చి, నాకప్పగించి పోయారు."

స్వప్న నుంచి సమాధానం లేదు. ఆమె కళ్ళలో నుంచి, కన్నీళ్ళు ధారాపాతంగా కారిపోతున్నాయి.

"ఆ స్థితిలో నిన్ను చూసి, మీ వారు చెప్పిందంతా నిజమని నమ్మాను అందుకే ఎడ్మిట్ చేసుకున్నాను ఈ రెండు రోజుల నుంచి, నీకు స్పృహ వస్తూ, పోతూ ఉంది. అందుకే, ఎలాంటి పరీక్షలు జరపకుండా, నువ్వు పూర్తిగా తెలివిలోకి రావటానికి, ప్రయత్నించాను "

"చూడమ్మా! నీకు మతి బాగానే ఉందని, నువ్వు మామూలుగా, మాలాగే ఉన్నావన్న విషయం నాకు తెల్సు, స్వప్న దీనంగా డాక్టర్ వైపు చూసింది. చల్లగాలి సోకితే, మేఘాలు ద్రవీభవించినట్టుగా డాక్టర్‌గారి అనునయపూరితమయిన మాటలు వినగానే, కట్టలు తెగిన నదిలా ప్రవహించాయి స్వప్న కళ్ళనుంచి కన్నీళ్ళు.

జరిగిన కథ-15: జయరాం ఎంతగా తనను బాధించినా స్వప్న అతన్ని వదలి వుండలేక పోతోంది. డబ్బు విషయంలో స్వప్న, జయరాం ఘర్షణపడతారు. స్వప్నకు జ్వరం వస్తే రఘునాథ్ ఆమెను హాస్పిటల్‌లో చేరుస్తాడు. స్వప్న తిరిగి కోలుకుని ఇంటికి వచ్చేటప్పటికి ఇంట్లో చాలా మార్పులు జరగటం గమనిస్తుంది. జయరాం ఎన్ని రకాలుగా ప్రయత్నించినా స్వప్న మాత్రం అతనికి డబ్బు ఇవ్వదు. స్వప్నకి మతి చెడిందని చెప్పి ఆమెను పిచ్చాసుపత్రిలో చేరుస్తాడు జయరాం.

"మీ బావ, రఘునాథ్‌గారు నా రూములోనే ఉన్నారు. ఆయనే, నీ కథంతా నాకు చెప్పారు." అదే చిరునవ్వుతో అంది.

"డాక్టర్! మీరు చెప్పింది నిజమేనా? రఘునాథ్ ఇక్కడకొచ్చాడా?" అంది ఆతృతగా.

"అవునమ్మా ఆయన ఇప్పుడు కూడా, మా ఇంటి దగ్గరే ఉన్నారు. ఆయన ప్రతి సంవత్సరం వాళ్ళమ్మగారి పేరుతో, పెద్ద మొత్తాన్ని మా హాస్పటల్‌కు విరాళంగా ఇస్తారు. చాలా సంవత్సరాల నుంచి తెల్సు నాకు నిన్ను గురించి ఆయన పడుతున్న ఆవేదన చూస్తుంటే, రోజూ వందల మంది పేషెంట్సును చూసి, బండబారిపోయిన, నా మనస్సు కూడా చలించి పోయింది."

"డాక్టర్! రఘునాథ్ కూడా, నాకు నిజంగా పిచ్చి పట్టిందనుకుంటున్నాడా?"

"వాళ్ళు, నీ కలాంటి పరిస్థితులు సృష్టించారని వాటిక తట్టుకోలేకనే, నువ్వు మతిస్థిమితం కోల్పోయావని అనుకుంటున్నాడు. ఆయన చెప్పిందంతా విన్న తర్వాత, ఆ పరిస్థితులు, ఆ మానసిక క్షోభ తట్టుకోలేక, ఎవరయినా పిచ్చివాళ్ళవుతారనిపించింది. డాక్టర్ని అయిన నాకే ఆశ్చర్యమనిపించింది వాళ్ళు నీ పట్ల అంత క్రూరంగా ప్రవర్తించారంటే!" అంది బాధగా డాక్టర్.

"అవును డాక్టర్! నా భర్త మీదున్న ప్రేమతో, వాళ్ళ రాక్షసత్వాన్ని, వాళ్ళు పెట్టిన నరకాన్ని భరించగలిగాను " అంది ఏడుస్తూ.

"స్వప్నా! ఇంత జరిగింతర్వాత కూడా, నువ్వింకా నీ భర్తను ప్రేమిస్తున్నావా అమ్మా?" ఆశ్చర్యంగా అడిగింది డాక్టరు.

విషాదంగా నవ్వింది స్వప్న

'చూడమ్మా! రాక్షసుల్లాంటి, ఆ మనుష్యులను ఊరికే వదలకూడదు. ఇలాంటి వాళ్ళే సంఘానికి చీడపురుగుల్లాంటి వాళ్ళు. నువ్వు నాతో సహకరిస్తే, ఆ ముగ్గుర్ని కటకటాల వెనక్కు పంపుతాను. ఒక మనిషి జీవితంతో ఆడుకునే అధికారం, మరో మనిషికి లేదు. నిన్ను హింసించటం ఒక తప్పు. పిచ్చిదానిగా సృష్టించటం మరో తప్పు. నిన్ను చంపాలని ప్రయత్నించటం మూడో తప్పు. ఈ తప్పులన్నిటికీ, శిక్షగా, కనీసం పది సంవత్సరాలయినా వాళ్ళు జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుంది."

గుండెల్ని రాపిడి చేస్తున్న బాధకూ, మనస్సును తల్లడిల్ల జేస్తున్న మనోవేదనకూ మధ్య స్వప్న మనస్సులో సమరం జరుగుతుంది.

"ఏమ్మా! మాట్లాడవేం?"

"ఏం మాట్లాడమంటారు డాక్టర్?" నీళ్ళు నిండిన కళ్ళతో అడిగింది స్వప్న.

"వరకట్నాల సమస్యలతో నిత్యం మన దేశంలో, ఎంతో మంది ఆడవాళ్ళు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. కానీ, పిల్లలు లేకపోవటం కూడా నేరంగా భావించి, నువ్వుండగా, మరొక స్త్రీని పెళ్ళి చేసుకుని, నీ కళ్ళముందే ఆమెతో కాపురం చెయ్యటం నువ్వెలా భరించగలిగావో, ఊహించటానిక్కూడా బాధగా ఉందమ్మా నాకు.

స్వప్నా' నామాట విని, నాతో సహకరించమ్మా మానవత్వం లేని, ఆ నరరూప రాక్షసుల మీద ఇంకా జాలి చూపుతున్నావా? నువ్వు? అంది డాక్టర్ ఆశ్చర్యంగా స్వప్నకు దుఃఖం రావటం లేదు ఏదో తెలియని శూన్యత మనస్సంతా ఆవరించింది

"డాక్టర్! నాకో సహాయం చెయ్యగలరా?

"చెప్పమ్మా! నీ కెలాంటి సహాయం కావాలన్నా చేస్తాను '

'రఘునాథ్‌కు, నాకు నిజంగా మతిపోయిందని, నన్ని హాస్పటల్‌లో నే ఉంచటం మంచిదని మీరతనికి నచ్చ జెప్పాలి

చూడమ్మా! నేనలాంటి పని చెయ్యలేను ఆరోగ్యంతో ఉన్న నీవు, ఏదో కారణంతో మతిపోగొట్టుకుని, తామేం మాట్లాడుతున్నారో, ఏం చేస్తున్నారో తెల్సుకోలేని ఈ దురదృష్టవంతుల మధ్య ఎలా ఉండగలవు?

"అటువంటి మనుష్యుల మధ్య, కొన్ని సంవత్సరాల నుంచి ఉండగలిగిన నేను, ఈ మతిలేని వాళ్ళ మధ్య ఉండలేనంటారా డాక్టర్

పిచ్చితల్లి! వంటరితనంతో, అందరూ ఉండి, ఎవరూ లేనిదానిగా, అన్నీ ఉండి, ఏమీలేని దానిలా ఎలా బ్రతగ్గలవమ్మా?'

ఈ శిధిలమయిన శరీరంలో, ఆలోచించటానికి, బాధపడటానికి మనస్సు తప్ప, నాదంటూ నాకేముంది డాక్టర్!'

ఒక్క మాట చెప్పమ్మా! నిన్ను అంత బాద పెడుతున్న నీ భర్తను వదిలేసి, నిన్ను అమితంగా ప్రేమిస్తున్న రఘునాథ్‌ను పెళ్ళి చేసుకోలేవా? నిన్ను గురించి, అతను పడుతున్న బాదా, వేదనా చూస్తుంటే, నేనే కన్నీరు ఆపుకోలేక పోయాను

"డాక్టర్! ప్రేమ అనేది ఒక మహాసాగరం ఆ ప్రేమ సాగరంలో పడిపోయిన మనిషి, ఆ సాగరాన్ని ఈది, బ్రతికి మరో తీరం చేరటం సాధ్య మంటారా? జయరాంను ప్రేమించాను ఆ ప్రణయంలో ఓడిపోయాను అలిసి పోయాను కొంత మంది ప్రేమ జీవితంలో ఒక భాగమనుకుంటారు నేను ప్రేమే జీవితం అనుకున్నాను ప్రేమే ప్రపంచం అనుకున్నాను ప్రేమే ఊపిరిగా బ్రతుకుతున్నాను

అందర్నీ ఎదురించి అతన్ని చేసుకున్నాను నా జీవితం నాశనమయిందన్న దిగులుతోనే, మా డాడీ, మమ్మీ పోయారు అయినా ఆయన ప్రేమలో వాళ్ళను తేలికగా మరిచిపో గలిగాను


అతనికి, మోహినితో సంబంధ ముందని తెల్సుకున్న రోజునే అతనికి దూరంగా ఉండాలను కున్నాను నా నిర్ణయాన్ని కొన్ని గంటలు కూడా అమలు చేయలేక పోయాను

తను పెళ్ళి చేసుకున్న భార్యనూ, బిడ్డనూ నా ఇంటికే తీసుకొచ్చి, నా కళ్ళముందే, అతను మరో భార్యతో కాపురం చేస్తుంటే, ఆ మరణయాతన భరించలేక, మా మధ్య ఉన్న ప్రేమ బంధాన్ని తెంచుకోలేక, ఆ నరకాన్ని అనుభవించాను

డాక్టర్! ఇరవయ్యినాలుగు గంటలు ఆయనకు దూరంగా ఉండలేని నేను, ఆయన్ని మరిచిపోయి, రఘునాథ్‌ను పెళ్ళి చేసుకోగలనా? ఒకవేళ చేసుకున్నా, జయరాంను మరిచిపోయి, అతన్ని సుఖపెట్ట గలనా? అశాశ్వతమయిన మనుష్యుల మధ్య శాశ్వతమయిన ప్రేమను సృష్టించాడా భగవంతుడు ఇంత చేసినా, నా మనస్సింకా నా భర్తను ద్వేషించటం లేదు డాక్టర్ ఆయన్ని చూడాలని, నా మనస్సెంత తపన పడుతుందో మీకు తెలియదు ఆయన అడుగుల చప్పుడు కోసం, నా చెవులు, ఆయన గొంతు వినాలని నా మనస్సూ, ఆయన్ని చూడాలని నా కళ్ళు, ఆయన గుండె చప్పుడు వినాలని నా గుండె, ఇలా నా శరీరంలోని ప్రతిభాగం ఆయన కోసం తపించి పోతున్నాయి డాక్టర్ ప్రేమసాగరాన్ని మథించిన కొద్దీ, ప్రేమే వుద్భవిస్తుంది నా శరీరాన్ని నా మనస్సునూ ఆయన హింసించినకొద్దీ, నా గుండెల్లో ప్రేమే పెల్లుబుకుతుంది డాక్టర్! నేను స్పృహలో కొచ్చి దాదాపు ఇరవయ్యినాలుగు గంటలవుతుంది డాక్టర్! నేను జయరాంను ప్రేమించటం మొదలు పెట్టిం తర్వాత, ఇన్ని గంటలు కంటే ఎక్కువ సమయం ఆయన్ని చూడకుండా ఉండలేదు ఇప్పుడూ అంతే

జయనాగరాజ్‌కు, మాటలు పెగల్లేదు ఆమె మనస్సులో, సలీంను ప్రేమించి, సజీవంగా సమాధి గావించబడిన అనార్కలి మజ్నూ కోసం తపించి తుది క్షణాలలో అతన్ని చూసి ప్రాణాలు వదిలిన లైలా మెదిలారు

స్వప్న ప్రేమ కూడా, వాళ్ల కోవలోకి చెందిందే కాకపోతే స్వప్నది



ప్రేమసాగరం

వన్‌వే ట్రాఫిక్‌లాంటి ప్రేమయింది అందుకే, ఆ అమర ప్రేమికుల ప్రేమ కద చరిత్రలో నిలిచిపోయింది స్వప్న ప్రేమ హాస్పటల్ పాలయింది

ప్రేమకోసం, సామ్రాజ్యాలను ప్రాణాలనూ కూడా ఎందుకు వదులుకుంటారో అర్థమయింది స్వప్న మాటలు విన్న తర్వాత డాక్టర్‌కు ఆమెకు ఎలా నచ్చచెప్పాలో కూడా అర్థం కాలేదు

'డాక్టర్' నేనింతవరకూ ఏ విషయంలోనూ, ఎవరినీ అర్థించలేదు నా జీవితంలో మిమ్మల్నే అర్థిస్తున్నాను రఘునాద్‌కు నాకు పిచ్చెక్కిందని చెప్పండి నా భర్తకు ఎటువంటి హాని చెయ్యకండి మీ పాదాలు పట్టుకుంటాను అంటూ ఏడుస్తూ లేచిన స్వప్న దబీమని కింద పడిపోయింది ఆ పడిపోవటంలో, స్వప్న తల డాక్టర్ పాదాలను తాకింది

డాక్టర్ జయానాగరాజ్ మరో నలుగురు నిపుణులయిన పెద్ద డాక్టర్స్, స్వప్నను బ్రతికించాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు ఎన్నెన్నో పరీక్షలు చేస్తున్నారు ఎంతో ఖరీదయిన మందులు వాడుతున్నారు అల్ట్రాసౌండ్‌ల వంటి, అత్యాధునికమయిన, యంత్రాలుపయోగించి పరీక్షలు చెయ్యగలిగినా, ప్రేమే ఊపిరిగా బ్రతికి, ఆ ఊపిరి దూరమయి నిర్జీవమయిన ఆమె శరీరానికి ఊపిరిపోయలేక పోయారు

మృత్యువుతో నాలుగు గంటలు పోరాడి, తను చూడాలని తపించిన భర్త తన పక్కనే ఉన్నా, తనను ప్రాణంగా ప్రేమించి, తన కోసం జీవితాన్నే త్యాగం చేసిన అమరప్రేమికుడు రఘునాద్ కన్నీటితో తన శరీరం తడిసిపోతున్నా, ఆమె కన్నులెత్తి వాళ్ళను చూడకుండానే, శాశ్వతంగా కన్ను మూసింది స్వప్న

★ ★ ★ ★

పచ్చని ఆకులతో, విరిసిన పూలతో రఘునాద్ పూలతోటలోని చెట్లన్నీ, వింతందాలు వలికిస్తున్నాయి అస్తమిస్తున్న సూర్య కిరణాలు పడి, బంగారు కాంతు లీనుతున్నట్టున్నాయి చెట్లన్నీ విరిసిన గులాబీలు విరియబోతున్న మల్లెలు, జాజులూ, సువాసనలు గుబాళిస్తున్న నైట్‌క్వీన్ లతలు, ఆ పూలచుట్టూ పరిభ్రమిస్తున్న తుమ్మెదలు ఆ పూలను స్పృశిస్తున్న చల్లటి మలయమారుతాలు, రఘునాద్ మనస్సులోని ప్రేమలా, ఆ పూలతోట, చెయ్యితిరిగిన చిత్రకారుడు తీర్చిదిద్దిన చిత్రంలా, రమణీయంగా, నయనానందకరంగా ఉంది ఆ పూలచెట్ల మధ్యలో, పాలరాతితో కట్టిన స్వప్న సమాధి, షాజహాన్ చక్రవర్తి తన భార్య జ్ఞాపకార్థం కట్టించిన తాజ్‌మహల్‌లా అందంగా, ఠీవిగా మెరుస్తుంది

అది సమాధిలా లేదు చుట్టూ లతలు చెక్కిన కట్టడాలతో, పూల చెట్ల మధ్య, పుష్పక విమానంలా కనిపిస్తుంది

ప్రతి సాయంత్రం, ఆ సమాధిముందు రఘునాద్ దీపం వెలిగించి, స్వప్న చిత్రపటానికి గులాబీల పూలదండ వేస్తాడు


అప్పటికి స్వప్న చనిపోయి, అయిదు సంవత్సరాలయింది కొన్ని లక్షల ఆమె ఆస్తిని అనుభవిస్తున్న జయరాం, మోహిని, వాళ్ళ కొడుకూ స్వప్న జ్ఞాపకాలను కూడా మరిచిపోయారు

స్వప్న పేరుతో, ఆ నగరంలో ఎన్నో వెలిసాయి రఘునాద్ పగలంతా ఎంతో శ్రమించి, బిజినెస్‌లో వేలకు వేలు సంపాదిస్తాడు సంపాదించినదంతా స్వప్న పేరుతో ఖర్చు బెడతాడు


ఆమె పేరుతో కాలేజి కట్టించాడు హాస్పటల్ కట్టించాడు అనాథ శరణాలయం కట్టించాడు ఎన్నో సంస్థలకు, ఆమె పేరుతో విరాళాలందుతాయి ఆమె చనిపోయిన రోజు, ప్రతి సంవత్సరం, ఆమె పేరుతో కొన్ని వేలమంది ఆడవాళ్ళు రఘునాద్ ఇంట్లో భోంచేసి, స్వప్న పేరుమీదుగా, అతనిచ్చిన చీరలు అందుకుంటారు

రఘునాద్ బంగళాపేరు కూడా స్వప్నా నిలయంగా మార్చబడింది

ప్రతిరాత్రి, రఘునాద్ స్వప్న సమాధిముందే నిద్రపోతాడు ఏ అర్థరాత్రప్పుడో మెలకువ వచ్చి నిర్మానుష్యంగా కనిపించే వాతావరణాన్ని



తేలిక భావం



ధర్మపథం

సృష్టిలోని ప్రాణులన్నీ ఏదో ఒక విధంగా పొట్ట పోసుకుని జీవించడానికి ప్రయత్నించడం సహజం. ఆ ప్రాణులలో మానవుడు సర్వోత్తముడు. జ్ఞానం కలవాడు. యుక్తాయుక్తాల వివేకం కలవాడు; అతడు సుఖజీవనానికి పాటుపడినా – సర్వవిధాలా గౌరవంగా జీవించడానికి ప్రయత్నించాలి. ఉత్తములు. మనిషి చులకన కావడం చాలా సులభం. గౌరవం పొందడం కష్టం! అది లభించినప్పుడు, దానిని నిలుపుకోవడం మరీ కష్టసాధ్యమయి ఉంటుంది.

పరిచితుల మధ్య, బంధుమిత్రులలోను గౌరవంగా బ్రతికే వారికి, వారివల్ల సహాయం ఆపేక్షించనంత వరకూ గౌరవం నిలిచి ఉంటుంది. సహాయం కోరినప్పుడు, ఆ గౌరవం క్షీణిస్తుంది. అందులోనూ, ఆర్థికంగా ఇబ్బందులకు లోనయి ఉన్నప్పుడు, అప్పుగా సహాయం కోరితే, ఏదో కారణం చెప్పి, నిస్సహాయతను ప్రకటించడం సాధారణంగా కానవస్తుంది. అప్పటి నుంచీ పరిచయం తగ్గించుకొనుటకు వారు ప్రయత్నించవచ్చును. ఎక్కడనయినా దూరంగా కనపడినా, ఎదుట పడకుండా తప్పించుకొంటారు. ఇక ఉచితంగా సహాయాన్ని ప్రార్థిస్తే ఇక చెప్పనక్కరే లేదు. మన గౌరవం పూర్తిగా నశించిపోయి, అసహ్య భావం ఏర్పడుతుంది. యాచన కంటె నీచమైనది మరొకటి లేదు. "తృణాదపి లఘుస్తూలః, తూలాదపిచ యాచకః" అనే లోకోక్తి ఉండనే ఉన్నది. గడ్డిపోచ ఉఫ్ అని ఊదితే ఎగిరిపోతుంది. దానికంటే తేలికైన ప్రత్తి ఊదకుండానే ఎగిరిపోతుంది. ఇతరులను యాచించే వాడు ఆ దూది కంటె తేలిక. శరీరం బరువైనందు వల్ల వ్యక్తిగతంగా ఎగిరిపో లేకపోయినా, యాచన అతి తేలిక అగుట వల్ల ఎంతో ఎత్తునకు ఎగర వేసి, అతని గౌరవాన్ని నశింపజేస్తుంది. అందువల్ల తానెట్టి కష్టంలో ఉన్నా, ఇతరులను యాచిస్తే ఉన్న గౌరవం ఊడిపోక తప్పదు. తన్ను ఎంతో అభిమానంతోనూ, ప్రేమతోనూ చూస్తున్న మిత్రులు కూడా చాలా చులకనగా చూస్తారు. కావున యాచనకు లొంగకుండా చులకన కాకుండా, గౌరవం నిలుపుకోవాలి.

–బులుసు వేంకటరమణయ్య

మినుకు, మినుకుమనే నక్షత్రాలను చూసినప్పుడు, అతనిలోని ఒంటరితనం, అతన్ని భయపెడుతుంది అనుభవాల్ని, అనుభూతుల్ని పంచుకోవటానికి తన కెవరూ లేరనుకుని కన్నీరు తిరిగే సమయంలో, స్వప్న సమాధివైపు చూస్తే, ఆమె తనకు తోడుగా ఉన్నట్టనిపిస్తుంది

స్వప్న అతని హృదయంలో ప్రతిక్షణం పూజ లందుకుంటూనే ఉంది ఆమె పోయినా, ఎంతో మంది ఆమె మూలంగా జీవనం సాగిస్తున్నారు ఆమె మరణం కూడా మంచి గంధపు చెట్టులాగా, ఎంతో మందికి ఉపయోగపడింది

స్వప్న జ్ఞాపకాలతో, ఆమెను చేరుకోవాలన్న తపనతో మనుగడ సాగిస్తున్నాడు రఘునాథ్

ఆ భావపరంపరలతోనే, అతను రోజులు గడప గలుగుతున్నాడు

పగలంతా క్షణం తీరికలేకుండా, యంత్రంలా పని చేస్తాడు రాత్రయితే చాలు స్వప్న జ్ఞాపకాలు ఏ వర్షపు రాత్రిలోనో, మనస్సు మరి బలహీనతకు లోనయినప్పుడు, తనను గురించి తాను ఆలోచించుకున్నప్పుడు, తన కష్టాలలో, సుఖాలలో భాగం పంచుకునే భాగస్వామి కావాలని కోరుతుంది అతని మనస్సు

ఆ భావన ఒకక్షణం మాత్రమే అంతలోనే అతని కళ్ళ ముందు స్వప్న రూపం సాక్షాత్కరిస్తుంది విరిసిన పువ్వులాంటి ఆమె చిరునవ్వు ఆమె పేరుమీద నెలకొల్పిన ఉపాధి కేంద్రాలలో జీవిస్తున్న అనాథలు కనిపిస్తారు అంతే కలిగిన కోరిక క్షణంలో ఎగిరిపోతుంది.

కాలచక్రం తిరుగుతూనే ఉంది. స్వప్న పేరుమీద సాగే కార్యక్రమాలన్నీ సాగుతూనే ఉన్నాయి. నిత్యం ఆమె సమాధి ముందు దీపం వెలుగుతూనే ఉంది. ఆమె చిత్రపటానికి, రోజూ తాజా గులాబీ పూలదండ అలంకరించబడుతూనే ఉంది

కౌమార, యౌవన దశలను దాటిపోయాడు రఘునాథ్ అతని నల్లని జుట్టు సగానికి పైగా తెల్లబడి పోయింది.

స్వప్న సమాధిముందు దీపం వెలిగించటానికే, అతను బ్రతికున్నాడేమో అనిపిస్తుంది స్వప్న కోసం శూన్యంలోకి సారించినట్లుండే అతని చూపుల్ని చూస్తే.

యుగాలు మారిపోతున్నాయి. తరాలు మారిపోతున్నాయి. ఎన్ని తరాలు గడిచినా, నిజమయిన ప్రేమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతూనే ఉంది.

మరణంలేనిది ప్రేమ. భగవంతునిలా కంటికి కనిపించకుండా, మనస్సుకు ప్రేరణ కలిగించేది ప్రేమ. ఏ కవి భావనకూ, ఏ రచయిత కలానికి, అందనిది ప్రేమ.

క్షణంలో మనుష్యులను, మనస్సులను మార్చగలిగేది ప్రేమ.

సృష్టికి మూలం ప్రేమ. చనిపోయిన, ప్రియురాలికోసం, నూరేళ్ళ జీవితాన్ని అర్పణ చేసిన, రఘునాథ్ ప్రేమ అమరం.

(అయిపోయింది)

వృద్ధపరివర్తనం

వేముల రమణమూర్తి

"దాహం!.... దాహంగా వుంది. అన్నయ్యా కాస్త మంచి నీళ్ళు కావాలి. అన్నయ్యా...." లేనట్టున్నాడు. ఎక్కడికో వెళ్ళుంటాడు. పాపం. నా గురించి ఎంత శ్రమ పడుతున్నాడో. వాడే లేకపోతే, నా గతే మయ్యేది. ఈ జబ్బుతో ఏనాడో చచ్చి పోవలిసింది. వాడుండ బట్టి నన్ని హాస్పిటల్లో జాయిన్ చేసాడు. వాడికి నేనెంత ఋణపడి వున్నానో!

పెళ్ళినాడు "నాతి చరామి" అంటూ నా చేతిని పట్టుకున్న భర్తకు యిప్పుడు నేనే స్థితిలో వున్నానో కూడా తెలియదు. నేనేమై పోతేనేం అన్నట్టు వూరు కున్నాడు.

నా కొడుకులు అయోగ్యులై నాకే విధమైనా సహాయం చేయలేదు. చిన్నప్పటి నుండి కనీ పెంచి పెద్ద చేసిన వాళ్ళకి కనీసం తల్లి నన్న అభిమానం కూడా లేదు.

ఎవరో తలుపు తీసిన చప్పుడు వినిపించి అటు చూసాను. అన్నయ్య వచ్చి, నా భర్త సాయంకాలం హాస్పిటల్‌కు వస్తున్నట్టు చెప్పాడు.

హుం! చావు బతుకుల్లో వున్న నన్ను యింకా ఏం సాధిద్దామని వస్తున్నాడో. పెళ్ళంటే నూరేళ్ళ పంట అంటారు. అందరి విషయంలో అది నిజం కాదేమో. కొందరికి వరమైతే మరి కొందరికి శాపమై కూర్చుంటుంది.

జీవిత మంతా అతని సాంగత్యంలో నరకాన్ని చవి చూసాను. అతని సాహచర్యంలో గుర్తించుకో దగ్గ ఒక్క మధుర స్మృతి కూడా లేదు. జీవిత మంతా వేధించుకు తిన్నాడు.

ఈ చరమ దశలో అన్నయ్య ఆప్యాయతలో లభిస్తున్న కాస్తంత శాంతినీ దూరం చేయడానికి వస్తున్నాడేమో అనిపించింది.

నిద్రరాని కన్నుల్ని బరువుగా మూసుకున్నా. ఆలోచనలు గతంలోకి వెళ్ళాయి.

* * * *

అవి కొత్తగా పెళ్ళయిన రోజులు. భర్తకు భార్య, భార్యకు భర్త అనురాగాన్నీ, ప్రేమనూ పంచి యిచ్చుకొనే మధురమైన రోజులు.

కానీ మొదటి రాత్రి గదిలోనే తప్ప తాగొచ్చి తనని పట్టించుకోకుండా ముసుగుతన్ని పడుకుంటే, మొట్ట మొదటి రోజే రభస ఎందుకని వూరుకున్నాను. కానీ యించుమించు రోజూ అదే వరస.

ఓ రోజు నేను మొదటి సారిగా అడిగితే, "ఏమే ఒళ్ళు కొవ్వెక్కిందా! మొగాడ్ని నా యిష్టం. యీ సంపాదన నాది. యీ యిల్లు నాది. నువ్వెవర్తి"వని సమాధానం వచ్చింది.

హతాశురాలైన నాకు అనుకోకుండా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. భర్తంటే మొదటిసారిగా ఏహ్య భావం మొదలయింది ఆనాడే.

తండ్రి సంపాదన యింటికే చాలీ చాలని సమయంలో, అన్నయ్య రెక్కల ముక్కలు చేసుకుని సంపాదించిన కొద్దిపాటి ఆస్తితో ఘనంగా పెళ్ళి చేసాడు. చేస్తున్నది చిన్న వుద్యోగమయినా మంచివాడనే నమ్మకంతో యీ కృష్ణారావు కిచ్చి పెళ్ళి చేసాడు అన్నయ్య. కానీ "మేడి పండు చూడు....." అన్న సామెతలా అయింది యీతని ప్రవర్తన.

అంతే! మొదటి రోజు లగాయితూ రోజూ యిదే వరస. రోజూ తాగి రావటం, నన్ను నానా తిట్లు తిట్టడం ఏమాత్రమైనా ఎదురు తిరిగితే వళ్ళు హూనం అయేటట్టు కొట్టడం అలవాటయింది.

ఓ రోజు తాగిన మందు యింకా చాల లేదేమో, నన్నొచ్చి డబ్బడిగారు. లేదన్నాను. నేనేమైనా సంపాదిస్తున్నానా ఆయన కివ్వడానికి. దానికి మండిపడి పోతూ, "మీ అన్నయ్య వెధవ సంబంధం కుదిర్చాడు. యింత దిక్కుమాలిన దాన్ని నాకు కట్టబెట్టాడు. మీ అన్నయ్యనే డబ్బడిగి తీసుకురా! యివ్వక పోతే నిన్నూ ఆ వెధవనీ ఏం చేస్తానో చూడు" అంటూ నానా విదాల మా అన్నయ్యను తూలనాడటం మొదలెట్టారు.

నన్నెన్ని అన్నా భరించాను. కాని దేవుడు లాటి మా అన్నయ్యను అనేసరికి వుక్రోషం వచ్చి నేనూ ఎదురు తిరిగాను. ఫలితం రభస.

నాకు మా అన్నయ్యను ఏమైనా అంటే వుక్రోషం వస్తుందని గ్రహించిన తనకి యిక చీటికి మాటికి అలానే తిట్టడం మొద లెట్టారు. ఈ విషయం మా అన్నయ్యతో చెప్పలేక, దాచుకోలేక ఎన్నో సార్లు నాలో నేనే కుమిలి పోయాను.

అలా ఒక రోజా రెండు రోజులా. యిరవై సంవత్సరాలు అయ్యాయి. నిత్యం యింటిలో రణ రంగమే. ఇచ్చిన కొద్దిపాటి డబ్బుతో గుట్టుగా యింటిని గడుపుకొస్తున్నాను. అది యివ్వని నాడు, గత్యంతరం లేక చుట్టు పక్కల యిళ్ళల్లో వంట పనీ యింటి పనీ చేసుకునేదాన్ని.

అన్నయ్య సహాయం చేయగల్గినన్నాళ్ళూ చేసాడు. కానీ ఎన్నాళ్ళు చేయగలరు ఎవరైనా. ఎవరి పిల్లలు, సంసారం వాళ్ళవి.

ఈ యాంత్రిక జీవనంలో నాకూ ముగ్గురు పిల్లలు కలిగారు. కానీ ఏం లాభం? తల్లి దండ్రుల ప్రవర్తనని బట్టే పిల్లలు. భార్యా భర్తలు ఎప్పుడూ అన్యోన్యంగా సంతోషంగా వున్న నాడే పిల్లలకి కూడా తల్లి దండ్రుల పట్ల అభిమానం, ప్రేమ వుంటాయి. నిత్యం తల్లి దండ్రుల మధ్య జరుగుతున్న వివాదాల్ని చూస్తుంటే వాళ్ళకి వివేకం ఎలా వస్తుంది?

పిల్ల లెదుటే నన్ను "హీనంగా" తిడుతుంటే అది చూసిన పిల్లలు కూడా నన్ను చులకన చేయడం మొదలెట్టారు. భార్యాభర్తల మధ్య ఎన్ని మనస్పర్థలున్నా అవి పిల్లల ఎదుట వ్యక్తం చేయ కూడదు. వాళ్ళ దృష్టిలో ఎప్పుడూ అన్యోన్యంగా, ఆదర్శంగా వుండాలి.

కానీ అలాటి అనురాగాన్ని చవి చూడని మా దాంపత్యంలో పిల్లలు ఏ విధంగా పెరుగుతారో వేరే చెప్ప నక్కర లేదు. పెద్దవాడు పదవ తరగతి మూడో సారి ఫెయిలయి తండ్రి ఎక్కడ కొడతాడో నన్న భయంతో చెప్పా పెట్టకుండా యిల్లు విడిచి వెళ్ళి పోయాడు.

వాడు వెళ్ళి పోయాడని నేను కుమిలి కుమిలి ఏడుస్తుంటే ఒక్కడి పోషణా భారమైనా తగ్గిందిలే అని సంతోషించా రాయన. మరో రెండేళ్ళకు రెండో వాడూ అలానే చేసాడు. చివరి వాడైనా వెళ్ళిపోకుండా కంటికి రెప్పలా చూసుకు వస్తున్నాను.

వయసు పెరుగుతున్న కొద్దీ ఆయనకు దురలవాట్లు ఎక్కువయ్యాయి. నాకు శక్తి రోజు రోజుకి వుడిగి పోతుంటే భవిష్యత్తు ఎలా వుంటుందో నన్న భయం పట్టుకుంది.

ఒకనాడు, పొరుగింట్లో పనిచేస్తుండగా ఆకస్మాత్తుగా పొత్తి కడుపులో నొప్పి రావటం, అది భరించరానిదిగా మారటం జరిగింది.

పొరుగువారి సహాయంతో హాస్పిటల్‌కు వెళ్ళాను. ఇది చాల సీరియస్‌గా కేసని వెంటనే పెద్ద హాస్పిటల్‌కు తీసికెళ్ళమని డాక్టర్ చెప్పాడు.

ఆ విషయం ఆయనకు చెప్పాను. అదో పెద్ద విషయమా! అన్నట్టు "చూద్దాంలే!" అని

పూరుకున్నారు రోజూ నెప్పి వస్తుండటంతో పొరుగిళ్ళలో పనులు మానేసుకున్నాను

ఓ రోజు తప్ప తాగొచ్చి డబ్బు కావాలని నన్నడిగారు అనారోగ్యంతో వున్న నాకూ ఆదరణ చూపించటం పోయి నన్ను తిరిగి వేధిస్తుంటే యీయన మనిషేనా' అన్పించింది నా అనారోగ్యం రోజు రోజుకి తీవ్రమౌతోందని యీ నెప్పితో నేను చచ్చిపోతానండీ అంటూ భోరున ఏడుస్తూ ఆయనకు చెప్పాను

తప్ప తాగినవాడు పశువుతో సమానమన్నట్లు ఆయన నా మాటలను లెక్కచేయకుండా, నా మెడలోని తాళిని తెంపుకుపోయారు ఆ చర్యకు నోటమాట రాలేదు

పెళ్ళినాడు బాజాభజంత్రీల మధ్య, శుభ మంత్రోచ్చారణల మధ్య, వందలమంది బంధుమిత్రుల మధ్య ఆయన నా మెడలో తాళి కడుతుంటే పులకరించిన నా మనస్సు, నాఆడజన్మకు సార్థకత లభించిందన్న నాకు యీ అమానుష చర్యకు నా దృష్టిలో వైధవ్యం సంభవించిందనుకున్నాను

ఇక ఆయనతో నా జీవితం నేటితో పరిసమాప్తి అయిందనుకుని పొరుగువారి సాయంతో మా అన్నయ్య యింటికి చేరుకున్నాను

మా అన్నయ్య నా స్థితి గమనించి ఎంతో బాధపడ్డాడు వెంటనే నన్ను పెద్ద హాస్పిటల్‌లో జాయిన్ చేసాడు డాక్టర్లు నన్ను పరీక్షచేసి అన్నయ్యతో నాకు కేన్సర్ అని చెప్పారు

అన్నయ్య నాకా విషయం చెప్పలేక తనలో దాచుకోలేక చాలా మదనపడ్డాడు కాని నాకా విషయం తెలియడానికి ఎంతో సమయం పట్టలేదు

జీవితంలో ఏం సుఖపడ్డానని యింకా బతకాలని కోరుకోవాలి నాకు కేన్సర్ అని తెలిశాక ఏమీ బాధపడలేదు ఈ నరకం నుండి విముక్తి అవుతోందని తెలిసిన నాకు మనస్సు తేలికపడింది

★ ★ ★ ★

గతంలోంచి వాస్తవానికి వచ్చిన నాకు ఎదురుగా వర్తు కృష్ణారావుని చూసాను భయంకరమైన గతానికి గుర్తులా అతని కళ్ళు ఎర్రగా వున్నాను తప్ప తాగొచ్చినట్లుంది వస్తూనే నా రెండు చేతులూ పట్టుకుని బోరుమని ఏడ్చాడు

ఏనాడూ చూడని యీ ఆకస్మిక చర్యకి ఆశ్చర్యం కలిగింది ఒక్కసారి

సావిత్రీ' నన్ను క్షమించు' నిన్ను జీవితాంతం ఎన్నో బాధలకు గురిచేసాను ఏదో మామూలు అనారోగ్యం అనుకుని నిర్లక్ష్యం చేసాను కానీ నీకొచ్చిన జబ్బు నిన్ను నా నుండి శాశ్వతంగా దూరం చేస్తుందని వూహించలేదు సావిత్రీ' నన్ను నమ్ము' నేను తాగుబోతునైనా నిన్ను బాధించినా నువ్వు నా నుండి దూరమవుతున్నావన్న సత్యాన్ని భరించలేకుండా వున్నాను సావిత్రీ' నన్ను మనస్పూర్తిగా క్షమించానని ఒక్క మాట చెప్పవూ' అంటూ ఏడుస్తూనే వున్నాడు కృష్ణారావు

రెండు రోజులకంటే ఎక్కువ కాలం బతకదని చెప్పిన డాక్టరు మాటలు పదే పదే కృష్ణారావు గుండెల్లో ప్రధ్వనిస్తున్నాయి

చివరి ఘడియల్లో వున్నానని నాకూ తెలుసు వర్తు యిలా యీ వింత ప్రవర్తనకి ఆశ్చర్యం పొందినా మాటాడాలని అన్పించలేదు ఎందుకో

★ ★ ★ ★

రెండు రోజుల తరువాత నా పరిస్థితి మరింత దిగజారింది డాక్టర్లు, నర్సులు అంతా హడావుడిగా నా గదిలోకి వచ్చారు పరీక్ష చేసిన డాక్టర్లు యిక ఆఖరి క్షణాలని అన్నయ్యతో చెప్పారు

ఆయన నా వద్దే వున్నాడీ రెండు రోజులూ అన్ని సపర్యలూ అతడే చేసాడు అతని కళ్ళు యిక వర్షించలేక ఆగిపోయినట్లు వున్నాయి నా నోటి నుండి అనురాగంతో ఒక్క మాటైనా వస్తుందని ఎదురు చూస్తున్నట్లున్నాయి అతని కళ్ళు


కళ్ళు తెరచి ఆయన వంక చూసాను జీవితమంతా శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా ఎన్నో బాధలకు గురిచేసిన ఆయనకు నా మనసులోని మాటలను చెప్పాలని అనిపించింది

దగ్గరగా రమ్మనమని సైగ చేశాను ఆత్రుతగా ఎదురుగా వచ్చారు

ఎందుకండీ' యీ వ్యర్థ పరివర్తనం అని గట్టిగా అరచి చెప్పాలనిపించింది గాని ఆ మాటలు నా చివరి శ్వాసతో కలిసి అనంతంలో లీనమయ్యాయి ☐



అప్రయోజకులుగా ఉండాలని ఎవరైనా కోరుకుంటారా?




బ్రౌన్ షుగర్,
పీడితులతో సహా
అయితే మీ మి
జరిగేది అదే పనికి
పరిగణిస్తారు

మిమ్మల్ని మీరే కాపాడుకోండి.
మాదక ద్రవ్య వ్యాపారులకు అవకాశ
అట్టి వాటికి దూరంగా ఉండడమే

హైదరాబాద్ నోట్‌బుక్

మాయాపూర్‌లో చైతన్య మహాప్రభు పంచశత జయంతి:-

శ్రీ చైతన్య మహాప్రభువు అవతరించి గడచిన మార్చినెల 26వ తేదికి ఐదు సంవత్సరాలు గడిచాయి ఈ సందర్భంగా ఆయన అవతరించిన (పశ్చిమ బెంగాల్ నదియా జిల్లా) శ్రీ ధామ మాయాపూర్‌లో మార్చి18 నుంచి 27వ తేదీ వరకు ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి - అని హైదరాబాద్‌లోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు శ్రీ మహామన్‌దాస్ అధికార్, కార్యదర్శి శ్రీ ఆనందమయదాస్ బ్రహ్మచారి తెలిపారు ఉత్సవాన్ని గురించి, ఇతర విషయాలను గురించి వారిలా అన్నారు - శ్రీకృష్ణుని అవతారమై ప్రపంచంలో భక్తి సంప్రదాయ ప్రచారం కోసం శ్రీ చైతన్య మహాప్రభు క్రీస్తుశకం 1486 మార్చి 26న (ఫాల్గున పూర్ణిమనాడు) మాయాపూర్‌లో జన్మించారు ఆయన అవతారం వల్ల ప్రపంచంలో ఎన్నో మార్పులు జరిగాయి కృష్ణ సంకీర్తనోద్యమం ప్రపంచమంతా వ్యాపిస్తుందని చైతన్య మహాప్రభువు భవిష్యవాణి పలికారు. తదనుగుణంగానే నేడు 53 దేశాలలో సంకీర్తన బృందాలు నిరంతరం పర్యటిస్తూ, భగవద్గీత, శ్రీమద్భాగవతం, తదితర వైదిక వాఙ్మయాన్ని 72 భాషలలో అనువదించి, పంచిపెడుతున్నారు ఈ సంకీర్తన బృందాలు మృదంగతాళ ధ్వనులతో సంకీర్తనం చేస్తూ, శ్రీ చైతన్యమహాప్రభువు భవిష్యవాణిని సార్థకం చేస్తున్నవి శ్రీ ఎ ఎ సి. భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారు స్థాపించిన ఈ అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం శరవేగంతో ప్రపంచమంతటా వ్యాపిస్తున్నది. ఈ సంఘం ప్రపంచమంతటా శ్రీ చైతన్య మహాప్రభు పంచశత జయంత్యుత్సవాలు మహా వైభవంగా జరిపింది. చైతన్య మహా ప్రభువు ప్రసాదించిన విజ్ఞానానికి సంబంధించిన ప్రదర్శనం మాయాపూర్‌లో జరిగింది. మాయాపూర్‌లో ఏర్పాటుచేసినతాత్కాలిక నగరంలో 10 వేల మందికి సకల వసతులూ కలిగించారు. ప్రపంచం నాలుగంచుల నుంచి 2000మంది ఇస్కాన్ ప్రతినిధులు, 20 లక్షలకు పైగా భక్తులు మాయాపూర్ ఉత్సవంలో పాల్గొన్నారు రెండు వారాల పాటు జరిగిన ఈ ఉత్సవంలో అమెరికా, యూరోప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆసియా ప్రాంతాల నుంచి వచ్చిన 2000 మంది భక్తులు పాల్గొన్నారు. వీరు 1984 సెప్టెంబరులో ద్వారక నుంచి ప్రారంభమైన 6000 కిలో మీటర్ల పాదయాత్రలో పాల్గొన్నారు. ప్రత్యేక శాలలలో రెండు వారాల పాటు ఇస్కాన్ కార్యక్రమం గురించిన మహోత్సాహం కలిగించే చలన చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. ఈ సినిమాలలో ప్రత్యేకత చైతన్య మహాప్రభు జీవిత చరిత్ర ఫిలిం ప్రదర్శనం, ఫ్రాన్స్, ఇటలీ, ఇంగ్లాండు, అమెరికా, దక్షిణ ఆఫ్రికా, కెన్యా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, ఈరాన్, జపాన్,చైనా, రష్యా నుంచి కూడా వచ్చిన ఇస్కాన్ భక్తులు మహావేశంతో చేసిన భజనలకు ప్రేక్షకులు ముగ్ధులైపోయారు. వీడియో కార్యక్రమాలను, ప్రసాదాలను, సాహిత్యాన్ని, ఇతర కార్యక్రమాలను చవిచూచి ఆశ్చర్యపడిపోయారు. ప్రపంచంలో జరిగిన ప్రతి వైజ్ఞానిక ప్రగతి కృష్ణుని అనుగ్రహం వల్ల కలిగిందే గనుక వీడియోలు, సినిమాలు,




సంకీర్తన పారవశ్యంలో ఉన్న శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు

ఎలెక్ట్రానిక్ లైట్ డిస్ప్లేలు, 3-డి వివిధ ప్రక్రియలు కృష్ణుని సేవలో వినియోగించాము. యువకుల కోసం, యువ హృదయాల కోసం మాయాపూర్‌లో చాలా చోట్ల ఉద్యానాలు, నీటిబుగ్గలు, పచ్చిక మైదానాలు నిర్మించారు. నదియా ప్రాచీన నవద్వీపానికి పేరు. నవద్వీపం శతాబ్దాలుగా శాస్త్ర విజ్ఞానానికి పుట్టినిల్లు. నదియా తూర్పు భారతానికి ఒకప్పుడు రాజధాని. ఇది వేద వేదాంత విజ్ఞానానికి . ప్ర సి ద్ధి. దేశమంతటిని ఆకర్షించేది · శాస్త్ర చర్చలకు కాణాచి. చైతన్య మహాప్రభువు పూర్వ నామధేయం నిమాయిపండిత్. మహాపండితుడు. పాండిత్యానికి రోసి, కృష్ణ నామ సంకీర్తనకు జీవితాన్ని అంకితం చేశారు. అట్టి మహానుభావుని లీలలు ప్రదర్శనం

హైదరాబాద్ నోట్‌బుక్

జనాన్ని విశేషంగా ఆకర్షించింది చైతన్య లీలా ప్రదర్శన ప్రపంచంలో ప్రవేశించగానే ప్రేక్షకుడు 500 ఏళ్లనాటి ప్రాంతాలకు వెళ్లిపోతాడు ప్రవేశించి మలుపు తిరగగానే వీధులలో అలనాటి చైతన్య మహాప్రభువు, ఆయన సహచరులు, హరినామ సంకీర్తన చేస్తూ, కనిపిస్తారు చేతిలో కాగడాలు పట్టుకొని చాంద్‌కాజీ ఇంటికి వెళ్ళుతున్నవారు, వివిధ లీలలో నివారు కనిపిస్తారు ప్రేక్షకులూ వారిలో ఒకరైపోతారు. పదివేల మంది ప్రేక్షక శ్రోతలు, కూర్చోవడానికి ఏర్పాటు చేసిన సెంట్రల్ పెండార్‌లో సంగీత, నాట్య, నాటకాది కళలలో నిష్ణాతులైనవారు ప్రతి రాత్రి ప్రదర్శన యిచ్చి ఆనందింపజేశారు. ప్రశ్నోత్తర శాలలు, పుస్తకశాలలు, వ్యాపార శాల, ఫలహారశాలలు, యజ్ఞ శాలలు, భక్తులపెరేడ్లు, పరిశ్రమలు, అంతర్జాతీయ అఖండసంకీర్తనలు, భజనలు, ఆరుబయలు గౌర్-నితాయి మందిరం, ఇస్కాన్ చిత్ర శిల్ప ప్రదర్శనం మొదలయినవి ఉత్సవానికి మరింత శోభ చేకూర్చాయి. ఉత్సవం నిజానికి మార్చి 13 నుంచే ఆరంభమయింది. మొదటి వారంలో తెల్లవారు జామున 4-30కు మందిరంలో మంగళహారతి తర్వాత 6-00 గంటలకు శ్రీమద్భాగవతం ఉపన్యాసాల తర్వాత నవద్వీపధాం అంతటా చైతన్య లీలాస్థాన పరిక్రమ జరిగేది. ఈ పరిక్రమ మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగేది. రెండవ వారంలో ఉదయం వివిధ విషయాలపై సదస్సులు, మధ్యాహ్న సాయంకాలలో ఉపన్యాసాలు, కీర్తనలు, గంగలో ఈతలు జరిగాయి. నూతన రాధా మాధవ మందిరంలో అష్టశక్తి విగ్రహాలతోపాటు రాధా మాధవ విగ్రహాల ప్రతిష్ఠ జరిగింది. ఈ ఉత్సవ సందర్భంగా అన్ని దేశాల నుంచి వచ్చిన 300 మంది హరే కృష్ణ దీక్ష స్వీకరించారు దీక్ష స్వీకరించిన వారిలో రష్యావారు ఉన్నారు. ఈ సందర్భంలో గొప్ప యజ్ఞం జరిగింది. 300 కేంద్రాలవారు ప్రదర్శన శాలలు ఏర్పాటు చేశారు. చైతన్య మహాప్రభు లీలా ప్రదర్శనం శాశ్వతంగా ఉండే ఏర్పాటుచేశారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం సంస్థాపకాచార్యులు శ్రీల భక్తి వేదాంతస్వామి ప్రభుపాదుల పుష్ప సమాధి మందిరం ప్రారంభోత్సవం జరిగింది. అంతర్జాతీయ అతిథి గృహ నిర్మాణం పూర్తయింది.5000 ఇళ్ళు గల వేదగ్రామ నిర్మాణం జరుగుతూ ఉంది ఇది ప్రపంచానికే ఆదర్శప్రాయంగా వుంటుంది. చైతన్య మహాప్రభువు జన్మదినమైన మార్చి 26న గౌర పూర్ణిమనాడు జరిగిన ఉత్సవానికి తిరుమల తిరుపతి దేవాలయం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీ ఎస్ లక్ష్మీనారాయణగారు ముఖ్యాతిథిగా పాల్గొన్నారు - అంటూ అధ్యక్ష కార్యదర్శులిద్దరూ మహానంద పారవశ్యంతో వివరించారు

ఉత్సవానికి వెళ్లి వచ్చిన యువభక్త శిఖామణి శ్రీ కృష్ణచంద్రదాస్ (చివుకుల రామకృష్ణ) నాతో ముచ్చటిస్తూ, విదేశాల నుండి వచ్చిన భక్తులు "ఫ్రీసోవియెట్ హరే కృష్ణాస్' అనే బాడ్జిలను పంచి పెట్టారని తెలిపారు ఇది అమెరికా ఉద్యమం కాదని, పవిత్ర భారతదేశపు ప్రాచీనోద్యమమని, రష్యా



మాయాపూర్‌లో నిర్మాణంలో ఉన్న శ్రీల ప్రభుపాదుల పుష్ప సమాధి మందిరం

సాహిత్యం భారతదేశంలో స్వేచ్ఛగా ప్రచారమవుతున్నప్పుడు, కృష్ణ చైతన్య సాహిత్యం రష్యాలో ప్రచారం కావడానికి అవరోధాలు వుండగూడదని, భారత ప్రజలు దీని కోసంపోరాడాలని విదేశీయులు అన్నట్లు శ్రీ కృష్ణచంద్రదాస్ అన్నారు

ఉపశ్రుతి:-

రష్యాలో శ్రీకృష్ణ సాహిత్యానికి ఎంత దుర్గతి పట్టిందో!- అన్నారు శ్రీ హరికేశస్వామి ఏమిటది?- అని అడిగాడు ఒక భక్తుడు. కృష్ణ సాహిత్యం కావాలంటే, అక్కడ ఒకరొకరు చెవులు కొరుక్కుంటారట ఏదో వస్తువు చాటుగా ఆ సాహిత్యం చేరవేస్తారట - అన్నారు శ్రీ హరికేశస్వామి. కృష్ణుడు చేసిన పనులేగా ఇవన్నీ - అన్నాడు ఆ భక్తుడు.

-తిరుమల రామచంద్ర


Printed and Published for Nageswara Rao Estates Private Ltd,
by S. Nageswara Rao at the Andhra Patrika Press,
Gandhinagar, Vijayawada-3, Editor : S. Radhakrishna
Phones :- Business : 61247, 61248, Editorial. 75667


మళ్ళీ మళ్ళీ తిరిగి చూస్తారు జనం
సూపర్ రిన్‌తో తళతళలాడే
ఆ తెల్లదనం
SUPER
RIN
STRIKES WHITER
సూపర్ రిన్‌తో తళతళలాడే తెలుపు
మరే ఇతర డిటర్జెంట్ బిళ్ళ లేదా బార్ కంటే తెలుపు
హిందూస్తాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి


ఆంధ్ర సచిత్ర వారపత్రిక

"నాకు నచ్చిన వ్యక్తి"

వ్యాస రచన పోటీ



మొదటి బహుమతి : పోర్టబుల్ బ్లాక్ అండ్ వైట్ టి.వి.



రెండవ బహుమతి మిక్సర్



మూడవ బహుమతి : పెద్ద సూట్‌కేసు



ప్రత్యేక బహుమతులు 3 హెచ్.ఎం.టి. చేతి గడియారాలు

1. ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులందరూ ఈ పోటీలో పాల్గొనవచ్చు. ఆంధ్రపత్రిక సంస్థలోని ఉద్యోగులు, వారి బంధువులు ఈ పోటీలో పాల్గొనరాదు

2. వ్యాసంలో మీకునచ్చిన వ్యక్తిగా ఇప్పుడు జీవించి ఉన్న వారిలో ఎవరినైనా పేర్కొనవచ్చు.

3. వ్యాసం ఒక అరఠావు (సుమారుగా 17×29 సెం.మి) మించరాదు. కాగితానికి ఒకవైపే సిరా లేదా బాల్‌పెన్‌తో రాయాలి.

4. ఈ పేజీలలో ఇచ్చిన ప్రశ్నావళి, కూపన్‌లని పూర్తి చేసి వ్యాసంతో పాటు విధిగా పంపాలి. వ్యాసం రాయనివారు కూడా ప్రశ్నావళి పూర్తి చేసి పంపవచ్చు.

5. పోటీకి పంపిన వ్యాసాలని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపటం సాధ్యంకాదు. కాబట్టి వాటితో పాటు స్వంత చిరునామాకల, స్టాంపులు అంటించిన కవర్లు జతపరచవద్దని కోరుతున్నాము.

6. గడువుతేదీ 31–5–1986 ఆ తర్వాత అందిన వ్యాసాలు పరిశీలింపబడవు.

7. ఈ పోటీలో తుది నిర్ణయం సంపాదకునిదే. పోటీలో పాల్గొనే వారంతా దానికి బద్ధులై ఉండాలి. దీని విషయమయి ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

8. పోటీకి పంపే వ్యాసాలని సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధినగరం, విజయవాడ-520003 అన్న చిరునామాకి పంపాలి. కవరుమీద "నాకు నచ్చిన వ్యక్తి వ్యాసరచన పోటీకి" అని స్పష్టంగా రాయాలి.

పాఠకులందరూ ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొని దీనిని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాము.

–సంపాదకుడు

ప్రశ్నావళి

ముగింపు తేదీ : 31–5–1986

1. నాకు ఎక్కువ నచ్చిన శీర్షిక ______________________

2. కథలు	చదువుతాను	☐	చదవను	☐
3. సీరియల్ నవలలు	చదువుతాను	☐	చదవను	☐
4. సినిమా శీర్షిక	చదువుతాను	☐	చదవను	☐
5. న్యూఢిల్లీ లేఖ	చదువుతాను	☐	చదవను	☐
6. హైదరాబాద్ నోట్‌బుక్	చదువుతాను	☐	చదవను	☐
7. బొమ్మల కథ	చదువుతాను	☐	చదవను	☐
8. వారఫలాలు	చదువుతాను	☐	చదవను	☐
9. ప్రశ్నావళి	చదువుతాను	☐	చదవను	☐
10. డాక్టర్ సలహాలు	చదువుతాను	☐	చదవను	☐
11. ధర్మపథం	చదువుతాను	☐	చదవను	☐
12. కార్టూన్‌లు	చూస్తాను	☐	చూడను	☐
13. కవిత	చదువుతాను	☐	చదవను	☐
14. ఉత్తరాలు	చదువుతాను	☐	చదవను	☐
15. సినిమా శీర్షికలో సినిమా ప్రముఖులతో ఇంటర్వ్యూలు	ఉండాలి	☐	ఉండనక్కరలేదు	☐
16. వ్యాసాలు	చదువుతాను	☐	చదవను	☐
17. ఆంధ్ర సచిత్ర వారపత్రికకి లేఖలు	రాస్తాను	☐	రాయను	☐
18. ఆంధ్ర సచిత్ర వారపత్రిక నాకు సక్రమంగా	అందుతోంది	☐	అందటంలేదు	☐
19. నేను ఆంధ్రసచిత్ర వార పత్రికని తెప్పించేది	ఏజెంటుద్వారా	☐	పోస్టుద్వారా	☐
20. నేను ఆంధ్రసచిత్రవార పత్రికని ప్రతివారం షాపులో కొంటాను	అవును	☐	కాదు	☐

(తగిన విధంగా ఆయా గదులలో ✓ గుర్తుపెట్టండి)

- -

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

"నాకు నచ్చిన వ్యక్తి"

వ్యాస రచన పోటీ

వ్యాసం రాసిన వారి పేరు : ....

పూర్తి చిరునామా : ....


....

....

....

kasi

రిఫ్రిజిరేటర్లన్నీ ఒకే పద్ధతిలో తయారుకాలేదు



జపాన్ సాంకేతిక పరిజ్ఞానం వల్లనే ఆల్విన్‌కు ప్రత్యేకమైన ప్రత్యేకత ఏర్పడింది.

పోటీలేని నిరంతర సేవ. మేటిలేని పనితనం. నిశ్చలమైన, నిశబ్దమైన సమర్థత.

అవే కొత్త ఆల్విన్ 2000 ఎస్.ఎల్. సిరీస్ రిఫ్రిజిరేటర్లు మీ కోసం. జపాన్‌వారి సాంకేతిక పరిజ్ఞానం మరియూ గ్యారంటీతో లభిస్తున్నాయి.

హిటాచీవారి లైసెన్సుతో తయారు చేయబడిన కంప్రెస్సర్ సాఫీగా, నిశబ్దంగా పనిచేస్తుంది.

అత్యుత్తమమైన రోల్‌బాండ్ ఫ్రీజర్ అతి ఎక్కువ చల్లదనాన్ని అతి తక్కువ వ్యవధిలో ఇస్తుంది,

ఆల్విన్ 10 శాతం తక్కువ విద్యుచ్ఛక్తి వినియోగిస్తుంది.

170 నుండి 250 వోల్ట్స్ విద్యుచ్ఛక్తికి తగినట్లు తయారుచేయబడినది కనుక వోల్టేజ్ స్టెబిలైజర్ ఉపయోగించ నక్కరలేదు.

స్వయంగా నీరు తోడివేసుకొనే పద్ధతి ఉన్నందువలన డీఫ్రాస్టింగ్ మరింత సులభం.

ఆల్విన్ రిఫ్రిజిరేటర్లు 85, 165, 300 లీటర్స్ సింగిల్ డోర్ మోడల్స్‌లోను, మరియు 165, 300, 380 లీటర్స్ డబుల్‌డోర్ మోడల్స్‌లోను, లభిస్తున్నాయి.

వివిధ రకాల్లో, సైజుల్లో, మీ ఎంపికకోసం

మీకు జీవితాంతం అతి త్వరితమైన సేవ, దేశమంతటావున్న ఆల్విన్ డీలర్లద్వారా లభిస్తుంది

అందుకోసమే


అన్ని సమయాలకు ఆల్విన్

7 సంవత్సరాలు గ్యారంటీ

IS:1476 ISI

ఆల్విన్

2000 ఎస్ ఎల్ రిఫ్రిజిరేటర్లు



హిటాచి వారి నుండి లైసెన్సు పొందినది

HITACHI

ఆల్విన్ ఏరియా సేల్స్ ఆఫీసులు ఈ దిగున స్థలాలలో వున్నాయి:

అహమ్మదాబాద్, బెంగుళూరు, భోపాల్, భువనేశ్వర్, బొంబాయి, కలకత్తా, చండీఘర్, ఢిల్లీ, ఎర్నాకులం, గౌహతి, ఘజియాబాద్, హైదరాబాద్, జైపూర్, కాన్‌పూర్, మద్రాసు, పాట్నా, విజయవాడ మరియు విశాఖపట్నం

MAA(S) ALN 9A TEL 85


AVM
ఇద్దరూ ఉద్యోగస్తులైతే!?...
ఈ ఇంట్లో ఇద్దరూ ఉద్యోగాలకి పోతారా! మనం నెమ్మదిగా అన్నీ చక్కబెట్టుకోవచ్చు!..
మీ వారి కెంత జీతం?..
నే వెయ్యి సంపాదిస్తున్నా! ఆయన బోడి ఐదొందలు!
మా బాస్ రమ్మంటే వెళ్ళానోయ్ సినిమాకి!..
నేనూ మా బాస్‌తో వెళ్తే అప్పుడు తెలుస్తుంది మీకు!
ఎంత మంచి పిల్లలు నీకు!?
మా వారికి తిరుపతిలో ఉద్యోగం, నాకేమో "విజయవాడ" లో!..
నీకేంట్రా బంగారు పిచ్చుకవి! మా అమ్మా నాన్నా ఇద్దరూ సంపాదిస్తున్నారు..
ఆ వూళ్ళో ఒక్కదానివే ఎట్లా వుంటున్నావోయ్!
ఇక్కడ మీరెట్లా వున్నారో! అక్కడ నేనూ అంతే!..

Regd. No. H/VJ-41 ANDHRA SACHITRA VARA PATRIKA
2–8, MAY, '86



kiron/apco/85